అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 28-8-2023

సంపుటి : 9 సంచిక : 238 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50




(ఫైల్)

అరుణాంజలి...

ప్రపంచబ్యాంకు ఆడుతున్న నాటకాలిక సాగవంటూ
నగరమూ నడిబొడ్డుకొచ్చి చంద్రబాబుకు సవాలిసిరి
పెంచిన కరెంటు బిల్లు కట్టమూ ఛల్ కట్టమంటూ
అసెంబ్లీ ముందుకొచ్చీ గుండుకూ గుండెల్ని చూపిన
వీరులారా వందనాలూ..మా శూరుల్లారా వందనాలూ..
విష్ణువర్ధన్ బాలస్వామీ..మా రామకృష్ణకు వందనాలూ..

- నేడు విద్యుత్ పోరాట అమరుల సంస్మరణ





జాబిల్లి టెంపరేచర్ ఎంతంటే..

- అందిన తొలి పరిశోధన
- ఇస్రో ప్రకటన

బెంగళూరు: చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా అడుగుపెట్టిన చంద్రయాన్-3 తొలి శాస్త్రీయ పరిశోధన వివరాలను పంపింది. ఈ వివరాలను ఇస్రో ఆదివారం వెల్లడించింది. చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్‌లోని 'చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్‌పరిమెంట్ (చస్టే)' పేలోడ్ చంద్రుడి ఉపరితలంపై, కాస్త లోతులో సేకరించిన ఉష్ణోగ్రతల గణాంకాలను గ్రాఫ్ రూపంలో ఇస్రో వెల్లడించింది.'చాస్టే పేలోడ్.. చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద నేల పైపొర ఉష్ణోగ్రతలను లెక్కిస్తుంది. దీని ద్వారా చంద్రుడి ఉపరితల థర్మల్ ధర్మాలను అర్థం చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది. చంద్రుడి నేలపై 10 సెంటిమీటర్ల లోతువరకు చొచ్చుకెళ్లి, ఉష్ణోగ్రతలను లెక్కించే సామర్థ్యం ఈ పేలోడ్‌కు ఉంది. దీనికి 10 సెన్సర్లు అమర్చి ఉన్నాయి' అని ఇస్రో పేర్కొంది. చంద్రుడి ఉపరితలంపైన, కాస్త లోతులో నమోదైన ఉష్ణోగ్రత వైవిధ్యాలు సంబంధిత గ్రాఫ్‌లో కనిపిస్తున్నట్లు చెప్పింది. ఇస్రో విడుదల చేసిన గ్రాఫ్ ప్రకారం.. చంద్రుడి ఉపరితలంపై ఉష్ణోగ్రత సుమారు 50 డిగ్రీలుగా ఉంది. అదే 80 మిల్లీమీటర్ల లోతులో దాదాపు -10 డిగ్రీలుగా చూపిస్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంలో ఉష్ణోగ్రతలకు సంబంధించి ఇవి మొదటి వివరాలు అని ఇస్రో వెల్లడించింది.



ఎమ్ఎమ్‌టీఎస్‌కు మంగళం!

వంద రోజుల్లో 60 రోజులు సర్వీసులు రద్దు

అవును...కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లో ఎమ్ఎమ్‌టీఎస్ (మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం) రైళ్లకు మంగళం పాడేందుకు ప్రయత్నిస్తోంది. సర్వీసుల సంఖ్యను క్రమంగా తగ్గిస్తూ, ఇష్టం వచ్చినట్టు ట్రిప్పులు రద్దు చేస్తూ, పట్టణ ప్రయాణీకులు సబర్బన్ రైలు ఎక్కేందుకు వీలులేని పరిస్థితుల్ని సృష్టిస్తోంది. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 50 శాతం దాటట్లేదని ప్రచారం చేస్తూ చౌకైన ప్రజా రవాణా వ్యవస్థను ప్రయాణీకులకు దూరం చేస్తున్నది. ఓఆర్‌ను సాకుగా చూపి, శాశ్వతంగా వీటిని రద్దు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.



- ఓఆర్ 50 శాతం దాటట్లేదంటున్న అధికారులు
- రైళ్లు నడిస్తేనేగా ఓఆర్ వచ్చేదంటున్న ప్రయాణీకులు
- రెండో దశ అంటూ మరో రాజకీయ రూట్‌మ్యాప్
- వందేభారత్ కోసం పేదల ప్రజారవాణాకు బ్రేక్
- సర్వీసులు రద్దు చేసి తనిఖీలంట
- అనాలోచితంగా కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ నిర్ణయాలు

ఎస్ఎస్ఆర్ శాస్త్రి

శివారు ప్రాంతాల ప్రజలు తక్కువ ఖర్చుతో సిటీలోకి రావడానికి ఉన్న ఏకైక ప్రజారవాణా వ్యవస్థ ఎమ్ఎమ్‌టీఎస్. ఇప్పటికే పేదలు ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడం, ఉన్న కొన్ని ప్యాసింజర్ రైళ్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల చార్జీలు వసూలు చేయడం వంటి ఆర్థిక దోపిడీకి ఒడిగడుతున్న మోడీ సర్కారు ఇప్పుడు ఎమ్ఎమ్‌టీఎస్‌కే ఎసరు పెట్టింది. గడచిన వంద రోజుల్లో 60 రోజులు పాటు ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లు రద్దు అయ్యాయి. ఆగస్టు 14 నుంచి ఇప్పటి వరకు అసలు ఈరైలు పట్టాలే ఎక్కలేదు. పైగా సెప్టెంబర్ 3 వరకు నడిపేది లేదని దక్షిణ మధ్య రైల్వే ముందస్తు ప్రకటన కూడా చేసింది. సామాన్య ప్రజలతో పాటు రైల్వే ఉద్యోగులు కూడా ఎమ్ఎమ్‌టీఎస్‌లో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తారు. హైదరాబాద్ సిటీలో వేలల్లో ఇండ్ల కిరాయిలు కట్టలేని పేద, మధ్య తరగతి ప్రజలు శివారు ప్రాంతాల్లో తక్కువ ...5లో

ఇదో రకం తనిఖీ

ఎమ్ఎమ్‌టీఎస్‌ను చంపేయడం కోసం రైల్వే ఉన్నతాధికారులు పడుతున్న తపన కాస్తా కూస్తా కాదు. ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. కానీ ఈనెల 24వ తేదీ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్‌కుమార్ జైన్‌తో కలిసి ఎమ్ఎమ్‌టీఎస్ రైలులో ప్రయాణించి తనిఖీలు చేశారు(ట). సికింద్రాబాద్-లింగంపల్లి మధ్య వారు ప్రయాణీకులతో కూడా మాట్లాడారని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఓ పత్రికా ప్రకటన పంపారు. సదరు జనరల్ మేనేజర్ తన బృందంతో కలిసి ఎమ్ఎమ్‌టీఎస్ ట్రైన్ నెంబర్ 47160లో సికింద్రాబాద్ నుంచి లింగంపల్లి వరకు ప్రయాణించి, అక్కడి ...5లో

రెండో దశ రాజకీయం

ఎమ్ఎమ్‌టీఎస్ రెండో దశ పేరుతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ మరో నాటకానికి తెరలేపింది. దీనిపై సికింద్రాబాద్ లోక్‌సభ సభ్యులు, కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి కూడా అనేక ప్రకటనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కలిసిరావట్లేదనీ, తన వాటా నిధులు ఇవ్వట్లేదని ఆరోపణలు చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా ధీటుగానే సమాధానం చెప్పింది. తొలి దశ ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లనే సక్రమంగా నడపట్లేదనీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి డబ్బు తీసుకొని సరకు రవాణా రైళ్లను ఆ ట్రాక్‌లపై తిప్పుతున్నారని ఆరోపిస్తుంది. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడని సర్వీసులకు డబ్బు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు. ఎమ్ఎమ్‌టీఎస్ తొలి విడత రెండో దశ మార్గం ప్రాజెక్ట్ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.160 కోట్లు ఇవ్వాలని ...5లో



దళిత్ సమ్మిట్‌లో నేతల అభివాదం...

డిసెంబర్ 4న చలో పార్లమెంట్

జాతీయ దళిత్ సమ్మిట్ పిలుపు

- ఎస్సీల సమస్యలపై జాతీయ ఉద్యమం
- భవిష్యత్తులో రాష్ట్రాల వారీగా సదస్సులు
- ప్రజల్లోకి బీజేపీ సర్కార్ దళిత వ్యతిరేక విధానాలు
- 2024 ఎన్నికల్లో దళితుల సమస్యలే రాజకీయ ఎజెండా
- హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసిన సమావేశాలు
- పది మందితో జాతీయస్థాయి సమన్వయ కమిటీ ఎన్నిక

దేశంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయస్థాయిలో ఉద్యమాన్ని నిర్మించనున్నట్టు జాతీయ దళిత సమ్మిట్ ప్రకటించింది.

వివరాలు 11లో..

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

- జాతీయ దళిత్ సమ్మిట్‌లో ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్


వివరాలు 11లో..

సరెండరా...సమదూరమా?

ఎంఐఎంతో దోస్తానా సరే...బీజేపీ పట్ల బీఆర్ఎస్ వైఖరేంటి?

- బీఆర్ఎస్ అధినేత వైఖరిపై సర్వత్రా చర్చ

గుడిగ రఘు



'బీజేపీ దేశానికి పట్టిన పీడ... కేంద్రంలో ఆ పార్టీ ఓడిపోతేనే దేశం బతికి బట్టకడుతుంది' నిన్నమొన్నటి వరకు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు జాతినుద్దేశించి చేసిన ప్రసంగమిది.

బీజేపీని ఓడించేందుకు, దాన్ని ఏకాకిని చేసేందుకు దేశంలోని ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే ప్రణాళికలు రచించారు. కానీ కొంత కాలంగా ఆయనలో, పార్టీ ముఖ్య నేతల్లో వచ్చిన మార్పు విస్మయానికి గురి చేస్తున్నది. ఇటీవల ఆ పార్టీ ఇంటా, బయటా నిర్వహించిన బహిరంగ సభల్లో కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తున్నారు. బీజేపీని పల్లెత్తు మాట అనేందుకూ సాహసించట్లేదు. హిందుత్వ అజెండాతో దూకుడు ప్రదర్శిస్తూ, నిత్యం వివాదాస్పదుడిగా మారిన బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను ఆ పదవి నుంచి బీజేపీ అధిష్టానం తప్పించినప్పుడే బీజేపీ-బీఆర్ఎస్ దోస్తానా వెల్లడైందని ఇరు పార్టీల్లోనూ చర్చ జరిగింది. సీఎం కేసీఆర్‌కు నమ్మకస్తుడైన కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డికి బీజేపీ పార్టీ అధ్యక్ష పదవి కట్టబెట్టగానే దోస్తానా ఖరారైందనే ప్రచారం పీక్ స్టేజికి వెళ్లింది. ఈ సయోధ్య ఫలితంగానే లిక్కర్ స్కాంలో కవిత విచారణ మందగించిన విషయమూ ...5లో

119 స్థానాల్లో బీజేపీకి డిపాజిట్ గల్లంతే

మంత్రి కేటీఆర్ ట్వీట్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 119 డిపాజిట్ గల్లంతు కావడం ఖాయమని మంత్రి కె.తారకరామారావు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. ఆ పార్టీ 2018లో రాష్ట్రంలోని 119 సీట్లకు గానూ 118 సీట్లలో పోటీ చేసి 100కు పైగా సీట్లలో డిపాజిట్లు కోల్పోయిందని గుర్తుచేశారు. ఆ పార్టీ దేశ సామాజిక, రాజకీయ పరిస్థితిని బీజేపీ అర్థం చేసుకోలేదని విమర్శించారు. ఖమ్మం సభలో వైరుధ్యాలు, అబద్ధాలు, ...5లో


ఫ్లాట్ ఇప్పిస్తానంటూ అఘాయిత్యం

రాజస్థాన్‌లో బీజేపీ నేత నయవంచన...



జోధ్‌పూర్: మాయ మాటలు నమ్మి వచ్చిన ఓ మహిళను ఓ బీజేపీ నేత వంచించాడు. ఆమె అవసరాన్ని అవకాశంగా తీసుకుని లైంగికదాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగక అతని స్నేహితుడితో కూడా ఆమెపై అఘాయిత్యం చేయించాడు. జోధ్‌పూర్ జిల్లాలోని పాలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. పాలీ ఏరియాకు చెందిన స్థానిక బీజేపీ నేత ...5లో

చంద్రుడి చెంతకు ఉల్లి ధరలు...



న్యూఢిల్లీ : చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమై జాబిల్లి దక్షిణ ధ్రువంపై కాలు పెట్టిన తొలి దేశంగా భారతావని ఆవిర్భవించినందుకు అందరం సంతోషించాం. ఇప్పుడు ఉల్లి ధరలు కూడా చందమామను తాకేందుకు తహతహలాడుతున్నాయి. నిన్నటి వరకూ వంద రూపాయలకు ఆరేడు కిలోల ఉల్లిగడ్డలు లభించేవి. కానీ ఇప్పుడో...రిటైల్ మార్కెట్‌లో ఉల్లి ధర కిలో 30 నుండి 50 రూపాయలు పలుకుతోంది. ఉల్లి పంటను అత్యధికంగా సాగు చేసే నాలుగు ప్రధాన రాష్ట్రాలలో గత నెల రోజులుగా హోల్‌సేల్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. 2021-22 సమాచారం ప్రకారం మహారాష్ట్రలో ...11లో

ఓవైసీ చేతిలో కారు స్టీరింగ్

బీఆర్ఎస్, మజ్లిస్‌ను ఎదుర్కొనేది బీజేపీయే..

- మోసకారి కేసీఆర్
- ధాన్యం కొనుగోళ్ల పేరుతో రాజకీయం
- తెలంగాణ ధాన్యం మొత్తం కేంద్రమే కొనుగోలు
- కేసీఆర్ ప్రభుత్వాన్ని సాగనంపాలి.. : ఖమ్మం 'రైతు గోస- బీజేపీ భరోసా' సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ ఖమ్మం:

రైతులను బీఆర్ఎస్ మోసం చేస్తుందని.. వారినే కాక, బీసీ, దళిత, మహిళా, యువత వ్యతిరేక ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కేసీఆర్ ప్రభుత్వమేనని, దీన్ని సాగనంపాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోళ్ల పేరుతో కేసీఆర్ రాజకీయం చేస్తున్నారన్నారు. కారు స్టీరింగ్ ఓవైసీ చేతిలో ఉందని వ్యాఖ్యానించారు. మోడీ ప్రభుత్వం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, కనీస మద్దతు ధరను 66శాతం పెంచిందని తెలిపారు. ఖమ్మం పట్టణంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ...5లో

జనం లేక కమలం గోస

లక్ష మంది రాకపాయె.. 22 మంది చేరకపాయె..

- 'రైతుగోస.. బీజేపీ భరోసా' సభ వెలవెల
- రాష్ట్రనాయకత్వంపై అమిత్‌షా చిర్రుబుర్రు
- కళతప్పిన సభపై ట్రోలింగ్‌లు ఆపాలని విజ్ఞప్తులు

ఆర్టీసీ బస్సులిచ్చి కేసీఆర్ సహకారం



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

బీజేపీ హంగామా తుస్సుమంది. అమిత్‌షా సభ అట్టర్ ఫ్లాప్ అయింది. లక్ష లక్ష్యం పెట్టుకుంటే అందులో పదోవంతే రావడంతో చివరికి కేంద్రహోంమంత్రి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సభా ప్రాంగణంలో జనాన్ని చూసి రాష్ట్ర నాయకత్వంపై చిర్రుబుర్రులాడారని తెలుస్తోంది. ఈ సభ కోసం ఒక్క హంగామానా..! వివిధ రాష్ట్రాల ఎమ్మెల్యేలు రావడం.. సమావేశాలు, ప్రెస్‌మీట్లు పెట్టడం.. క్యాడర్‌ను కార్యోన్ముఖులను ...5లో



వికలాంగుల విద్యా, ఉపాధి కోసం ప్రత్యేక విధానాన్ని ప్రకటించాలి

ఆటిజం, వినికిడి థెరపీ కేంద్రాలను ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి

- సంక్షేమం, సాధికారత కోసం ప్రత్యేక పథకాన్ని ప్రవేశ పెట్టాలి
- వికలాంగుల వాయిస్ మాస పత్రిక వార్షికోత్సవంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వికలాంగులకు విద్యా, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక విదానాన్ని ప్రకటించాలనీ, రాష్ట్రంలో 12.2 శాతం జనాభా కలిగిన వికలాంగుల సంక్షేమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టదా అని వక్తలు ప్రశ్నించారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ నేతృత్వంలో వెలువడుతున్న వికలాంగుల వాయిస్ చైతన్య మాస పత్రిక 9వ వార్షికోత్సవం ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోజరిగింది. వార్షికోత్సవం ప్రత్యేక సంచికను వొకేషనల్ రేహాబిలిటేషన్ సెంటర్ మాజీ డైరెక్టర్ గంగాధర్ రావు, ఎన్‌పీఆర్‌డీ జాతీయ ఉపాధ్యక్షులు యం అడివయ్య, వికలాంగుల వాయిస్ మాస పత్రిక మేనేజర్ కే వెంకట్, అసిస్టెంట్ మేనేజర్ బి స్వామి, అసిస్టెంట్ ఎడిటర్ జె రాజు, ఎడిటోరియల్ బోర్డ్ సభ్యులు అర్ వెంకటేష్, ఎ రంగారెడ్డి, బలేశ్వర్, సాయమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడివయ్య, గంగాధర్ రావు మాట్లాడుతూ దేశంలో 2.68 కోట్ల మంది వికలాంగులు ఉంటే రాష్ట్రంలో 43.04 లక్షల మంది వికలాంగులు ఉన్నారన్నారు. రాష్ట్ర జనాభాలో వీరు 12.2శాతం ఉన్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వీరి సంక్షేమం ఎందుకు పట్టడం లేదని ప్రశ్నించారు. విద్యా, ఉపాధి దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శక్తి సామర్థ్యాలను వెలికి తీయడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనాభాకు అనుగుణంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలన్నారు. దేశలో 50 లక్షల మంది ఆటిజం కలిగిన వారున్నారని తెలిపారు. రాష్ట్రంలో 5 లక్షల మంది ఉన్నారనీ, వీరందరికీ ప్రభుత్వమే ఉచితంగా థెరపీ అందించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో, రాష్ట్రంలో వినికిడి లోపం సమస్య కూడా తీవ్రంగా ఉందన్నారు. వికలాంగుల వాయిస్ మాస పత్రిక మేనేజర్ కే వెంకట్ మాట్లాడుతూ వైకల్య ధృవీకరణ పత్రాలు అందించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ నాయకులు టి మధు బాబు, కాశప్ప, దశరథ్, యశోద, పి కవిత, అరిఫా, ఉపేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు గోపాల్, ఎస్ ప్రకాష్ ,జయలక్ష్మిశంకర్, భుజంగ రెడ్డి, రాధమ్మ, చంద్రమోహన్, లలిత ,బాలయ్య ,చందు, లింగన్న వెంకన్న, సావిత్రి, షాహిన్ బేగం, రాజశేఖర్ గౌడ్, జంగయ్య, నారాయణ లతో పాటు వివిధ జిల్లాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17ను అధికారికంగా జరపాలి

సీఎం కేసీఆర్‌కు కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ విలీన దినోత్సవం సెప్టెంబర్ 17ను గతేడాది తరహాలోనే ఈ ఏడాదీ అధికారికంగా జరపాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు ఆయన ఆదివారం లేఖ రాశారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుల చరిత్రను భావితరాలకు అందించేందుకు పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. మఖ్దూం మొహియుద్దీన్ విగ్రహం ఇప్పటికే ఉందనీ, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని సూచించారు. తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, ధర్మభిక్షం వంటి యోధుల విగ్రహాలను ఆయా కూడళ్లలో ఏర్పాటు చేయాలని కోరారు.

రేపు విద్యాశాఖ కార్యాలయం ముట్టడి

డీఎడ్,బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ప్రకటించిన విధంగా 13,500 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేయాలని కోరుతూ మంగళవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరేండ్లుగా నాలుగు లక్షల మంది అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కేవలం 5,089 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామంటూ ప్రకటించడంతో అభ్యర్థులంతా ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు.

జీవితాల్లో వెలుగులు

- ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్ ప్రకటనపై సంబురాలు
- గాంధీభవన్‌లో బాణా సంచా పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటన నేపథ్యంలో ఆదివారం గాంధీభవన్‌లో సంబురాలు చేసుకున్నారు. బాణ సంచా పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి, దళిత సంఘాల నాయకులు ఉత్సాహంలో ఉత్సవాలలో పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేసారు. అంబేద్కర్ అభయహస్తం పేరు మీద ప్రతి పేద దళిత కుటుంబానికి 12 లక్షల రూపాయలు ప్రకటించడం చారిత్రాత్మకమని ప్రకటించారు. దళిత, గిరిజన డిక్లరేషన్ ట్రైలర్ మాత్రమే పూర్తి మ్యానిఫెస్టోతో మా పూర్తి సినిమా చూపిస్తామని నేతలు ప్రకటించారు. టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మెన్ ప్రీతం మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత, గిరిజనుల అభ్యున్నతే లక్ష్యంగా శనివారం చేవెళ్ళ సభలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించామని తెలిపారు. ఆదివాసి కాంగ్రెస్ పార్టీ చైర్మెన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత, ఆదివాసి, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ కోసం ప్రతిపాదనలు పంపడంలో గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ విఫలమయ్యారని విమర్శించారు. తమ పార్టీని విమర్శించే స్థాయి మంత్రికి లేదన్నారు.

దళిత డిక్లరేషన్ పై మంత్రి కొప్పుల ఆగ్రహం


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ దళిత గిరిజన డిక్లరేషన్ పచ్చి మోసమని ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలో ఉన్నంత కాలం ఏమి ఒరగబెట్టారని ఇప్పుడు డిక్లరేషన్లు ప్రకటిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజల బాగోగులు ఏనాడు పట్టించుకోని వాళ్లంతా ఎన్నికలు వస్తున్నాయానగానే కొత్త పల్లవి ఎత్తు కుంటారని ఎద్దేవా చేశారు. దళితులు, గిరిజనులపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా.. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయాలని సూచించారు.

ఓల్డ్ సిటీ మెట్రో పనుల కోసం డ్రోన్ సర్వే

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పనులు వేగవంతం

- మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాలను రక్షించడానికి
- డ్రోన్ సర్వే సాయం : మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓల్డ్ సిటీ మెట్రో రైలు పనుల కోసం డ్రోన్ సర్వేను హెచ్ఎంఆర్ఎల్ అధికారులు చేపట్టారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పాతబస్తీలో మెట్రో రైలు అలైన్‌మెంట్, ప్రభావిత ఆస్తులు, తదితరాలపై డ్రోన్ సర్వేను ప్రారంభించినట్టు హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు అదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సంప్రదాయక సర్వేతో పాటు, దారుల్-షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ మధ్య ఇరుకైన మార్గంలో రహదారి విస్తరణ, మెట్రో స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన ప్రభావిత ఆస్తుల కచ్చితమైన కొలతలు తీసుకోవడానికి డ్రోన్ సర్వే చేపట్టినట్టు తెలిపారు. మొత్తం 103 మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాల రక్షణ మెట్రో నిర్మాణానికి ప్రధాన సవాలుగా ఉన్నాయని, వాటిని రక్షించడానికి తగిన ఇంజనీరింగ్ పరిష్కారాలను రూపొందించడంలో డ్రోన్ సర్వే సహాయపడుతుందని పేర్కొన్నారు. మెట్రో అలైన్‌మెంట్, పిల్లర్ లొకేషన్లు ఈ నిర్మాణాలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపకుండా ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. డ్రోన్ సర్వే ద్వారా రియల్ టైమ్ డేటా, 3డీ మోడలింగ్, జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) డేటా, క్యాడ్ సాఫ్ట్‌వేర్ ఏకీకరణ, డేటా విశ్లేషణ విజువలైజేషన్‌ను త్వరితగతిన సేకరించవచ్చని తెలిపారు. మరికొద్దిరోజుల్లోనే భూసామర్థ్య పరీక్షలు ప్రారంభించడానికి టెండర్లు కూడా ఖరారు చేస్తామని పేర్కొన్నారు.

కార్డియాక్ రిహాబ్‌తో హృద్రోగుల అద్భుతాలు

పరుగు పందాల్లో పాల్గొంటున్న వైనం

- గుండె జబ్బు బాధితులకు కొత్త ఉత్సాహం





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్డియాక్ రిహాబ్ గుండె జబ్బుల బాధితులకు కొత్త జీవితాన్ని ఇస్తున్నది. ఒకసారి హృద్రోగ బాధితులైతే ఇంటికే పరిమితమై నీరసంగా ఉండే స్థితి నుంచి ఇతరుల్లాగే అన్ని పనులు చేసుకునే సత్తువను అందిస్తున్నది. దీంతో ఆ రోగులు కేవలం కోలుకోవడమే కాకుండా మారథాన్ పరుగు పందాల్లో వరసగా పాల్గొంటూ శభాష్ అనిపించుకుంటున్నారు. దేశంలోనే తొలి కార్డియాక్ రిహాబ్ సెంటర్‌ను హైదరాబాద్‌లో రిహాబ్ స్పెషలిస్ట్ డాక్టర్ మురళీధర్ బాబీ నెలకొల్పారు. ఈ రిహాబ్‌ను తీసుకున్న పలువురు పలు మారథాన్ పరుగుల్లో పాల్గొంటుండటం విశేషం.

గుండె పూర్తిగా పాడైనట్టుగా రోగ నిర్ధారణ పరీక్షలో తేలిన లింగం గతేడాది హాఫ్ మారథాన్‌లో 21 కిలోమీటర్లు పూర్తి చేశారు. ఆగస్టు 26, 27 తేదీల్లో ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ నిర్వహించింది. ట్యాంక్ బండ్ నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు మారథాన్ జరిగింది. ఈ ఏడాది ఆయన 42 కిలోమీటర్ల మారథాన్ చేధించడమే కాకుండా తనను ఒక అథ్లెటిక్‌గా భావించుకునే స్థితికి చేరుకున్నాడు. సత్యమూర్తి (53) గుండెపోటుకు గురైన స్టంట్ వేసుకుని కోలుకున్న వ్యక్తి రిహాబ్ తర్వాత ఆదివారం ఐదో మారథాన్‌లో 42 కిలోమీటర్లు పూర్తి చేయడం విశేషం. గుండెపోటుకు గురయ్యే కుటుంబ ఆరోగ్య చరిత్ర కలిగిన విక్రమ్ (పేరు మార్చాం) 40 ఏండ్లకే మూడు స్టంట్లు వేసుకోవాల్సి వచ్చింది.

అతనికి ఎలాంటి శారీరక శ్రమ చేయకూడదని అప్పటికే సలహా ఇచ్చారు. కానీ ఆరు నెలల కార్డియాక్ రిహాబ్ తర్వాత తను 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ పూర్తి చేయడం గమనార్హం. ఈ కేసులో అతను తన జీవనశైలిని మార్చుకోవడం ద్వారా వ్యాధికారక జన్యువులను నిష్క్రియగా చేయడం, వాటిలో మార్పు తేవడం వంటిది జరిగినట్టు తెలుస్తున్నది. రమేశ్ హార్ట్ ఫెయిల్యూర్ అయినట్టు గుర్తించగానే తనకు గుండె మార్పిడి శస్త్రచికిత్సను సూచించి, విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. తను 4 నెలల కార్డియాక్ రిహాబ్ తర్వాత 10 కిలోమీటర్లు పరుగులు తీశారు. గుండె పోటు తర్వాత స్టంట్ వేసుకున్న అరుల్ ఆనంద్ రావు గతేడాది 10 కిలోమీటర్లు, ఈ ఏడాది 21 కిలోమీటర్లు పరుగెట్టారు.

అతనికున్న మధుమేహం కనిపించకుండా పోయింది. మరో ఇద్దరు రోగులు ఐసీడీ ఉన్న వారు ఐదు కిలోమీటర్లు సాధించారు. వయస్సుతో నిమిత్తం లేకుండా 16 ఏండ్ల హార్ట్ ఫెయిల్యూర్ పేషెంట్ 5 కిలోమీటర్లు సాధిస్తే, దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి కలిగి , నడవొద్దనీ, మెట్లు ఎక్కొద్దనీ డాక్టర్లు సలహా ఇచ్చిన శివకుమార్ (50) కూడా ఐదు కిలోమీటర్లు పరుగెత్తి కార్డియాక్ రిహాబ్ సత్తా చాటారు.

డాక్టర్లు అర్థం చేసుకోవాలి

కార్డియాక్ రిహాబ్ ఇస్తున్న ఫలితాలను కార్డియాలజిస్టులు, కార్డియో థొరాసిక్ సర్జన్లు, ఫిజిషియన్లు, ఇతర డాక్టర్లు అర్థం చేసుకోవాలని కార్డియాక్ రిహాబ్ స్పెషలిస్ట్ డాక్టర్ మురళీధర్ బాబీ సూచించారు. హృద్రోగుల్లో వస్తున్న మార్పును గమనించాలని సూచించారు.

- డాక్టర్ మురళీధర్ బాబీ

నిధులు తీసుకువచ్చే దమ్ములేక విమర్శిస్తున్నారు

బీజేపీ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలు తీసుకురాలేదా?

బీజేపీ నేతలపై తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్ విమర్శలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీని తిట్టడంలో పోటి పడుతున్న బీజేపీ నేతలు కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో ఎందుకు పోటిపడడం లేదని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్ ప్రశ్నించారు. అసలు రైతులకు బీజేపీ పార్టీ ఏం చేసిందని ఖమ్మంలో రైతు సభ పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం సభకు వచ్చిన అమిత్‌షా రైతులకు చేసిన మేలు ఏమి లేకపోవడంతో కేసీఆర్‌పై అసత్య ప్రచారం చేశారని మండిపడ్డారు. తెలంగాణలో ఎక్కడ లేనివిధంగా రైతుబీమా పథకం అమలవుతుందని తెలిపారు. తెలంగాణ రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతుబంధు పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు.

దీనినే ఆదర్శంగా తీసుకుని కేంద్రంలో కిసాన్ సమ్మాన్ యోజన పథకం తీసుకువచ్చిందని విమర్శించారు. రైతు వ్యతిరేక బిల్లులు తీసుకురావాలని చూసిన నీచమైన చరిత్ర బిజేపీ పార్టీదని ఎద్దేవా చేశారు. వేలాది మంది రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో నెలల తరబడి ధర్నాలు చేసిన విషయం యావత్ దేశ ప్రజలు మరిచిపోలేదన్నారు.

మున్నూరు కాపులకు ఎక్కువ సీట్లు ఇవ్వాలి

- కరీంనగర్ నుంచి కొనగాలకు టికెట్ ఇవ్వాలి
- తెలంగాణ మున్నూరు కాపు ప్లీనరీ తీర్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరు కాపులకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని మున్నూరు కాపు ప్లీనరీ తీర్మానించింది. అలా ఎక్కువ సీట్లు కేటాయించిన రాజకీయ పార్టీకే మద్ధతిస్తామని స్పష్టం చేసింది. మున్నూరు కాపు అభ్యర్థులను గెలిపించుకునేందుకు పార్టీలకు అతీతంగా కృషి చేస్తామని తెలిపింది. అదే ప్లీనరీలో కరీంనగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు కొనగాల మహేశ్‌కు సీటివ్వాలని కాంగ్రెస్ పార్టీని కోరుతూ తీర్మానించింది. ఈ సందర్భంగా మున్నూరు కాపు రాష్ట్ర నాయకుడు కాసారం రమేశ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మున్నూరు కాపులకు అన్ని పార్టీలు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

- లేకపోతే ఆందోళన తప్పదు
- నిలోఫర్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ సేవలను క్రమబద్ధీకరించాలనీ, లేకపోతే ఆందోళన తప్పదని నిలోఫర్ ఆస్పత్రి పొరుగు సేవల ఉద్యోగులు హెచ్చరించారు. ఆదివారం నిలోఫర్ ఆస్పత్రి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రతినిధులు సుందర్, సత్యం, రాజు, ప్రవీణ్ కుమార్, జ్యోత్స్న, విజయలక్ష్మి, మౌనిక, శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు.

నిలోఫర్ ఆస్పత్రిలో 18 ఏండ్లుగా సేవలందిస్తున్నామని తెలిపారు. 2006లో విధుల్లో చేరామనీ, కోవిడ్-19 మహమ్మారి కాలంలో ప్రాణాలకు తెగించి సేవలందించినట్టు ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. రెగ్యులరైజ్ చేయని పక్షంలో దశల వారిగా పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు.

కోవిడ్ తర్వాత తమ జీతాల్లో కోతలు పెట్టడం ప్రారంభించారనీ, రూ.27,500 జీతానికి బదులుగా రూ.22,750 మాత్రమే వేతనం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వేతనంలో కోతలు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

జూబ్లిహిల్స్‌లో బిగ్గిస్ బర్గర్ షాపులో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-36 బిగ్గిస్ బర్గర్ షాపులో ఆదివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా షాపులో పొగలు కమ్ముకోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్థానిక అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చినట్టు తెలిపారు. పక్కనే పెట్రోల్‌బంక్ ఉండటంతో స్థానిక ప్రజలు కొద్ది సేపు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే పోలీస్ అధికారులు పెట్రోల్ బంక్‌ను మూయించి, తమ సమాచారం అందించాకే తిరిగి పెట్రోల్ బంకులు ప్రారంభించాలని కోరారు. ప్రాణం నష్టం జరగలేదని, ఆస్తి నష్టం కొంతమేరకు జరిగిందన్నారు. ఈ ఘటన ఎలా జరిగిందో పూర్తి వివరాలు తెలిసిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు అధికారులు తెలిపారు.

రైతులు, గ్రామీణుల హక్కులను గుర్తించాలి

-కేంద్రానికి డాక్టర్ దొంతి నర్సింహా రెడ్డి వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులు, గ్రామీణుల హక్కులను కేంద్రం గుర్తించాలని ప్రముఖ వ్యవసాయ విధాన విశ్లేషకులు డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి కోరారు. నాగపూర్‌లో జరిగిన భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ (బీబీఎస్ఎం) సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి 2018లో రైతుల హక్కులను కాపాడాలని పిలుపునిచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఆ వర్గాలకు మద్ధతుగా నిలిచేందుకు తగిన చట్టాల రూపకల్పనకు పూనుకోవాలని సూచించారు. భారతదేశంలోని వారసత్వ పంటలను, మొక్కల్లో వైవిధ్య రకాలను నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ప్రయివేటైజేషన్ తదితర రూపాల్లో ఎదురయ్యే ఇబ్బందుల నుంచి మేధోపరమైన హక్కులను కాపాడుకోగలుతామని సూచించారు. భారతదేశంలో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు జరుగుతున్న ప్రజా ఉద్యమంలో రైతులు, తోటమాలులు, సామాన్యులు, యువత క్రియాశీలకంగా పాల్గొనాలని దొంతి పిలుపునిచ్చారు.



ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను దేశవ్యాప్తంగా ప్రకటించాలి

మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా అమలు చేయాలని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో ఎంపీ కవిత, ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్సీ తక్కెళ్ల పల్లి రవీందర్‌రావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో ప్రకటించిన డిక్లరేషన్ మోసపూరితమైందని విమర్శించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీలు వెనుకబాటుకు కాంగ్రెస్ కారణమన్నారు. కర్నాటకలో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని తెలిపారు.

ప్రతి ఫిర్యాదుపైనా స్పందించండి

- జిల్లా ఎన్నికల అధికారులకు సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫిర్యాదులు అందిన ప్రతి అంశాన్నీ సవిరంగా పరిశీలించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులను తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ ఆదేశించారు. బహదూర్‌పురా, గోషామహల్, నాంపల్లి, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో వచ్చిన ఫిర్యాదులపై వికాస్‌రాజ్ ఆదివారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, విచారణ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఫిర్యాదులు అందిన ప్రతి అంశాన్ని సవివరంగా పరిశీలించి దిద్దుబాటు చర్యలు చేపట్టి సమగ్ర నివేదిక సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారులను సీఈవో ఆదేశించారు. అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండో ఎస్ఎస్ఆర్ పురోగతిని సమీక్షించారు. అన్ని జిల్లాల్లో18-19 ఏండ్ల వయస్సు గల వారి నమోదు, 18-19 ఏండ్ల లింగ వివరాలు, ఓటర్ల జాబితాలో వికలాంగుల ఓటర్లను గుర్తించడం, ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్ల నమోదులో వందశాతం కృషి చేయాలని కోరారు.

ముఖ్యంగా 18-19 ఏండ్ల యువతను ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు వివిధ ప్రచార పద్ధతులను పాటించాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటరు భాగస్వామ్యాన్ని మెరుగుపరచడంతోపాటు తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారులందరినీ సీఈవో ఆదేశించారు. దీంతోపాటు సీఈఓ కార్యాలయం, ఈసీఐ నుంచి ఫార్వర్డ్ చేయబడిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి, ఆలస్యం చేయకుండా వాస్తవ నివేదికను సీఈఓ కార్యాలయానికి పంపాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించేందుకు తక్షణమే ప్రత్యేక బందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ లోకేష్ కుమార్, జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి వర్సెస్ వట్టె జానయ్యయాదవ్

పోటాపోటీగా ఆందోళనలు

- ఒకేరోజు వట్టెపై 71కి పైగా కేసులు
- జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర


సూర్యాపేటలో బీసీ, ఎస్సీ సంఘాల నేతలు నిర్వహిస్తున్న మంత్రి దిష్టిబొమ్మతో శవయాత్ర

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

దాదాపు తొమ్మిదిన్నరేండ్ల పాటు సూర్యాపేట జిల్లాలో ఏకచక్రాధిపత్యం వహించిన బీఆర్ఎస్ కోటకు క్రమంగా బీటలు బారుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీలో తన మాటే వేదంగా సాగిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డిపై భారీస్థాయిలో విమర్శల పర్వం కొనసాగడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇన్నాళ్లు మంత్రి ప్రధాన అనుచరునిగా ఉంటూ వచ్చిన డీసీఎంఎస్ చైర్మెన్ వట్టె జానయ్యయాదవ్ మంత్రికి ఎదురుతిరగడం.. గతంలో ఎన్నడూలేని విధంగా వట్టెపై భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటం వెనుక రాజకీయ కుట్ర కోణం దాగిందనే ప్రచారం లేకపోలేదు. ఈ నేపథ్యంలో సూర్యాపేట పట్టణంలో ఆదివారం ఒక్కసారిగా ధర్నాలతో వేడెక్కింది. అక్రమ కేసులు ఎత్తివేయాలంటూ వట్టెకు మద్దతుగా కొంతమంది ధర్నా చేస్తే.. తమ భూములు తమకు ఇప్పించాలంటూ మరికొంతమంది జనగామ క్రాస్‌రోడ్డులో ధర్నాకు దిగారు. దాంతో పేటలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం హీటెక్కింది.

పేటలో పోటాపోటీగా ఆందోళనలు..

మంత్రి జగదీశ్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్ మధ్య రగిలిన చిచ్చు కాస్త రచ్చకెక్కింది. జానయ్యను అరెస్టు చేయాలంటూ బాధితులు పోలీసుస్టేషన్‌కు క్యూ కడుతున్నారు. జానయ్య భూఆక్రమణలను నిరసిస్తూ జనగామ క్రాస్‌రోడ్డులో బాధితులు ధర్నాకు దిగారు. అంతేకాదు, వట్టె నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ పలువురు బాధితులు ఆరోపించారు. మరోవైపు బడుగు బలహీన తరగతులకు న్యాయం చేయాలని అడిగినందుకు మంత్రి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ వట్టెకు మద్దతుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. అనంతరం మంత్రి తీరును నిరసిస్తూ వందలాది మంది స్థానికులు మంత్రి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు.

వట్టె జానయ్యయాదవ్‌పై అక్రమ కేసుల్ని వెంటనే ఎత్తివేయాలని ఆయన సతీమణి, సూర్యాపేట మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ వట్టె రేణుక డిమాండ్ చేశారు. బహుజన వాదం ఎత్తుకున్నందుకే మంత్రికక్షగట్టి తన భర్తపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. మంత్రి దగ్గర ఉన్నప్పుడు మంచివాడైన తన భర్త ఇప్పుడు ఎలా కబ్జాకోరు అయ్యాడో మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క రోజు దాదాపు 71 కేసులు పెట్టడం వెనుక మంత్రి ప్రోద్బలం ఉన్నదని, తన భర్తకు ఏదైనా ప్రాణహాని జరిగితే దానికి బాధ్యత మంత్రి దేనని తేల్చిచెప్పారు. అనంతరం ఆమె జానయ్యయాదవ్ అభిమానులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీసులు ముందస్తుగా రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద బారికేడ్స్ ఏర్పాటు చేసి కట్టడి చేశారు. ర్యాలీగా వస్తున్న వారిని అరెస్ట్ చేస్తారని మొదట భావించినా.. పోలీసులు వారికి నచ్చజెప్పి వెనక్కు పంపించారు.

> **జగదీశ్‌రెడ్డి చిట్టా నా దగ్గర ఉంది**
>
> బడుగు, బలహీనవర్గాలకు సరైన న్యాయం చేయాలని అడిగితే.. నాపై కక్షగట్టారు. ఇన్నేండ్ల పాటు లేని కేసులు ఒక్కరోజే 60కి పైగా పెట్టారంటే.. పరిస్థితి ఏంటో అర్థం చేసుకోండి. నాపై వచ్చిన ఆరోపణలకు నేను బహిరంగ చర్చకు సిద్ధం. మంత్రి జగదీశ్‌రెడ్డి తొమ్మిదిన్నరేండ్ల కాలంలో అక్రమంగా సంపాదించిన రూ.వేల కోట్లు ఎక్కడ దాచిపెట్టారో వెలుగులోకి తీసుకొస్తా. నాడు స్కూటర్‌పై తిరిగిన వ్యక్తికి ఇన్ని రూ.వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం ప్రశ్నిస్తే.. ఇంతకు దిగజారడం సరికాదు.
>
> - వట్టె జానయ్యయాదవ్, డీసీసీఎంఎస్ చైర్మెన్



సామాజిక స్పృహతోనే కుటుంబ సంక్షేమ నిధి ఏర్పాటు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి

- మరణించిన టీచర్ కుటుంబానికి రూ.6 లక్షల చెక్కు అందజేత

నవతెలంగాణ-శంషాబాద్

సామాజిక స్పృహతోనే టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ నిధి ఏర్పాటు చేసినట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని కొత్వాల్ గూడ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, టీఎస్ యూటీఎఫ్ సభ్యురాలైన హెబ్సిక(50) గుండెపోటుతో మరణించారు. ఆదివారం ఆమె దశదిన కర్మను శంషాబాద్‌లోని మిషన్ కాంపౌండ్‌లో నిర్వహించగా, కార్యక్రమానికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో పాటు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి హాజరై.. మృతురాలి భర్త ప్రవీణ్‌కుమార్‌కు రూ.6 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులు అకాల మరణం చెందడంతో చందాలు వేసుకొని వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షలు అందజేశామన్నారు. ఉపాధ్యాయులు అకాల మరణం చెందినప్పుడు వారి కుటుంబాలు వీధిన పడకుండా తక్షణ సహాయం చేయాలనే ఉద్దేశంతో సంఘం ఆధ్వర్యంలో ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ (ఎఫ్‌డబ్ల్యూఎఫ్)ను జులై 1న ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన అనంతరం ఇద్దరు ఉపాధ్యాయులు అకాల మరణం చెందారన్నారు. ఇటీవల భద్రాచలంలో కొండయ్య (44) అనే ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించగా, ఆయన కుటుంబం అత్యంత దయనీయ స్థితిలో ఉందని గ్రహించి, వారం రోజుల్లో ఆ కుటుంబానికి రూ.6 లక్షలు అందజేశామని తెలిపారు. హెబ్సిక అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధత, పిల్లల పట్ల ప్రేమ ఆప్యాయత కలిగిన టీచర్ అని కొనియాడారు. ఆమె కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆమె భర్త కూడా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ మానసికంగా కృంగిపోకుండా తన ఇద్దరు పిల్లలను చక్కగా చదివించి భవిష్యత్తులో ప్రయోజకులుగా మారేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వపరమైన అన్ని మరణ సంబంధిత సదుపాయాలు అందించేందుకు తమ సంఘం బాధ్యత తీసుకుంటుందన్నారు. ఎయిడెడ్ స్కూళ్లలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు కూడా ఎఫ్‌డబ్ల్యూఎఫ్‌లో సభ్యత్వం ఇవ్వాలని శంషాబాద్ ఎంబీహెచ్‌ఎస్ హెడ్మాస్టర్ పి.అనిత విజ్ఞప్తి చేశారు. దీనికి వారు స్పందిస్తూ ఇప్పటికే ఎయిడెడ్ స్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయులు కూడా టీఎస్‌యూటీఎఫ్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్‌లో సభ్యులుగా ఉన్నారని, వారికి కూడా సంఘం తరఫున సహాయం అందుతుందని తెలిపారు. ఎఫ్‌డబ్ల్యూఎఫ్ నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు ఐకమత్యంతో సంఘటిత పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించేలా సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ కార్యదర్శి ఈ.గాలయ్య, వీఓటీటీ ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు కే.గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప, సీనియర్ నాయకులు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పీవీ శ్రీనివాస్ ఆదర్శప్రాయులు

తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ గౌరీ శంకర్

- నవతెలంగాణకు పీవీ సేవలు చిరస్మరణీయం : వేణుమాధవ్, నవతెలంగాణ అసిస్టెంట్ ఎడిటర్
- భద్రాచలంలో పీవీ సంస్మరణ సభ


నవతెలంగాణ-భద్రాచలం

చరిత్రలో ఎవరి పేజీ వారి రాసుకుంటారని, అలా పీవీ శ్రీనివాస్ కూడా విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొంటూ యువజన రంగంలో ప్రజా ఉద్యమాలను బలంగా నిర్మించి యువతకు ఆదర్శంగా నిలిచారని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ గౌరీ శంకర్ అన్నారు. నవతెలంగాణ దినపత్రిక మాజీ సీజీఎమ్ పీవీ శ్రీనివాస్ సంస్మరణ సభ ఆదివారం భద్రాచలం పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సభకు తెలుగు రాష్ట్రాల నుంచి ఆయన స్నేహితులు, అభిమానులు, పార్టీ నాయకులు, బంధువులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. భద్రాచలం మాజీ జెడ్పీటీసీ గుండు శరత్ అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభకు గౌరీ శంకర్ హాజరై ప్రసంగించారు. పీవీలో అనేక గొప్ప కోణాలు దాగి ఉన్నాయని, సీపీఐ(ఎం)ని ఎంతో గొప్పగా గౌరవించారని వ్యాఖ్యానించారు. 1980-90 దశాబ్దాల్లో వచ్చిన యువతకు సామాజిక స్పృహ ఎంతగానో ఉందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రజల కోసం పనిచేసే వారు ఉద్యమ భావజాలాలను కలిగి ఉంటారని, అటువంటి వారి కోవలో పీవీ శ్రీనివాస్ పయనం జరిగిందని, అయన్ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ అసిస్టెంట్ ఎడిటర్ వేణుమాధవ్ మాట్లాడుతూ.. నవతెలంగాణ నిర్వహణలో పీవీ శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయమని నవతెలంగాణ అసిస్టెంట్ ఎడిటర్ వేణుమాధవ్ అన్నారు. పత్రికను నిలబెట్టడంలో ఆయన సహకారం మరువలేనిదని తెలిపారు. పత్రిక ప్రారంభంలో అందులో పని చేసే స్టాఫ్‌లో చైతన్యం తీసుకొచ్చి పత్రిక ఎదుగుదలకు ఎంతగానో దోహదపడ్డారని గుర్తుచేశారు. పత్రిక, పార్టీ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారని, నిరంతరం అధ్యయనం మీదనే ఆయన ఫోకస్ పెట్టారని తెలిపారు. తెలంగాణ బుక్ ట్రస్ట్ సెక్రటరీ కె. చంద్రమోహన్ మాట్లాడుతూ.. పీవీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. టీవీ5 ఎడిటర్ వైజే రాంబాబు మాట్లాడుతూ.. మంచి మిత్రున్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతం నుంచి వచ్చి ఓ పత్రికకు సీజీఎం స్థాయికి ఎదగటం.. పీవీలో వృత్తి నిబద్ధతకు నిదర్శనమన్నారు. పీవీ సతీమణి జ్యోతి మాట్లాడుతూ.. తమ అనుబంధాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో నవతెలంగాణ ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్రాంచ్ మేనేజర్ జావిద్, విధాత డిజిటల్ మీడియా ఎడిటర్ తాళ్లూరి జగన్మోహన్, సీపీఐ(ఎం) భద్రాచలం నియోజకవర్గం కో కన్వీనర్ కారం పుల్లయ్య, డీసీసీబీ మాజీ చైర్మెన్ యలమంచిలి రవికుమార్, భద్రాచలం ఎంఈఓ సమ్మయ్య, సీపీఐ(ఎం) భద్రాచలం మండల కార్యదర్శి గడ్డం స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్మథనంలో అసంతృప్తులు..!

- గుంభనంగా ఆశావహులు
- మౌనం వెనుక ఆంతర్యమేంటి..?



- అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపే ఛాన్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్లు ఆశించి భంగపడిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఆశావహులు అంతర్మథనంలో పడ్డారు. ధిక్కార స్వరం వినిపించలేకపోతున్నారు. మొన్నటి వరకు తమకే టికెట్లు వస్తాయని ఆశించిన నాయకులకు అధిష్టానం మొండి చేయి చూపింది. ఆశావహులు పునరాలోచనలో పడ్డారు. టికెట్ దక్కకపోవడంతో చేసేదేమీ లేక మౌనం దాల్చారు. బుజ్జగింపు కూ నోచుకోవడం లేదు. రాయబారాలు లేవు. అసంతృప్తితో లోలోపల తీవ్ర మనోవేదనకు గురవుతున్నా.. బయటకు రాకుండా జాగ్రత్త పడుతున్నారు. ఆశావహుల మౌనం వెనుక ఆంతర్యం ఏముందో.. కార్యకర్తలకు కూడా అర్థం కావడం లేదు. ఇలాగే కొనసాగితే ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. జిల్లాలో ఉన్న ఐదు నియోజకవర్గాలకూ బీఆర్ఎస్ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించింది. నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ అవకాశం కల్పించగా.. ఉప్పల్ అభ్యర్థిని మాత్రమే మార్చారు. అయినా జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి నిరసనలు, ఆందోళనలు జరగడం లేదు. లోపల అసమ్మతి రాజుకుంటున్నా.. బయటకు రానీయడం లేదు. తమ సమీప కార్యకర్తల దగ్గర అధిష్టానం వ్యవహరించిన తీరు గురించి చెబుతూ.. పార్టీకి తాను చేసిన సేవ.. పార్టీ తనకు చేసిన అన్యాయం గురించి చర్చిస్తున్నారు. అధిష్టానం తీరు మారుతుందేమో అని కొందరు ఎదురు చూస్తున్నారు. ఇంకొందరు పార్టీని వీడేది లేదని బహిరంగంగానే చెబుతున్నారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి పోటీ పడ్డారు. చివరకు బీఆర్ఎస్ అధిష్టానం బండారి లక్ష్మారెడ్డి వైపే మొగ్గు చూపింది. కూకట్‌పల్లి నియోజవర్గంలో ముగ్గురు నాయకులు టికెట్ ఆశించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేకే మళ్లీ అవకాశం రావడంతో ఎమ్మెల్సీ నవీన్‌రావు, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు సైలెంట్ అయ్యారు. ఇక్కడ వెంకటేశ్వర్‌రావు బీఆర్ఎస్ రెబెల్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సైతం ఇద్దరు పోటీ పడగా.. సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కే టికెట్ దక్కింది. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజుకు నిరాశే మిగిలింది. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ధిక్కార స్వరం వినిపిస్తుండటంతో శంభీపూర్ రాజు అభ్యర్థిత్వంపై అధిష్టానం మరోసారి ఆలోచిస్తున్నట్టు సమాచారం.

మేడ్చల్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి, మలిపెద్ది సుధీర్‌రెడ్డి టికెట్ కోసం పోటీ పడ్డారు. కానీ అధిష్టానం మాత్రం మళ్లీ మల్లారెడ్డికే టికెట్ కేటాయించడంతో సుధీర్‌రెడ్డి పునరాలోచనలో పడ్డారు. సుధీర్‌రెడ్డి కుమారుడు జెడ్పీ చైర్మెన్‌గా కొనసాగుతున్నారు. తాను పార్టీ మారితే తన కుమారుడి రాజకీయ భవిష్యత్ ఏంటి..? తనతోపాటు ఇతర పార్టీలోకి తీసుకెళ్లాలా..? లేక తానొక పార్టీ, కుమారుడు మరో పార్టీలో కొనసాగాలా..? అని ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఇద్దరు వేర్వేరు పార్టీల్లో కొనసాగితే పరిస్థితులు ఎలా ఉంటాయని లెక్కలేసుకుంటున్నారు. ఇక మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తప్ప మరెవరూ టికెట్ కోసం ఆశ పడలేదు. చింతల కనకారెడ్డి కోడలు విజయశాంతి పోటీలో ఉన్నా.. పేరు అంతగా ప్రచారంలోకి రాలేదు. మల్కాజిగిరి టికెట్ మైనంపల్లికే వచ్చినా తన కొడుక్కి మెదక్ అసెంబ్లీ టికెట్ దక్కకపోవడంతో ధిక్కార స్వరం వినిపిస్తున్నారు.

> **గెలుపోటములపై ప్రభావం**
>
> అసంతృప్తుల మౌనం ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రమాదంగా మారే అవకాశం లేకపోలేదు. ఇప్పటికిప్పుడు ధిక్కార స్వరం వినిపించి తిరుగుబాటు చేయకున్నా.. ఎన్నికల సమయంలో కలిసి పని చేయడం కష్టమే. టికెట్ ఆశించి భంగపడిన వారిని బుజ్జగించినా ఎన్నికల్లో మనస్ఫూర్తిగా ప్రచారం చేస్తారనే నమ్మకం లేదు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం పని చేయాలని వారి వారి క్యాడర్‌కు ఆదేశాలు జారీ చేసే అవకాశం కూడా ఉండకపోవచ్చు. ఇలాంటి పరిణామాలు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములపై తీవ్ర ప్రభావం చూపొచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు సైలెంట్‌గా ఉండి చివరి నిమిషంలో రెబెల్‌గా పోటీలో ఉండే అవకాశాలు లేకపోలేదు.



దిలీప్ ఘనాటేకు బీఆర్ఎస్

టికెట్ కేటాయించాలి

- మరాఠీ బహుసాత్ క్షత్రియ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ కుమార్ జీతెన్

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

హైదరాబాద్‌లోని గోషామహల్ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న మరాఠీలు ఉన్నారని, అక్కడి స్థానిక బీఆర్ఎస్ నాయకులు దిలీప్ ఘనాటేకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని మరాఠీ భహుసాత్ క్షతియ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ కుమార్ జెతెన్ కోరారు. ఆదివారం బొగ్గులకుంటలోని చెంప ఎస్టేట్స్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోషామహల్ నియోజకవర్గంలో 25 వేలకు పైగా మరాఠీ ఓటర్లు ఉన్నారని, నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు దిలీప్ ఘనాటే ఎంతో కృషి చేశారని తెలిపారు. అలాంటి వారికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. సమావేశంలో సమాజ్ ఉపాధ్యక్షులు డాక్టర్ విజయ్ రాన్, ట్రెజరర్ అశ్విన్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సెప్టెంబర్ 4,5వ తేదీల్లో..

తెలంగాణ చేనేత కార్మిక సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభలు

ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంజి మురళీధర్

నవతెలంగాణ-నల్లగొండ

తెలంగాణ చేనేత కార్మిక సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 4, 5వ తేదీల్లో నల్లగొండ పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంజి మురళీధర్ పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలోని చేనేత కార్మికుల ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, నేటి తెలంగాణలో చేనేత వస్త్ర పరిశ్రమ, చేనేత కార్మికుల సమస్యలపై 70 ఏండ్లుగా గల్లీ నుంచి ఢిల్లీ వరకు అనేక ఆందోళనా పోరాటాలను నిర్వహించామని తెలిపారు. చేనేత వస్త్ర పరిశ్రమకు ఉపయోగకరంగా ఉన్న జాతీయ చేనేత బోర్డుతో పాటు మహాత్మాగాంధీ బోనకల్ బీమా యోజన, ఐసీఐసీఐ లాంబార్డ్ హెల్త్ స్కీమ్స్, హౌస్ కం వర్క్ లాంటి కేంద్ర పథకాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న చేనేత పరిశ్రమ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేనేత కార్మికులందరూ ఐక్యమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత సహకార సంఘాలు అప్పుల్లో కూరుకుపోయి సంఘంలోని సభ్యులకు పని కల్పించలేని పరిస్థితిలోకి నెట్టి వేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు చేనేత కార్మికులకు అందడం లేదన్నారు. ఈ నేపథ్యంలో చేనేత సహకార సంఘాలు, సహకార ఇతర రంగంలో పనిచేస్తున్న కార్మికుల వస్త్ర పరిశ్రమ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసం ఈ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కర్నాటి శ్రీరంగం, రావిరాల వెంకటేశ్వర్లు, రాపోలు అయోధ్య, రాపోలు జనార్దన్, రాపోలు గోవర్ధన్, రాపోలు పద్మ, రావిరాల ధనమ్మ, చెరువుపల్లి వెంకటయ్య, కుక్కల యాదగిరి, కొలను సత్యనారాయణ, కొలను శంకరయ్య, పొట్టబత్తుల పరమేష్, కొక్కుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆపరేటర్ మృతి

నవతెలంగాణ-పినపాక

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ శాఖ ఆపరేటర్ మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే బూర్గంపాడు మండలానికి చెందిన కొత్తపల్లి రమేష్ మండలంలోని ఏడూళ్ళ బయ్యారం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం సబ్ స్టేషన్ యార్డ్‌లో ఫీడర్ ఆన్ చేస్తుండగా, ఒక్క సారిగా విద్యుత్ ప్రసరించడంతో షాక్ గురయ్యాడు. వెంటనే గమనించిన విద్యుత్ సిబ్బంది పినపాక ప్రభుత్వ అసుపత్రికి వైద్యం కోసం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మణుగూరు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. మణుగూరు ఏరియా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అందరితో కలివిడిగా కలిసి ఉండే ఉద్యోగి మృతి చెందడంతో విద్యుత్ శాఖ సిబ్బంది తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

డ్రగ్స్ కేసులో చేతివాటం

- రాయదుర్గం ఎస్ఐ అరెస్ట్



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ రాజేందర్ డ్రగ్స్ కేసులో చేతివాటం ప్రదర్శించి అరెస్ట్ కావడం సంచలనంగా మారింది. డ్రగ్స్ సరఫరాపై సైబరాబాద్ పోలీసులు ఓ వైపు ఉక్కుపాదం మోపుతుంటే.. మరోవైపు సైబరాబాద్ పరిధిలోనే పనిచేస్తున్న పోలీసులు డ్రగ్స్ సరఫరాలో కీ రోల్ పోషిస్తున్నారు. నార్కోటిక్ విభాగం అధికారులు వలపన్ని పట్టుకోవడంతో అతడి అవినీతి బయటపడింది. సైబరాబాద్ సైబర్ క్రైమ్ విభాగంలో (సీసీఎస్) నార్కోటిక్ టీమ్‌లో రాజేందర్ ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మహారాష్ట్రలో చేసిన ఓ ఆపరేషన్‌లో పాల్గొన్న రాజేందర్ అక్కడ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన డ్రగ్స్‌ను కోర్టులో డిపాజిట్ చేసే సమయంలో తక్కువగా ఉండటంతో పోలీసులకు అనుమానం వచ్చింది. రాజేంద్రనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఎస్ఐ రాజేందర్ ఇంట్లో తనిఖీలు చేసిన పోలీసులు అక్కడ సుమారు 1,750గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ రాజేందర్‌పై రాయదుర్గం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, రాజేందర్‌పై గతంలోనూ అవినీతి ఆరోపణలు ఉన్నట్టు సమాచారం. రాయదుర్గం ఎస్ఐగా పనిచేస్తున్నప్పుడు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అప్పట్లో అతన్ని సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ఆ ఉత్తర్వులపై కోర్టు నుంచి రాజేందర్ స్టే తెచ్చుకున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్

వెంటనే విడుదల చేయాలి



నాణ్యతలేని 'మన్న ట్రస్ట్' మధ్యాహ్న భోజనం

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పెండింగ్‌లో ఉన్న రూ.5,177 కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పాఠశాల విద్యార్థులకు మన్న ట్రస్ట్ ద్వారా సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేదని, వెంటనే కాంట్రాక్టును రద్దు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌లో సమస్యలు అలాగే ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం యూనివర్సిటీ ఫీజులు పెంచి పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుందని విమర్శించారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో భారీగా పెంచిన ఫీజులను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మూడు రోజులు నిర్వహించిన అధ్యయన యాత్రలో వెలుగులోకి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. ఒక్క బిల్డింగ్‌లోనే మూడు నుంచి నాలుగు గురుకుల పాఠశాలలు కొనసాగుతున్నాయన్నారు. 1200 నుంచి 2వేల మంది విద్యార్థులకు ఒక్కరే ప్రిన్సిపాల్, ఆరుగురు టీచర్లు, మరికొంత మంది కాంట్రాక్ట్ టీచర్లు మాత్రమే ఉండటం సిగ్గు చేటన్నారు. ఇలా ఉంటే విద్యార్థులకు చదువులో ఎలా న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మన్న ట్రస్ట్ ద్వారా సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేకపోవడంతో విద్యార్థులు అన్నం కూడా తినడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే మన్న ట్రస్టు కాంట్రాక్టును రద్దు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు.సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు సరిపడా కూరలు, గుడ్లు, పండ్లు ఇవ్వడం లేదన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, లేదంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కార్తీక్, జిల్లా సహాయ కార్యదర్శులు అరుణ్, వంశీ, జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్, శివ, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుకు వెలుగులద్దిన గిడుగు

మనుషులు కదిలితే సమాజం. కవులు కదిలితే సాహిత్యం. శక్తివంతమైన తెలుగు సాహిత్యాన్ని చెక్కు చెదరకుండా గొడుగై రక్షణ కవచంలా నిలిచి గ్రాంథిక భాష పేరుతో కొందరికే పరిమితం చేసే వారి పాలిటి పిడుగై ఆ ప్రమాదం నుంచి తెలుగు భాష పరిరక్షణ వ్యాప్తికి విశేషమైన కృషిని చేసిన మహనీయుడు శ్రీ గిడుగు రామమూర్తి పంతులు.

గిడుగు రామమూర్తి పంతులు వాడుకభాష ఉద్యమ పితామహుడు. వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు. బహుభాషావేత్త. చరిత్రకారుడు. సంఘ సంస్కర్త. హేతువాది.

గిడుగు రామమూర్తి 1863 వ సంవత్సరం ఆగస్టు 29 న శ్రీకాకుళం జిల్లాలోని పర్వతాలపేట గ్రామంలో జన్మించారు. తల్లి వెంకమ్మ. తండ్రి వీర్రాజు. చిన్నతనం నుంచి తెలుగు భాష పట్ల ఎంతో ఆసక్తిని కలిగి ఉన్న గిడుగు రామమూర్తి ఎనిమిదవయేటనే శబ్దమంజరిని నేర్చుకున్న ఏకసంథాగ్రాహి. తన పద్నాలుగవయేట తండ్రిని కోల్పోయి విజయనగరంలోని మేనమామ గారింట ఉండి మెట్రిక్ చదివి పాసయినారు. రాజాగారి పాఠశాలలో 1880 నుంచి విద్యార్థులకు చరిత్రను బోధించారు. ముఖ లింగ క్షేత్రంలో శాసనలిపిని నేర్చుకొని అనేక చారిత్రక వ్యాసాలను రచించారు.


ఇండియన్ యాంటిక్వరి, మద్రాస్ లిటరేచర్ అండ్ సైన్స్ జర్నల్స్‌లో వీరి వ్యాసాలు ప్రచురించబడ్డాయి. డిగ్రీ పూర్తి చేసి లెక్చరర్ గా పర్లాకిమిడిలో 30 సంవత్సరాలు పనిచేసారు.

1911లో స్వచ్ఛంద పదవీవిరమణ చేసారు. 1940 జనవరి 22న మరణించారు. 48 సంవత్సరాల జీవన కాలంలో అవిశ్రాంత జీవన పయనం వ్యక్తిగా, భాషావేత్తగా వీరిని మహోన్నత వ్యక్తిగా చిరస్థాయిగా నిలబెట్టాయి.

గిడుగు రామమూర్తి పంతులు ఉద్యోగం చేస్తూ చుట్టుపక్కల సవరలను గమనించి వారితో మాట్లాడలేని దశలో వ్యవహర్తను ఇంటికి పిలిపించి సవరభాషలో పుస్తకాలు రచించి వారికి చదువునేర్పే ప్రయత్నం చేసారు. ఒక సంఘ సంస్కర్తగా సవరల జీవితాలను బాగుచేయాలనే సంకల్పంతో వారికి చదువు నేర్పించడం మొదటిపనైతే ఆ ప్రయత్నంతో సవర విద్యార్థులకు తన ఇంట్లో బస కల్పించి వారికి భోజనం పెట్టి, వారికి మార్గదర్శకత్వం వహిస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుడు గిడుగు రామమూర్తి. వీరి సేవలను మద్రాస్ ప్రభుత్వం గుర్తించి 1913 లో 'రావ్ బహద్దూర్' బిరుదు ప్రదానం చేసింది. సవర భాషా వ్యాకరణాన్ని రూపొందించి 1931 లో, సవర -ఇంగ్లీషు కోశాన్ని 1938 లో అచ్చు వేసారు. 1934 లో 'కైజర్ -ఇ - హింద్' బిరుదు కూడా వీరిని వరించింది. 1938 లో 'కళాప్రపూర్ణ బిరుదు' ను పొందారు. వ్యవహారిక భాష కోసం దాదాపు 30 సంవత్సరాలకు పైగా విశేష కృషి చేశారు. శాసన లిపిని నేర్చుకుని చారిత్రక వ్యాసాలు రచించడం ఒక విశేషమైతే 1919 లో 'తెలుగు' అనే మాస మాసపత్రికను స్థాపించి అనేక వ్యాసాలను రచించారు. డా॥శరత్ జ్యోత్స్నారాణి గిడుగు రామమూర్తి తెలుగు పత్రిక ద్వారా చేసిన సేవలను వివరిస్తూ తెలుగు పత్రిక సంపాదకీయంలోని గిడుగు రామమూర్తి తెలుగు భాష వర్తమాన స్థితిగతులను గూర్చి బాధపడుతూ ఆడవాళ్ళు చదువుకోవడానికి, పిల్లలు చదివి ఆనందించడానికి వివిధ స్థాయి పాఠకులు చదివి లోకవృత్తం తెలుసుకోవడానికి తగిన రచనలు తెలుగులో వెలువడడానికి కారణం తెలుగు వచన రచనను అనావశ్యకమైన నియమ నిబంధనలు బాధించడమే అంటారు. ఏ భాష అయినా ఆ కాలపు విజ్ఞాన వ్యాప్తిపైనే ఆధారపడి ఉంటుందని జన సామాన్యంలో విద్యనూ విజ్ఞానాన్ని వ్యాపింపజేయాలంటే వాఙ్మయాన్ని మించిన సాధనం మరొక్కటి లేదని పదే పదే బోధించేవారు గిడుగు రామమూర్తి. ఆయన నడిపిన తెలుగు పత్రిక ఆ రోజుల్లో గొప్ప పత్రికగా వెలుగొందింది.

ఈనాటికీ ఏనాటికీ ఆ పత్రికను తెలుగు ప్రజలు మరిచిపోలేరు అన్నారు.

1919 లో వర్థమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం స్థాపించగా ఈ సమాజానికి గిడుగు కార్యదర్శిగా కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా కొనసాగారు. తెలుగు -సవర నిఘంటువు, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజము, గద్య చింతామణి, వ్యాస కవి శరణ్యము, వ్యాస సంగ్రహము వంటి పలు రచనలతో సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు. 1933లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం సందర్భంగా తెలికచర్ల వెంకటరత్నం సంపాదకత్వంలో 46 పరిశోధక వ్యాసాలతో Missellany of Essays అనే గ్రంథం గిడుగురామమూర్తి పంతులుకి బహుమానంగా ఇచ్చారు. ఈ సందర్భంగా తెలికచర్ల వెంకటరత్నం "వారిది ఉదార హృదయమే. ప్రజాసేవ లోకకళ్యాణము వారి ఆశయములు. వారు పూనుకున్న కార్యాలన్నింటికీ ఇదే మూల సూత్రం" అన్నారు.



తెలుగు కళాసమితి మస్కట్ తెలుగును వాడుక భాషగా తయారు చేసిన గిడుగు రామమూర్తి శ్లాఘనీయులు అని కొనియాడింది.

1907 లో జె.ఎ. యేట్స్ అనే ఇంగ్లీషుదొర వ్యవహార భాషకు పుస్తక భాషకు మధ్యగల తేడాని ప్రశ్నించారు. దీనికి యేట్స్ విశాఖపట్నం లోని ఎ.వి.ఎన్. కళాశాల పి.టి. శ్రీనివాస్ అయ్యంగార్‌ని అడుగగా దీనికి సమాధానం చెప్పగలవారు గురజాడ గిడుగు గార్లన్నారు. దీనిని బట్టి గిడుగు ప్రత్యేకత మనకు తెలుస్తుంది.

గురజాడ, గిడుగు రామమూర్తి పంతులు, శ్రీనివాస్ అయ్యంగార్, యేట్స్ దొరల సమాలోచనలో వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైందన్నారు భాషావేత్త శ్రీ భద్రిరాజు కృష్ణమూర్తి.

సమాజంలో అన్ని రంగాల్లో, ప్రాంతాల్లో వస్తున్న మార్పులు అనుసంధానాలు అమలవుతున్న దశలో ప్రాచీన కావ్య భాష నేర్పడం వల్ల నిత్య వ్యవహారానికి ఉపయోగపడటం లేదనేది గిడుగు వాదన. ఆధునిక విద్యా విధాన బోధన పద్ధతులు భాషాగ్రహణ శక్తికి ఉపకరిస్తాయి. చదువుకోవడానికి రాయడానికి అపరిమిత ఉపకరణాలు అందుబాటులో ఉన్న కారణంగా జ్ఞాపక సంప్రదాయంపై ఆధారపడి ఉన్నారనే సమర్థించుకుంటున్నారని వాదించారు.

"చదవడం కేవలం విద్యను నేర్పడానికి వినియోగించిన మొత్తం సమయాన్ని వస్తువులను పరిశీలించి తెలుసుకోగల సామర్థ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా అతడి వాస్తవిక విజ్ఞానాన్ని విస్తరించడానికి వినియోగించినట్లయితే, సంభాషణల ద్వారా తెలియజేసినట్లయితే తానిప్పటికే తెలుసుకోగలిగిన దానికన్నా ఎన్నో విషయాలను సంవత్సర కాలంలో విద్యార్థి నేర్చుకోగలడు. జ్ఞానం సామాన్య ప్రజల కోసం అయినప్పుడు అర్థం కాని భాషలో ఎందుకు రాయడం నేర్పడం? అని ప్రశ్నించాడు.

ఆ కాలంలో కొందరు కవులు రాజుల మెప్పు కోసం స్త్రీల అంగాంగాలను వర్ణిస్తూ చవకబారు రచనలు చేసారని, విద్యార్థులు చదివించే పుస్తకాలలో అశ్లీల భాగాలని పరిహరించాలని వాదించిన గొప్ప వ్యక్తి గిడుగు రామమూర్తి.

వ్యాకరణం అనే భావానికి అర్థం మారుతోందని, ఆధునికుల దృష్టిలో వ్యాకరణ భాషను అనుసరించేదని గిడుగు రామమూర్తి పాశ్చాత్య ప్రభావం వల్లే రాసారని తెలుస్తుంది.

గిడుగు వ్యాకరణం పట్ల పెట్టిన దృష్టిని గమనించి "మనదైన రీతిలో కాకుండా తెలుగును భాషా దృక్పథంతో భాషలోని వర్ణ నిర్మాణం, రూప నిర్మాణం, సంధి స్వరూపం, సమాసగతి, వాక్య నిర్మాణ రీతి మొదలైన వాటిని అధ్యయనం చేస్తూ ఆయా కాలాల్లోని రచనల నుండి నేటి వరకూ ఉన్న జీవద్భాషా స్వరూపాన్ని వర్ణనాత్మక వ్యాకరణ దృష్టితో పరిశీలించి తెలుగు భాషా స్వరూప విస్తృతిని అటు నిఘంటువుల రూపంలో గాని, వ్యాకరణ గ్రంథాల రూపంలో గాని వెలుగులోకి తీసుకు రావాలి. అది గిడుగుకు తెలుగు వారు అర్పించే నివాళి అన్న భావాన్ని డా॥ డి. విజయలక్ష్మి.

సమాజంలో అన్ని రంగాల్లో, ప్రాంతాల్లో వస్తున్న మార్పులు అనుసంధానాలు అమలవుతున్న దశలో ప్రాచీన కావ్య భాష నేర్పడం వల్ల నిత్య వ్యవహారానికి ఉపయోగపడటం లేదనేది గిడుగు వాదన. ఆధునిక విద్యా విధాన బోధన పద్ధతులు భాషాగ్రహణ శక్తికి ఉపకరిస్తాయి. చదువుకోవడానికి రాయడానికి అపరిమిత ఉపకరణాలు అందుబాటులో ఉన్న కారణంగా జ్ఞాపక సంప్రదాయంపై ఆధారపడి ఉన్నారనే సమర్థించుకుంటున్నారని వాదించారు.

గిడుగు రామమూర్తి ఏది చేసినా సహేతుకంగా చేయడానికి ఇష్టపడతారు. గట్టి గొంతుకతో పుంఖాను పుంఖాలుగా ఉదాహరణలిస్తూ మాట్లాడగలగడం వారి సొంతం. గ్రాంథిక వాదాన్ని చితకగొడుతూ వ్యవహారికాన్ని సమర్థించడం వల్ల పండిత లోకంలో అసామాన్యమైన పేరు వచ్చింది.

గిడుగు రామమూర్తి 25 సంవత్సరాలు ఊరూరా తిరిగి వ్యవహారిక భాష గురించి మాట్లాడి తన అభిప్రాయాల్ని ఒప్పుకున్న వారి సంతకాలు సేకరించి, ఒప్పుకోని వారి సంతకాలు కూడా సేకరించేవారు.

తెలుగు చదువుకున్నా సైన్స్ వలె ఎనాలసిస్ చేసినట్లుగా ఎక్స్పరిమెంట్, అబ్జర్వేషన్, ఇంప్రెషన్స్ రాసి ఆధారాలు ఎలా చూపిస్తామో అలాగే తెలుగులో కూడా చేయాలంటారు గిడుగు.

"ఏ భాషావేత్త అయినా మౌలికంగా పరిశోధన చేస్తే ఎక్కువ రాయలేడు. కాని ఆయన చేసిన పరిశోధన మాత్రం జాతికి ఒక దీపం లాగా, దీప స్థంభం లాగా తెలుస్తుంది. అలాంటి మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అని డా॥ఎల్లూరి శివారెడ్డి ముఖ్య అతిథి ప్రసంగంలో గిడుగు రామమూర్తి 150 వ సదస్సును యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 2013లో నిర్వహించిన సందర్భంలో అన్నారు.

ధ్వనిని ప్రస్తావిస్తూ A manual of Sosa Language (1931) అనే వర్ణనాత్మక వ్యాకరణంలో సవర భాషలోని ధ్వనులు, సంధులు, సమాసాలు, వాక్యాలను, భాషాశాస్త్ర పద్ధతిలో విశ్లేషించడం ధ్వని పదనిర్మాణం, మాండలిక శాస్త్రం, సామాజిక భాషా శాస్త్రం, చారిత్రక భాషా శాస్త్రం, తులనాత్మక భాషా శాస్త్రం, నిఘంటు నిర్మాణం, వ్యాకరణాలతో గిడుగు కృషిని వివరించారు. డా॥ భుజంగరెడ్డి భాషావేత్తగా గిడుగును అభివర్ణిస్తూ అన్నారు.

డా॥దార్ల వెంకటేశ్వరరావు గిడుగు రామమూర్తి భాష సామాజిక దృక్పథం అనే అంశం పై పత్ర సమర్పణ చేసి గిడుగురాసిన వ్యాసాలను ప్రస్తావించారు. 'మరోసారి గిడుగు రామమూర్తి' - చేకూరి రామారావు, నడుపల్లి శ్రీరామరాజు కలిసి చేసిన పుస్తకంలో గిడుగు గురించి అనేక విషయాలు మనకు అవగతమవుతాయని వివరించారు. చివరిగా "తెలుగు సవరల భాషల మీద ఆయన చేసిన అద్భుతమైన పరిశోధన కంటే, వారు చేసిన శాసన పరిశోధనల కంటే, వాడుక భాషా వ్యాప్తికి వారు చేసిన కృషి కంటే వారి వ్యక్తిత్వం గొప్పది" అన్న నడుపల్లి శ్రీ రామరాజు అభిప్రాయం అందరూ ఆమోదించదగినది.

ఇదే అభిప్రాయాన్ని "వారి తెలివి, పట్టుదల, ఓర్పు, నేర్పు, ఔదార్యం, పాండిత్యం, సమయస్ఫూర్తి ఇత్యాదులు అద్భుతం. వాటిని మించినది వారి నిష్కల్మష హృదయం" శ్రీ బేకుమళ్ల కామేశ్వరరావు వ్యక్త పరిచారు.

గిడుగు రామమూర్తిని వివిధ కవులు వ్యక్త పరిచిన అభిప్రాయాలను అచ్చంగా తెలుగు వెబ్ సైట్ లో "తెలుగు సరస్వతి నోముల పంట వ్యావహారిక భాషా పితామహుడు గిడుగురామమూర్తి (1863-1940)" అనే వ్యాసంలో కొంపెల్ల శర్మ సేకరించారు. వాటిలో కొన్ని :

గిడుగు పిడుగు - చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి

మహాప్రస్థానం గీతాలకు కారణం ఎవరంటే భాషకు సంబంధించినంతవరకు గిడుగు వారే- శ్రీ శ్రీ

యుగపురుషుడు - శ్రీ పాద సుబ్రహ్మణ్యం

"Let him believe a cause to be just and true and he would give himself body and soul to it..carelessness of personal gain , rather welcoming loss for its sake" - J.A.Yates .

ఇటువంటి ప్రముఖుల అభిప్రాయాలు ప్రతి రచయిత గిడుగు గురించి ప్రస్తావించకుండా ఉండరనేది వాస్తవం.

సరసభారతి ఉయ్యూరు నుంచి జి. దుర్గాప్రసాద్ "వ్యవహార భాషోద్యమ సారధి గిడుగు" అని అభివర్ణించారు.

ఆంధ్రజ్యోతిలో శ్రీ అల్లం సెట్టి చంద్రశేఖరరావు "గురువుగా గిడుగు" అనే రచనను చేసారు. పలు విశ్వ విద్యాలయాలు సాహితీసంస్థలు గిడుగు రామమూర్తి పేరున సభలు సదస్సులు అనేకం నిర్వహించారు.

వీటన్నింటి ద్వారా గిడుగు రామమూర్తి తాను భాషాపరంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అవగాహనతో అందరూ అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి గ్రాంథిక భాష అడ్డుగా నిలవకూడదని, వ్యవహార భాష ప్రజలను సాహిత్యానికి, భాషకు మరింత చేరువ చేస్తుందని ప్రగాఢంగా విశ్వసించి ఆ దిశలో అధ్యయనం చేసి, ఆధారాలు సేకరించి వివిధ పరిశోధనా వ్యాసాలు రచించి సభలు సమావేశాలలో తాను చూసినవి గమనించనవి భాషా పరమైన భేదాలను ఉదాహరణలతో సహా చూపించి, ఆ విషయమై అభ్యంతరాలను వ్యక్తపరచిన వారితో వాదించి తగిన వివరాలను సేకరించి, సహేతుకంగా చూపించి అందరినీ ఒప్పించగల నైపుణ్యతను కలిగిన వాడని పలువురి చేత అనిపించుకోవడం మాత్రమే కాదు. విశేషమైన కృషి చేసి పలు పరిశోధన వ్యాసాలు రాయడం, 'పత్రిక' కోసం పనిచేయడం, సవరల కోసం చేసిన కృషి వీటన్నింటి ద్వారా 'రామ మూర్తి పంతులు తెలుగు సంస్కృతి నోముల పంట' అని విశ్వనాథ సత్యనారాయణతో కీర్తింపబడ్డ మహామనీషిగా చరిత్రలో నిలిచిపోయారు.

తెలుగు భాషకు కృషి చేసిన నిత్య కృషీవలుడుగా గిడుగువెంకట రామమూర్తి పంచిన తెలుగు వెలుగులను ప్రసరింపజేస్తూ విశ్వజనీనమైన విలువైన తెలుగు భాషను కాపాడుకోవలసిన బాధ్యత మనందరిమీద ఉంది. ఈ దిశలో సేవలందించిన గిడుగురామమూర్తి పంతులుకు తెలుగు వారందరూ రుణపడి ఉన్నారు.



- డా॥సమ్మెట విజయ, 9989820215

నేటి భారతం



కులాల కుళ్ళుతో మతాల మత్తుతో
భావోద్వేగాల ఊబిలో
పడి ఉన్మాదులై
మనిషినని మరిచి
మానవత్వం కాళ్ళదన్ని
మణిపూర్ మహాభారతంలో
మహిళలను వివస్త్రలను చేసి
హత్యలు, అత్యాచారాలు చేసే
కలియుగ కౌరవుల కండకావరాన్ని
కడిగేయగా ఖండించగా
మన భారతమాతలను రక్షించుకోవటానికి
తూటాలకు తూటతోనే బదులిచ్చే
పూలన్ దేవిలై కదలాలి...

- అక్షర జ్వాల, 9010483021

గుడ్ జోక్

చీమల బారులా ఒక వరుస క్రమంలో
వాళ్ళ మీద దాడులు జరుగుతాయి
మాన ప్రాణాలు బూడిద అవుతాయి
అధికార దాహ అతివాద నాయకులు
చూసీచూడనట్టు కళ్ళకు గంతలు కట్టుకొని
తెలిసీ తెలియనట్టు మౌనంగా
ప్రపంచ యాత్రకు బయలుదేరుతారు.



దేశంలో....
మంటల్లో కాలుతున్న బాధితులు గళమెత్తి
తమ జీవించే హక్కు కోసం వీధుల్లో నినదిస్తే
నిరంకుశ రాజదండం రాజద్రోహ చట్టాల వలను
వేసి బంధించి జైలులో వేసి హింసిస్తుంది.

ఈ దశాబ్దంలో అబద్ధం నిజం అయింది
నిజం అబద్ధమై నాలుగు గోడల మధ్య ఉండిపోయింది.
దోషులు బాధితులవుతున్నారు
బాధితులు దోషులై
మానసికంగా శారీరకంగా హింసించబడుతున్నారు.

నిద్రాణమై ఉన్న ప్రాచీన కాలం నాటి ఉగ్రవాదం
వికృత రూపం ధరించి దేశాన్ని అతలాకుతలం
చేసి ప్రపంచ వ్యాప్తంగా పరువు తీస్తుంది.
దేశభక్తి చాటున దేశద్రోహులు మహిళలను
రోబోట్లలా మార్చి నడి వీధులలో నడిపిస్తున్నారు.
ఇదేంటని అడిగితే
అతివాదులకు ఇదో గుడ్ జోక్ అవుతుంది
మానవత్వం లేని మనిషులకు ఇదే దేశభక్తి అవుతుంది.

- సయ్యద్ ముజాహిద్ అలీ, 7729929807

సాహితీ వార్తలు

పుస్తక పరిచయ సభ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దర్పణం సాహిత్య వేదిక, పాలడుగు నాగయ్య కళాపీఠం నిర్వహణలో పాలడుగు సరోజినీదేవి రాసిన 'పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం', సరోజినీదేవి కుసుమాలు' గ్రంథాల పరిచయ సభ సెప్టెంబర మూడవ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు హైదరాబాద్ రవీంద్ర భారతి మొదటి అంతస్తులో జరుగుతుంది. ఇందులో మంత్రి శ్రీదేవి, డా॥ రాయారావు సూర్యప్రకాశ్, బైసా దేవదాసు, బి. వేంకట నరసమ్మ పసుల లక్ష్మారెడ్డి, డా॥నాళేశ్వరం శంకరం, పాలడుగు సరోజినీదేవి, డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి టి. గౌరీశంకర్, రామకృష్ణ చంద్రమౌళి, నక్క హరికృష్ణ, సత్యమూర్తి, ముదిగొండ సంతోష్ పాల్గొంటారు.

కుసుమ ధర్మన్న యువ సాహితీ పురస్కారం

యువ సాహిత్య ప్రతిభా పురస్కారం కోసం యువకవుల/కవయిత్రులు నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రచనలు18 నుండి 35 సంవత్సరాల లోపు వారు పంపించాలి. కనీసం నాలుగు కవితలు ప్రముఖ పత్రికల్లో ప్రచురింపబడి ఉండాలి. దానితో పాటు నాలుగు పోటీలలో విజేతలుగా నిలిచి ఉండాలి. ఇంకా వారి వివరాలను క్లుప్తంగా పంపించాల్సిందిగా కోరుతున్నారు. ఇందులో ఎన్నిక కాబడిన యువకవికి/ కవయిత్రికి 5,116 నగదు బహుమతి, ప్రశంసా పత్రం,శాలువ, వస్త్ర కిరీటం, కంకణం జ్ఞాపికతో ఘనంగా సెప్టెంబర్ నెలలో హైదరాబాద్ లో ప్రతిష్టాత్మకంగా జరగబోయే సభలో సత్కరించడం జరుగుతుంది. దరఖాస్తులను ఐ. బి. ఆర్. ఎఫ్. సభ్యులు -డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్, ఫో.నెం: 9490841284 వాట్సాప్ కు వివరాలను 31 ఆగస్టు తేదీ లోపు పంపాలి.

తెలంగాణకు దక్కిన గౌరవం


ఇటీవల జాతీయ సినిమా అవార్డులు ప్రకటించగానే ఉత్తమ సినిమా విమర్శకులుగా ఎం పురుషోత్తమాచార్య అనే వ్యక్తిని ప్రకటించడంతో సినిమా అభిమానులు ఎవరీ పురుషోత్తమాచార్యులు అని అన్వేషించడం మొదలు పెట్టారు. కనీసం ఫేస్‌బుక్‌లో అకౌంట్ కూడా లేకుండా వికీపీడియాకు అందకుండా తన దారిన తాను సాగిపోయే ఓ నిరాడంబర సంగీత సాహిత్య మూర్తి పురుషోత్తమాచార్యులు. అన్నమయ్య సంకీర్తన ప్రచార సమితి అనే సంస్థను ఏర్పాటు చేసి, ప్రతి నెల 16వ తేదీన అన్నమయ్య సంకీర్తన సభను గత 40 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న కార్యదక్షత ఆయన సొంతం. ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మహమ్మారి, లాక్‌డౌన్ వంటి విపత్తులు కూడా ఆయన చేస్తున్న అన్నమయ్య కార్యక్రమాన్ని ఆపలేకపోయాయి. అదీ ఆయన చిత్తశుద్ధి. ప్రచారానికి ఆమడ దూరంగా ఉండే పురుషోత్తమాచార్యులుకి జాతీయ పురస్కారం రావడంతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చారు. జాతీయ ఉత్తమ సినీ విమర్శకులుగా పురస్కారం తీసుకుంటున్న తొలి తెలంగాణ వ్యక్తి డా॥ ముడుంబై పురుషోత్తమాచార్య.

శాస్త్రీయ సంగీతం, సాహిత్యం పరిశోధనాత్మక దృక్పథంతో అధ్యయనం చేస్తున్న వారు తెలుగులో కొంత అరుదుగానే కనిపిస్తారు. ఈ కోవలోని వారే నల్లగొండకు చెందిన డా॥ ఎం.పురుషోత్తమాచార్య. వీరు 1948లో శ్రీమతి మంగతాయమ్మ శ్రీమాన్ వేంకట నరసింహాచార్యులు దంపతులకు హుజూర్ నగర్, (నేటి సూర్యాపేట జిల్లా) లో జన్మించారు. చందాల కేశవ దాసు రచనలపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డి పట్టా పొందారు. తొలి తెలుగు సినీ గీత రచయిత చందాల కేశవదాసు అని సప్రమాణంగా నిరూపించి తెలంగాణ కీర్తిని దశదిశలా చాటారు. వృత్తిరీత్యా నల్లగొండ గీతా విజ్ఞాన ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా విశ్రాంతి పొందిన పురుషోత్తమాచార్యులు, పువ్వు పుట్టగానే పరిమళించినట్లు బాల్యంలోనే సాహిత్యం వైపు మళ్లారు. పాఠశాల విద్యార్థి దశలోనే గేయాలు రాశారు. 1960లో 'మన కర్తవ్యం' నాటికలో బాలనటుడుగా పలువురి ప్రశంసలు అందుకున్నారు. 1962లో 'ద్రోహం', 'మేటిరైతు' నాటికలలో బాల నటగాయకుడుగా బహుముఖీనమైన ప్రతిభను కనబరిచారు. 1992 నుండి లలిత సంగీత గానం చేస్తున్నారు.

రాధికామాధవము, శ్రీసుదర్శన ప్రభావము, హరిసంకీర్తనాచార్య, విముక్తసీత, వరూధిని, మహాభక్తశబరి, ప్రభావతి, నీలవేణి, నాదయోగి, ప్రబంధరాయబారము మొదలైన పద్య నాటకాలను రచించి ప్రదర్శింపజేశారు.

1979 నుండి 1985 వరకు శ్రీ త్యాగరాజ ఉత్సవసమితి కార్యదర్శిగా సంగీత కార్యక్రమాలు ఎన్నింటినో విజయవంతంగా నిర్వహించారు. 1982 నుండి శ్రీ అన్నమాచార్య సంకీర్తనా ప్రచారసమితి ద్వారా అధ్యక్షునిగా మాసవారీ సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇప్పటికి 500 కార్యక్రమాలు దిగ్విజయంగా పూర్తి చేశారు. ఇటీవల అన్నమయ్య పంచ శతమానోత్సవాలు మూడు రోజులపాటు నల్లగొండలో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. 1983 నుంచి శ్రీ ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ద్వారా ఇప్పటి దాకా సుమారు 2000 సినీసంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

1989 నుండి శ్రీనాదబ్రహ్మ సంగీతకళాశాల ద్వారా సుమారు



500 మందికి సంగీత విద్యాబోధన చేస్తూ నల్లగొండ ప్రాంతంలో సంగీతం మాస్టారుగా ప్రసిద్ధి పొందారు.

పురుషోత్తమాచార్యులు పలు వీడియో ఆడియో చిత్రాలకు, క్యాసెట్లకు సంగీత దర్శకత్వం వహించారు. 1985లో 'తపస్విని' వీడియో చిత్రానికి సంగీత దర్శకత్వం వహించారు. 2000లో 'అందరికీ విద్య' ఆడియో సి.డి. వెలువరించారు. 2006 నుండి 'అన్నమయ్య పదశ్రుతి, అన్నమయ్య నృసింహ కీర్తనలు', 'అలంపురం జోగుళాంబ కీర్తనలు', 'విఠలేశ్వరా శతకపద్యగానం', 'శ్రీనివాసచరితం', 'శ్రీవాసుదాసు కీర్తనలు' 'మరింగంటి వారి తిరునామసంకీర్తనమ్' వారిజాల శ్రీ వేణుగోపాలస్వామి సుప్రభాతం, కీర్తనలు', 'హరినామ గానరంజని' మొదలైన సి.డి లకు సంగీత దర్శకత్వం వహించారు.

1995లో ఆం.ప్ర.రాష్ట్ర నంది నాటకోత్సవ పద్యనాటక పోటీలకు, 1999లో అన్నమాచార్య భావనావాహిని కార్యక్రమానికి 2002, 2005, 2009 సం॥లలో నంది నాటకపోటీలలో పద్యనాటకాల విభాగానికి, 2004లో మాటీవి 'పాడాలని ఉంది' కార్యక్రమంలోనూ న్యాయ నిర్ణేత వ్యవహరించారు.

పురుషోత్తమాచార్యులు తపోభంగం, స్వాతంత్ర్య దీప్తి, శ్రీ సిద్ధివినాయకం, అన్నమయ్య చరిత్ర, దేవీమాహాత్మ్యము, విశిష్టసంస్కృతి ఖిల్లా-నల్లగొండజిల్లా, భగవద్రామానుజ వైభవమ్. ఆళ్వారు వైభవమ్ (12భాగాలు) మొదలైన నృత్య నాటికలు రచించారు.

పురుషోత్తమాచార్యులు బహు గ్రంథకర్త. వీరు అనేక

వృత్తిరీత్యా నల్లగొండ గీతా విజ్ఞాన ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా విశ్రాంతి పొందిన పురుషోత్తమాచార్యులు, పువ్వు పుట్టగానే పరిమళించినట్లు బాల్యంలోనే సాహిత్యం వైపు మళ్లారు. పాఠశాల విద్యార్థి దశలోనే గేయాలు రాశారు. 1960లో 'మన కర్తవ్యం' నాటికలో బాలనటుడుగా పలువురి ప్రశంసలు అందుకున్నారు.

ప్రక్రియలలో అనేక గ్రంథాలు రాశారు. సరాగాలు (పాటలు), విరిమువ్వలు (వచనకవితలు), రసానంది (నాటికలు), పదవతరగతి తెలుగు పాఠ్యాంశ కథలు, మన ఘంటసాల సంగీతవైభవం (ప్రైవేట్ లలితగీతాలు), మన ఘంటసాల పద్యగానసౌరభం (ప్రైవేట్ పద్యాలు), ఘంటసాల భగవద్గీతా గాన సౌందర్యం, గీతల్లోగీత (పద్యాలు), తెలంగాణా పాఠ్యాంశకథలు, విశేషాంశాలు, అలంపురం జోగుళాంబ సంకీర్తనలు. వారిజాల వేణుగోపాలస్వామి సుప్రభాతం, కీర్తనలు, అవిసెపూలు (వచనకవితలు), ప్రపంచవిలాసం (మినీకవితలు), రహస్యభూతం (పద్యకావ్యం)

ముత్యాల కొలను (సంస్కృత నీతిశాస్త్రానికి అనువాదం) తేనె తెరలు కథా సంపుటి, ఒక నవల కూడా రాశారు. సింహగిరి నరహరి వచనాలను కీర్తనలుగా రాశారు. ఇటీవల పిల్లల కోసం వెన్నెల కుప్పలు అనే గ్రంథం రాసి నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెన్నపూసల భవ్య అనే విద్యార్థిని చేత ఆవిష్కరింప జేసి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఇవి వారు రాసిన గ్రంథాలలో కొన్ని మాత్రమే.

పురుషోత్తమాచార్యులు సంగీత సాహిత్య రంగంలో చేసిన కృషికి అనేక అవార్డులు వారిని వరించి వచ్చాయి. 1998లో మచిలీపట్నం కళాపీఠంవారి ఘంటసాల కమెండేషన్ అవార్డు. 2001లో హైద్రాబాదు శ్రీకళానిధిసంస్థ వారి ఉత్తమసంగీత విద్వాన్' పురస్కారం. 2004లో మిర్యాలగూడెం శ్రీత్యాగరాజనాట్యకళాపరిషత్తు వారిచేత 'కళాజ్యోత్స్న' బిరుదం. 2008లో ద్వా.నా. శాస్త్రి 'ఉత్తమపరిశోధక అవార్డు' 2011లో 'వరూధిని' ఉత్తమ రచయిత అవార్డు. నందినాటకపోటీ 2011లో గుంటూరు విశ్వశాంతి ఆర్ట్స్ అకాడమీవారి 'సంగీత సేవక' పురస్కారం, 2016లో తెలుగువిశ్వవిద్యాలయం వారి సాహితీ పురస్కారం. 2017లో శరచ్చంద్ర ఘంటసాల సంగీతకళాశాలవారి 'సముద్రాల'అవార్డు. 2019లో గంధర్వ అకాడమీ, హైద్రాబాదు వారి సంగీత అవార్డు మొదలైనవి వీటిలో కొన్ని.

శ్రీఅన్నమాచార్య సంకీర్తనా ప్రచార సమితి : శ్రీఘంటసాల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులుగా, శ్రీనాదబ్రహ్మ సంగీత కళాశాల ప్రధానాచార్యులుగా 1983 నుండి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఉన్నారు. 1984లో ఘంటసాల పాడిన శ్రీశ్రీ సినీగీతాల కార్యక్రమం, 1999లో ఘంటసాల పాడిన ఎస్.రాజేశ్వరరావు పాటలు, 2002లో ఘంటసాల కంఠంలో పెండ్యాల గీతాలు 2003లో వి. రామకృష్ణతో ఘంటసాల సంగీత కార్యక్రమం. 2004లో "పసిడిపాటల వెండివెలుగు" మాసవారీ కార్యక్రమాలు. 2006లో డా॥రహమతుల్లా అష్టావధాన కార్యక్రమం, 2009లో ఘంటసాల పాడిన ఆదినారాయణరావు గీతాలు, 2017లో ఘంటసాల పాడిన సినారె గీతాలు (సీతారామయ్యగారి బృందం) తిరుపతి, ఒంగోలు, విజయనగరం, విశాఖపట్నం, హైద్రాబాదులలో సంగీతకార్యక్రమాలు మొదలైన అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఈ విధంగా ఇటు సంగీత రంగంలో అటు సాహిత్య రంగంలో నాటక రంగంలో విశేష కృషి చేస్తూనే గొప్ప పరిశోధనాత్మక వ్యాసాలను కూడా వెలువరిస్తున్నారు. వీరు రాసిన సినీ విమర్శకు సంబంధించిన వ్యాసాలు ' తెలుగు సినీ గీతాలు - శాస్త్రీయ సంగీతం పేరుతో త్వరలో పుస్తకంగా మన ముందుకు రానున్నది. ఇంతటి గొప్ప కృషి చేస్తున్న పురుషోత్తమాచార్యకు జాతీయ ఉత్తమ సినీ విమర్శకులుగా పురస్కారం రావడం నల్లగొండకే కాదు తెలుగు నేలకే గర్వకారణం.

(డాక్టర్ ॥ఎం. పురుషోత్తమాచార్యకు జాతీయ ఉత్తమ సినీ విమర్శకులుగా పురస్కారం వచ్చిన సందర్భంగా...)

- సాగర్ల సత్తయ్య, 7989117415

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@ gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

ఎమ్ఎమ్‌టీఎస్‌కు మంగళం!

(మొదటిపేజీ తరువాయి)

అద్దెకు ఇండ్లు దొరుకుతాయని అక్కడకు వెళ్తుంటారు. అక్కడి నుంచి ఎమ్ఎమ్‌టీఎస్ ద్వారా సిటీలో పనులకు వచ్చి తిరిగి ఇండ్లకు వెళ్తారు. ఎమ్ఎమ్‌టీఎస్‌లో కనిష్ట టిక్కెట్ ధర రూ.5 కాగా, గరిష్ట టిక్కెట్ ధర కేవలం రూ.15 మాత్రమే. ఈ చార్జీలతో దాదాపు సిటీ చుట్టుపక్కల 45 కిలోమీటర్ల లోపు ప్రయాణం చేయొచ్చు. కోవిడ్ టైంలో అన్ని రైళ్ల మాదిరే ఎమ్ఎమ్‌టీఎస్ సర్వీసుల్నీ రద్దు చేశారు. ఆ తర్వాత అన్ని రైళ్లను పునరుద్ధరించి, 15 నెలల తర్వాత తిరిగి ఎమ్ఎమ్‌టీఎస్ సర్వీసుల్ని ప్రారంభించారు. మధ్య మధ్యలో ఎప్పుడు పడితే అప్పుడు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రైళ్లను రద్దు చేయడంతో శివారు ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఎమ్ఎమ్‌టీఎస్ ఎక్కేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చి, రైళ్లు లేవని తెలియగానే అక్కడి నుంచి మళ్లీ బస్టాండ్లు, మెట్రో స్టేషన్లకు ఉరుకులు పరుగులు పెట్టాల్సిన దుస్థితిని దక్షిణ మధ్య రైల్వే కల్పించింది. ఎమ్ఎమ్‌టీఎస్ కోసం రైల్వే స్టేషన్‌కు వెళ్తే అవి ఉంటాయో లేదో తెలియని స్థితిలో రైలు ప్రయాణీకులు తప్పనిసరై ప్రత్యామ్నాయ రవాణా చూసుకోవల్సి వచ్చింది. ఈ పరిస్థితిని సృష్టించిన రైల్వే అధికారులే ఇప్పుడు ఎమ్ఎమ్‌టీఎస్‌లో ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 50 శాతానికి మించట్లేదని లెక్కలు కడుతున్నారు. అందువల్లే రైళ్లను రద్దు చేయాల్సి వస్తున్నదనీ వివరణ ఇస్తున్నారు. అసలు రైళ్లను రెగ్యులర్‌గా నడిపితేనే కదా ఓఆర్ పెరిగేది. దాన్ని వదిలేసి 50 శాతానికి మించట్లేదనడం ఏంటని ప్రయాణీకులు ప్రశ్నిస్తున్నారు. ఎమ్ఎమ్‌టీస్ తొలి దశ 45 కిలో మీటర్లు ఉండగా, రెండోదశతో ఇది 90 కి.మీ., పెరిగింది. తొలి దశ 45 కి.మీ., సమయంలో 121 సర్వీసులు నడిచేవి. అరగంటకో రైలు ప్రయాణీకులకు అందుబాటులో ఉండేది. తొలుత ఆరు బోగీలతో నడిచిన ఎమ్ఎమ్‌టీఎస్, ఆ తర్వాత 9 బోగీలకు పెరిగింది. ప్రయాణీకుల రద్దీ ఎక్కువ అవడంతో బోగీల సంఖ్యను 12కి పెంచారు. రోజుకు దాదాపు లక్షన్నర మంది ప్రయాణీకులు ఈ రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ప్రయివేటురంగంలోని మెట్రోరైల్‌ను ప్రోత్సహించడం కోసం ఎమ్ఎమ్‌టీఎస్‌ను బలి చేస్తున్నారని ప్రయాణీకులు అభిప్రాయపడుతున్నారు. ఓఆర్ తగ్గితే తక్కువ బోగీలతో అయినా సర్వీసుల్ని ఎందుకు నడపట్లేదని ప్రశ్నిస్తున్నారు.

వందేభారత్ కోసం...

మోడీ సర్కార్ ఉన్న రైళ్లను రద్దు చేసి, వాటిస్థానంలో వందేభారత్ అంటూ పేరు మార్చి నడుపుతున్న రైళ్ల కోసం ఎమ్ఎమ్‌టీఎస్‌ను బలి చేస్తున్నది.. దానితో పాటు పక్కా వ్యాపారీకరణలో భాగంగా ఎమ్ఎమ్‌టీఎస్ వెళ్లాల్సిన రూట్లలో సరుకు రవాణా రైళ్లను నడుపుతున్నారు. ఎమ్ఎమ్‌టీఎస్ టిక్కెట్ ధర తక్కువగా ఉండటం వల్ల ఆదాయం రావట్లేదనీ, ఎటూ కోవిడ్ టైంలో ప్రజలు ప్రత్యామ్నాయ రవాణాకు అలవాటు పడ్డారు కాబట్టి, ఇప్పుడు ఆ సర్వీసుల్ని తిప్పాల్సిన అవసరం లేదని రైల్వే అధికారులు భావిస్తున్నారని రైల్ నిలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి అభిప్రాయపడ్డారు.

శుభవార్త వింటారు
ద.మ.రైల్వే జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్

ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్ల విషయంలో త్వరలో శుభవార్త వింటారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ 'నవతెలంగాణ'కు చెప్పారు. ఆ రైళ్లలో 50 శాతం ఓఆర్ కూడా రావట్లేదనీ, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, ట్రాక్‌ల పొడిగింపు వంటి కొన్ని పనుల వల్ల ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్ల రద్దు అనివార్యమవుతున్నదని వివరణ ఇచ్చారు. ముఖ్యంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఆధునీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయనీ, రైళ్ల రద్దీకి తగినట్టు ట్రాక్‌లు లేవని చెప్పారు.

వందరోజుల్లో సర్వీసుల రద్దు ఇలా...

వరుస సంఖ్య	తేదీ	రోజులు
1.	14.06.2023 నుంచి	
	17.06.2023 వరకు	4
2.	26.06.23 నుంచి	
	02.07.23 వరకు	7
3.	03.07.23 నుంచి	
	09.07.23 వరకు	7
4.	10.07.23 నుంచి	
	16.07.23 వరకు	7
5.	17.07.23 నుంచి	
	23.07.23 వరకు	7
6.	31.07.23 నుంచి	
	06.08.23 వరకు	7
7.	14.08.23 నుంచి	
	20.08.23 వరకు	7
8.	21.08.23 నుంచి	
	27.08.23 వరకు	7
9.	28.08.23 నుంచి	
	03.09.23 వరకు	7
మొత్తం రద్దయిన రోజులు		60

ఇదో రకం తనిఖీ

(మొదటిపేజీ తరువాయి)

సౌకర్యాలను పరిశీలించి, తిరిగి ట్రైన్ నెంబర్ 47188లో లింగంపల్లి నుంచి సికింద్రాబాద్ వెళ్లారని తెలిపారు. ఈ రెండు నెంబర్ల రైళ్లుఫలక్‌నుమా నుంచి లింగంపల్లికి, లింగంపల్లి నుంచి ఫలక్‌నుమాకు వెళ్తాయి. ఈ రైలులో ఒకరిద్దరు ప్యాసింజర్లతో రైల్వే జీఎం మాట్లాడుతున్న ఫోటోలను కూడా పంపారు. ఈ ట్రిప్ 24వ తేదీ జరిగింది. తెల్లారి 25వ తేదీన ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లను రద్దు చేస్తున్నట్టు ప్రకటన జారీ చేశారు. ప్రజారవాణాపై ఉన్నతస్థాయి అధికారులకు ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో దీనితో అర్థమవుతుందని ప్రయాణీకులు వాపోతున్నారు.



రెండో దశ రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. 9 ఏండ్లు నానబెట్టి, ఇప్పుడు ప్రాజెక్ట్ వ్యయం పెరిగిందనీ, రాష్ట్ర వాటాగా రూ.600 కోట్లు ఇవ్వాలని దక్షిణ మధ్యరైల్వే అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసారు. ప్రాజెక్ట్ ఆలస్యానికి కారణాలు ఏంటి? ఖర్చు ఎందుకు పెరిగింది? అనే వివరాలు ఏవీ చెప్పకుండా రూ.600 కోట్లు కట్టాలని చెప్పడం ఏంటని రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఎమ్ఎమ్‌టీఎస్ రైలు మార్గాల్ని కాదని, వేల కోట్ల వ్యయంతో కూడిన హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్ట్ రెండో దశకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం. ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లను ఎందుకు నడపట్లేదనే విషయంపై కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి నోరుమెదపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

రైతుల ఆర్థిక ప్రగతికి ఫుడ్ ప్రాసెసింగ్‌రంగ పురోగతి అవసరం

- చికాగో ఫుడ్‌స్టాప్ సందర్శన
- అమెరికాలోని వరల్డ్ చికాగోలో ఫుడ్ ఇన్నోవేషన్ అంశంపై సమావేశంలో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


'ఫుడ్ ప్రాసెసింగ్ పురోగతికి, తెలంగాణ ఆహార ఉత్పత్తుల్లో ఇన్నోవేషన్, ఆహార అలవాట్ల చరిత్రను భద్రపరచడం వంటి అంశాల కోసం తెలంగాణ ఫుడ్‌స్టాప్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. రైతుల ఆర్థిక ప్రగతికి ఫుడ్ ప్రాసెసింగ్ పురోగతి అవసరం' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. కేటీఆర్ తన పర్యటనలో భాగంగా అనేక పెట్టుబడి సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతోపాటు ఆదివారం చికాగో నగరంలో చికాగో ఫుడ్ ప్రాసెసింగ్ ఈకో సిస్టంను అధ్యయనం చేశారు. చికాగో నగరంలోని చికాగో ఫుడ్ స్టాప్‌ను సందర్శించి అక్కడ వరల్డ్ బిజినెస్ షికాగో సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. 'చికాగో నగరానికి చెందిన పబ్లిక్, ప్రయివేటు ఆర్థిక అభివృద్ధి ఏజెన్సీగా వరల్డ్ బిజినెస్ చికాగో పనిచేస్తుందన్నారు. చికాగో ఫుడ్ స్టాప్‌లో ఏర్పాటు చేసిన అనేక షాపులను ఆహార పద్ధతులు, వాటి చరిత్ర, ఆహార ఉత్పత్తుల ప్రదర్శన వంటి అంశాలను పరిశీలించినట్టు తెలిపారు. ప్రజలకు ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందిస్తూనే తమ ఆహార ఉత్పత్తులు, ఆహారపు అలవాట్లపై ప్రత్యేకతలను జోడిస్తూ వాటిని ఎప్పటికప్పుడు ప్రజలకు పంచుకుంటూ వారి నుంచి ఫీడ్‌బ్యాక్ అందుకునే ఒక ప్రత్యేకమైన వ్యవస్థను చికాగో ఫుడ్ స్టాప్ కలిగి ఉందన్నారు.

చికాగో నగరం ఫుడ్ ఇన్నోవేషన్ సాంప్రదాయకంగా వచ్చిన ఆహారపు అలవాట్లు, ఆహారపు ఉత్పత్తుల సరఫరా వంటి అంశాలను కాపాడుకోవడంలో అగ్రస్థానంలో ఉన్నదని చికాగో ఫుడ్ స్టాప్ ప్రతినిధులు మంత్రి కేటీఆర్‌కు తెలిపారు. ప్రస్తుత ఆధునిక జీవితంలోనూ అత్యంత కీలకమైన ఆహారపు ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను వృద్ధిపరిచేందుకు తీసుకోవాల్సిన ఇన్నోవేషన్ ఈకో సిస్టం ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నట్టు వారు తెలిపారు. చికాగో ఫుడ్ స్టాప్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక వ్యాపారవేత్తలతో మంత్రి కేటీఆర్ సంభాషించారు. ముఖ్యంగా చికాగో అనుసరిస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫుడ్ ప్రొక్యూర్‌మెంట్ పద్ధతులపై ప్రత్యేకంగా చర్చించారు. చికాగో ఫుడ్ స్టాప్ మాదిరి ఫుడ్ ప్రాసెసింగ్ పురోగతికి, తెలంగాణ ఆహార ఉత్పత్తులలో ఇన్నోవేషన్, ఆహార అలవాట్ల చరిత్రను భద్రపరచడం వంటి అంశాల కోసం తెలంగాణ ఫుడ్ స్టాప్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తామన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఇన్నోవేషన్ ప్రాధాన్యత ఎంతగానో ఉన్నదని, ఇది కేవలం ఫుడ్ ఇండస్ట్రీకి మాత్రమే కాకుండా వ్యవసాయ రంగంపై ఆధారపడిన రైతులు, వ్యవసాయ సంబంధిత పరిశ్రమల్లోని భాగస్వాముల అభివృద్ధికి సైతం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇలాంటి వ్యవస్థను ముందుకు తీసుకెళ్తే రైతుల ఆర్థిక పురోగతి మరింత వేగంగా సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అనుసరిస్తున్న వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో సాధించిన అద్భుతమైన పురోగతిని వివరించారు.

ప్రతిపక్షాల ఐక్యతతో బీజేపీకి భయం !

- ఇండియా కూటమిలోకి మరిన్ని పార్టీలు : నితీశ్ కుమార్ వెల్లడి



పాట్నా : ప్రతిపక్షాల ఐక్యతను చూసి బీజేపీ భయపడుతోందని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ వ్యాఖ్యానించారు. ముంబయిలో ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్, ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) మూడవ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన మరికొన్ని రాజకీయ పార్టీలు కూటమిలో చేరనున్నాయని నితీష్ చెప్పారు. ముంబయి సమావేవం ఈ చేరికలకు వేదికవుతుందని అన్నారు. "గతంలో ప్రతిపక్షాలన్నీ చెల్లాచెదురుగా వున్నాయి. కానీ నా చొరవ నేపథ్యంలో ఇప్పుడు అన్ని పార్టీలు ఒక తాటిపైకి వచ్చాయి. ప్రతిపక్షాలు సమైక్యంగా వ్యవహరిస్తున్నందువల్ల తాము నష్టపోతామని వారు (బీజేపీ) భయపడుతున్నారు. అందువల్లే వారు నాపై ధ్వజమెత్తుతున్నారు. ఆ విమర్శలను నేను పట్టించుకోను, నా పని చేసుకుంటూ పోతాను." అని చెప్పారు. పాట్నా, బెంగళూరుల్లో ఇప్పటికే ఇండియా కూటమి సమావేశాలు రెండు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో ముంబయిలో మూడో సమావేశం జరగనుంది. అక్కడ భవిష్యత్ వ్యూహ రూపకల్పన జరగనుంది. ఈ సమావేశంపై నితీశ్ మాట్లాడుతూ లోక్‌సభ సీట్లపై కూడా ఈసారి చర్చ జరుగుతుందని చెప్పారు. ఏ సీటు నుండి ఎవరు పోటీ చేయాలనే అంశాన్ని కూడా చర్చించాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. అనేక అంశాలపై చర్చిస్తామని, కొన్ని సమస్యలకు పరిష్కారం కూడా దొరుకుతుందని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు పెద్దగా సమయం లేనందున బహుశా ముంబయి సమావేశమే చివరి సమావేశం కావచ్చునని అన్నారు. మరోవైపు బీహార్ డిప్యూటీ ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కూడా ప్రధానిపై తీవ్రంగా విమర్శలు చేశారు. పేదలు, రైతులు, మొత్తంగా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా సంస్కరణల పేరుతో దేశంలోని ప్రభుత్వ సంస్థలను, వనరులను ప్రయివేటు కంపెనీలకు అమ్మేస్తున్నారంటూ విమర్శించారు. లక్షల కోట్ల విలువైన జాతీయాస్తులను ఎంపిక చేసిన ప్రయివేటు కంపెనీలకు ఎందుకు అమ్ముతున్నారు? దేశ సంపదను మోడీ ప్రభుత్వం పెంచలేనపుడు స్వాతంత్ర్యానంతరం దశాబ్దాల తరబడి కష్టపడి సంపాదించుకున్న ఆస్తులను చవకబారు ధరలకు అమ్ముతూ ఎందుకు దేశానికి నష్టం కలిగిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇలాచేయడం వల్ల దేశానికి, ఆర్థిక వ్యవస్థకు ఎలా లాభమో మోడీ ప్రభుత్వం వివరించాలని ఆయన డిమాండ్ చేశారు.కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో దేశాన్ని తాకట్టుపెట్టేందుకు, విక్రయించేందుకు జరుగుతున్న ఈ ప్రయత్నాలనుఅడ్డుకునేందుకు ఈ దేశ ప్రజలు చివరికంటా పోరాడతారని అన్నారు.

ఓవైసీ చేతిలో 'కారు' స్టీరింగ్

(మొదటిపేజీ తరువాయి)

డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన 'రైతు గోస- బీజేపీ భరోసా' సభలో అమిత్‌షా మాట్లాడారు. యూపీఏ హయాంలో రైతులకు రూ.22 వేల కోట్ల బడ్జెట్ ఉంటే.. మోడీ ప్రభుత్వం దాన్ని రూ.1.25 లక్షల కోట్లకు పెంచిందన్నారు. ప్రధానమంత్రి సమ్మాన్ నిధి కింద దేశవ్యాప్తంగా 11కోట్ల మంది రైతులకు పంట పెట్టుబడి సహాయంగా రూ.2.60 లక్షల కోట్లు ఇచ్చామని తెలిపారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల కోట్లు మాత్రమే ఇచ్చిందని, కానీ బీజేపీ ప్రభుత్వం కేవలం ఈ తొమ్మిదేండ్లలో ఒక్క తెలంగాణకే రూ.2.80 లక్షల కోట్లు ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 1.90 కోట్ల మందికి 5 కిలోల బియ్యాన్ని ఉచితంగా కేంద్రం పంపిణీ చేస్తున్నదని, 11 లక్షల మందికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లు నిర్మిస్తే తెలంగాణలోనే 2.50 కోట్ల మందికి గృహాలు నిర్మించామన్నారు. కాంగ్రెస్ నెహ్రూ, ఇందిర, రాజీవ్, రాహుల్ నాలుగు తరాల 4జీ పార్టీ, బీఆర్ఎస్ కేసీఆర్, కేటీఆర్ రెండు జనరేషన్లు 2జీ పార్టీ, ఎంఐఎం 3జీ పార్టీ అంటూ...తెలంగాణలో వచ్చేది బీజేపీనే అని తెలిపారు. ప్రజలను మోసగించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ రహస్యంగా కలుస్తున్నాయని కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గే చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలని చెప్పారు. బీఆర్ఎస్ భుజస్కంధాల మీదున్న ఓవైసీ మజ్లిస్ పార్టీలను ఎట్టిపరిస్థితుల్లో బీజేపీ కలిసేదే లేదన్నారు. ఏమైనా సరే రాజకీయాల్లో బీఆర్ఎస్, కేసీఆర్, మజ్లిస్‌ను ఎదుర్కొనే పార్టీ కాంగ్రెస్ కాదు బీజేపీ మాత్రమే అన్నారు. శ్రీరామ నవమికి పట్టువస్త్రాలను తెచ్చే ఆనవాయితీని విస్మరించి భద్రాచలం భక్తుల మనోభావాలను కేసీఆర్ దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను మరోమారు సీఎం కావాలని, లేదంటే కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలనే కేసీఆర్ కలలు నెరవేరవని స్పష్టంచేశారు.

కేసీఆర్ పాలనలో వ్యవసాయ విధ్వంసం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి

కేసీఆర్ పాలనలో వ్యవసాయ విధ్వంసం కొనసాగుతోందని, వ్యవసాయాన్ని దండుగలా మార్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వట్లేదని, పంటల బీమా పథకం అమలు చేయడం లేదన్నారు. వ్యవసాయ రుణాలపై కేసీఆర్ ప్రభుత్వం పావలా వడ్డీని అమలు చేయకుండా, ఒక్క రైతుబంధు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణలో 75శాతం ఉన్న కౌలు రైతులకు ఎలాంటి మేలు జరగటం లేదన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం కల్తీ విత్తన భాండాగారంగా మారిందన్నారు.

ఉచిత ఎరువుల మాటేమిటని ప్రశ్నించారు. రైతుల రుణమాఫీని ఎన్నికలకు ముందు తూతూ మంత్రంగా మాఫీ చేస్తున్నారన్నారు. రుణమాఫీ సకాలంలో చేయకపోవడంతో వడ్డీలు పేరుకుపోయాయని, మాఫీ చేసిన డబ్బులు వడ్డీలకే పోయాయన్నారు. ధరణి పోర్టల్‌తో రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఒక్క రైతుబంధు మాత్రమే ఇస్తూ విత్తన, ఎరువులు, వ్యవసాయ పరికరాల వంటి సబ్సిడీలన్నీ ఎత్తివేసిందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో వారాల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తుందని, చివరికి ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున లంచం ఇచ్చి అమ్ముకోవాల్సి వస్తుందని, అది కూడా క్వింటాల్‌కు పది కిలోల కోత విధిస్తున్నారని తెలిపారు. కేసీఆర్‌ను గద్దె దింపితేనే రైతులు, పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ.. మోసాలు చేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పీహెచ్‌డీ చేశారని విమర్శించారు. రాత్రయితే పెగ్గులు.. ఎన్నికలొస్తే హామీలు కేసీఆర్‌కు గుర్తుకు వస్తాయన్నారు. ఇలాంటి కేసీఆర్‌ను ఎలా భరిస్తున్నారని.. ఇతర రాష్ట్రాలకు పోతే కేసీఆర్ వల్ల మన ఇజ్జత్ పోతుందన్నారు. సభలో జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, సునిల్‌బన్సల్, తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, కేంద్ర సహాయ మంత్రి అరవింద్‌మీనన్, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ ప్రేమేందర్‌రెడ్డి, శృతి, జాతీయ కార్యవర్గ సభ్యులు జితేందర్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గెల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాట్ ఇప్పిస్తానంటూ అఘాయిత్యం

(మొదటిపేజీ తరువాయి)

మోహన్‌లాల్ జాట్.. ఓ రెసిడెన్షియల్ ప్రాజెక్టులో ఫ్లాట్ ఇప్పిస్తానని మభ్యపెట్టి బాధిత మహిళను తన కార్యాలయానికి పిలిపించుకున్నాడు. అక్కడికి వెళ్లిన ఆ మహిళపై లైంగికదాడికి పాల్పడ్డాడు. మహేశ్ చందక్ అనే అతని స్నేహితుడితో కూడా ఆమెపై దారుణానికి ఒడిగట్టాడు.బాధితురాలిపై జరిగిన అఘాయిత్యానికి మోహన్ లాల్ జాట్‌కు సంబంధించిన మరో ఇద్దరు మహిళలు కూడా సహకరించడం గమనార్హం. బాధితురాలిపై అఘాయిత్యం చేయడమేగాక, ఆమె కుమార్తెను కూడా నిందితులు లైంగికంగా వేధించారు. దాంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు మోహన్‌లాల్ జాట్‌పైన, అతని స్నేహితుడు మహేశ్ చందక్‌పైన, సహకరించిన ఇద్దరు మహిళలపైన కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని చెప్పారు.

బీజేపీ ఎంపీ ఇంట్లో మైనర్ మృతదేహం

- బాలుడి మృతిపై సర్వత్రా అనుమానాలు

అసోం: అసోంలోని అధికార బీజేపీ ఎంపీ ఇంట్లో దారుణం చోటుచేసుకున్నది. సిల్చార్ ఎంపీ రాజ్‌దీప్ రాయ్ నివాసంలో అనుమానాస్పద స్థితిలో పదేండ్ల బాలుడి మృతదేహం లభించింది. అతని మెడచుట్టూ బట్ట చుట్టి ఉన్నది. మృతుని తల్లి ఎంపీ ఇంట్లో గత రెండున్నరేండ్లుగా డొమెస్టిక్ హెల్పర్‌గా పనిచేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తన ఇంట్లో బాలుడి మృతదేహం వేలాడి ఉన్న స్థితిలో కనిపించిందని ఎంపీ రాజ్‌దీప్ చెప్పారు. వెంటనే అతడిని హుటాహుటిన దవాఖానాకు తరలించామని, అయితే అప్పటికే అతడు మరణించినట్టు వైద్యులు నిర్ధారించారని వెల్లడించారు. బాలుడు ఐదో తరగతి చదువుతున్నాడని తెలిపారు. అయితే ఇది హత్యా, ఆత్మహత్యా అని సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జనం లేక కమలం గోస

(మొదటిపేజీ తరువాయి)

చేయడం.. రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి, ఎన్నికల కమిటీ చైర్మెన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్.. ఇలా ఒకరి తర్వాత మరొకరు పర్యటనలు మీద పర్యటనలు, సమావేశాల మీద సమావేశాలు పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి వెలవెలబోతున్న సభా ప్రాంగణాన్ని చూపించి టీవీల్లో వస్తున్న స్క్రోలింగ్స్‌ను కాస్త ఆపండని తమిళనాడు ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

కాంగ్రెస్ చేదు.. 'కమలం'పై మోజు..

కాంగ్రెస్, కమ్యూనిస్టు గడ్డగా పేరొందిన ఖమ్మం జిల్లాలో బీజేపీ సభ సక్సెస్ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం పరోక్షంగా సహకరించినట్టు తెలుస్తోంది. వెయ్యి ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇచ్చి ఆ రకమైన సహకారం అందించింది. రాహుల్‌గాంధీ ముఖ్య అతిథిగా జులై 2న పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేరిక సందర్భంగా కాంగ్రెస్ నిర్వహించిన ప్రజా గర్జన సభకు ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇవ్వకపోగా.. ఎన్నో అడ్డంకులను రాష్ట్ర ప్రభుత్వం సృష్టించింది. అయినా లక్షలాదిగా జనం వచ్చి ఆ సభను సక్సెస్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఈ సభకు సహకరించినా సత్ఫలితం రాలేదని విమర్శకుల మాట. రైతు గోస.. బీజేపీ భరోసా' పేరుతో నిర్వహించిన ఈ సభకు రైతు గోసేమోకానీ జనాన్ని తరలించేందుకు 'బీజేపీ నాయకత్వం మాత్రం హరిగోస' పడిందనే విమర్శలు వినిపించాయి. ఒక్కొక్కరికీ రూ.300, అదనంగా తిండి, మద్యానికి డబ్బులు ఇచ్చి ఆర్టీసీ బస్సుల్లో తరలించినా సభా స్థలి దాక జనం వెళ్లకపోవడంతో బీజేపీ నేతలు విస్తుపోవాల్సి వచ్చింది. ఈ సభ కోసం వెయ్యి ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రయివేటు వాహనాలు, కార్లు, ట్రక్కులు, ఆటోలు ఇలా ఎంతో హడావుడి చేశారు. నగరంలో 11 చోట్ల పార్కింగ్ ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కానీ ఏ ఒక్క పార్కింగ్ ప్రాంగణం కూడా నిండలేదు. సభ కోసం ఇబ్బంది లేకుండా వాటర్‌ప్రూఫ్ షెడ్లు సైతం ఏర్పాటు చేశారు. కానీ ఏమి సుఖం.. వేసిన కుర్చీలు కూడా నిండలేదు. వచ్చిన కొద్దిపాటి జనం కూడా ఓవైపు అమిత్‌షా మాట్లాడుతుండగానే వెళ్లిపోయారు.

22 మంది కాదు కదా...! ఒక్కరూ చేరలే..!!

ఈ సభలో 22 మంది కీలక నేతలు కమల దళంలో చేరతారని ముందునుంచి ఊదరగొట్టారు. కానీ ఒక్కరు కూడా చేరలేదు. బీఆర్ఎస్ టిక్కెట్ రాని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్టు ఈటల రాజేందర్ ప్రకటించారు. కానీ ఆయన కాంగ్రెస్ వైపే చూస్తున్నట్టు సమాచారం. ఉన్న ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షులు, మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు కుమారుడు కోనేరు సత్యనారాయణ (చిన్ని) సైతం పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన ఈ సభ ఎట్టకేలకు నిర్వహించామన్న తృప్తి తప్ప కాషాయ నాయకత్వానికి ఏమీ మిగల్లేదు. ఇక్కడి నుంచి ఎన్నికల శంఖారావం పూరించాలనుకున్నా...అట్టర్ ఫ్లాప్ షోతో బీజేపీ అభాసుపాలైందని విపక్షాల విమర్శలు.

ఈటల ఫొటో లేకపోవడంపై రగడ

సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై ఈటల రాజేందర్ ఫొటో లేకపోవడం వివాదానికి దారితీసింది. ఆయన అభిమానులు శనివారం రాత్రి సభా నిర్వహణ కమిటీ ఎదుట నిరసన తెలిపారు. సభను బహిష్కరిస్తామని హెచ్చరించారు. గత్యంతరం లేక రాత్రికి రాత్రే ఫ్లెక్సీలపై రాజేందర్ ఫొటో ఏర్పాటు చేశారు.

ఈపాటి సభకు అరెస్టులా..!

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభ కోసం ముందస్తుగా వామపక్ష విద్యార్థి, కార్మిక సంఘాల నేతలను అరెస్టు చేశారు. సభ ముగిసే వరకు ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఉంచారు. హోంమంత్రి వెళ్లిపోయాక విడుదల చేశారు. ఈ నేపథ్యంలో విపక్షాలు ఈ పాటి సభ కోసం అరెస్టులా...! అంటూ విమర్శలు చేయడం వినిపించింది.

మొత్తానికి మమ...

మొత్తానికి అమిత్‌షా సభను రాష్ట్ర బీజేపీ నాయకత్వం మమ అనిపించింది. మూడుసార్లు వాయిదా పడిన టూర్ ఎట్టకేలకు ముగిసింది. ఈసారి పర్యటన షెడ్యూల్‌లో భద్రాచలం రాములోరి దర్శనం లేకుండానే కథ ముగించారు. కానీ సభా ప్రారంభానికి ముందు భద్రాచలం శ్రీ రామచంద్రుల పాదపద్మాలకు నమస్కరిస్తూ సభను ప్రారంభిస్తున్నట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం విస్తుగొల్పింది. నిజాం కాలంలో హిందువులను ఊచకోత కోసిన సందర్భాన్ని సైతం ప్రస్తావించడం.. మత వైషమ్యాలను పెంపొందించడంలో బీజేపీ తీరుకు అద్దంపట్టిందనే వ్యాఖ్యలు వినిపించాయి. గద్వాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికైన బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని హైకోర్టు అనర్హునిగా ప్రకటించడంతో ఎమ్మెల్యేగా ఎన్నికైన డీకే అరుణను అమిత్‌షా సన్మానించడం ఔరా..! అనిపించింది. జిల్లా నాయకత్వం కేంద్రమంత్రికి సింహగర్జన ఫొటో ఇవ్వడం.. సభకు, గిఫ్ట్‌కు సంబంధం లేదనిపించేలా ఉందనే ఛలోక్తులు వినిపించాయి.

చంద్రయాన్-3 మహిళా సాధికారతకు చిహ్నం

- తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు
- జీ20 అధ్యక్షతంటే, ప్రజలే అధ్యక్షతే
- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

చంద్రయాన్-3 మహిళా సాధికారతకు చిహ్నమని ప్రధాని మోడీ అన్నారు. ఆదివారం ప్రధాని మోడీ మన్ కీ బాత్ 104వ ఎపిసోడ్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చంద్రయాన్-3 భారత్ విజయానికి ఎప్పటికీ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భారత్ వచ్చే నెల ఢిల్లీలో జీ20 సమావేశాలకు సిద్ధమవుతోందని, గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు. తొలిసారి భారత్ ఈ స్థాయి జీ-20లో భాగస్వామి అవుతోందని, గ్రూపును మరింత కలుపుగోలుగా చేస్తోందని చెప్పారు. జీ-20కి భారత్ నేతృత్వమంటే, ప్రజలే అధ్యక్షత వహిస్తున్నట్టు భావించాలని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

"భారత్ జీ-20 అధ్యక్షత బాధ్యతలను స్వీకరించిన నాటి నుంచి గర్వించదగిన పరిణామాలు చాలా చోటు చేసుకొన్నాయి. ఇప్పటి వరకు ఈ సదస్సులు జరిగిన నగరాల్లో ప్రజలు విదేశీ అతిథులను సాదరంగా ఆహ్వానించారు. దేశంలోని వైవిధ్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని చూసి విదేశీ అతిథులు చాలా ప్రభావితమయ్యారు. దేశం చాలా ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలుసుకొన్నారు. జీ-20 సదస్సు శ్రీనగర్ లో జరిగిన తరువాత పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దేశం క్రీడల్లో నిలకడగా విజయాలు సాధిస్తోంది. తాజాగా చైనాలో జరిగిన ప్రపంచ విశ్వవిద్యాలయాల క్రీడల్లో రికార్డు స్థాయిలో మనవాళ్లు పతకాలు సాధించారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నాడు దాదాపు 10 కోట్ల మంది జాతీయ పతాకంతో సెల్ఫీ దిగారు" అని అన్నారు.

"ప్రజలకు మాతృ భాషను బోధించడంలో భాగంగా జరిగే క్యాంపులో మీరూ పాల్గొనవచ్చు. అంతేకాదు.. తెలుగు కూడా సంస్కృతంలా పురాతనమైన భారతీయ భాష. ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 'మేరీ మాటి.. మేరా దేశ్' కార్యక్రమం జోరుగా జరుగుతోంది. సెప్టెంబర్ నెలలో దేశ వ్యాప్తంగా ప్రతి ఇల్లు, ప్రతి గ్రామం నుంచి మట్టి నమూనా సేకరించే కార్యక్రమం ఉద్యమ స్థాయిలో జరుగుతుంది" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

సరెండరా...సమదూరమా?

(మొదటిపేజీ తరువాయి)

వాస్తమేనని బీఆర్ఎస్‌లోనూ చర్చ జరుగుతోంది.

కమ్యూనిస్టులతో కటీఫ్

మొన్నటి వరకు బీఆర్ఎస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయం...కాంగ్రెస్ మునిగిపోతున్న నావ అని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు ఎందుకు మాట మార్చారనేదానిపై స్పష్టత ఇంకా రాలేదు. మునుగోడు ఎన్నికల టైంలో కమ్యూనిస్టులతో కలిసి ఒకే వేదిక పంచుకుని, తమ బంధం భవిష్యత్‌లోనూ కొనసాగుతుందని ఆయనే స్వయంగా ప్రకటించారు. ఏకపక్షంగా బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించి, 'అన్ని స్థానాల్లో అభ్యర్థుల్ని ప్రకటించాక ఇక పొత్తులేంది? అని ముక్తసరి సమాధానంతో సరిపుచ్చారు. అదే సమయంలో ఇప్పటి వరకు బీజేపీపైనా, మోడీపైనా ప్రదర్శించిన దూకుడును కొనసాగిస్తారో లేదో స్పష్టత ఇవ్వలేదు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చి, జాతీయ పార్టీగా ప్రకటించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సమదూరంగా ఉంటామంటూ గర్జించిన విషయం తెలిసిందే. కానీ ఇప్పుడు బీజేపీ పట్ల మెతక వైఖరి అవలంబిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాజ్‌భవన్‌పై అనుమానాలు తీరాయా?

దేశ వ్యాప్తంగా పోటీ చేసి మతతత్వ బీజేపీని ఓడించి సత్తా ఏంటో చూపిస్తామంటూ కేసీఆర్ హడావుడి చేశారు. 'అబ్ కీ బార్...కిసాన్ సర్కార్' అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రానికే పరిమితమైనట్టు తెలుస్తున్నది. పట్నం మహేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా సీఎం, గవర్నర్ మధ్య ఏర్పడిన అగాధం పూడిపోయినట్టు మీడియాలో కథనాలు వచ్చాయి. ఆ మరుసటి రోజే కొత్త సచివాలయంలోని గుడి, చర్చి, మసీదును సీఎం కేసీఆర్ గవర్నర్‌తో కలిసి ప్రారంభించారు. దీంతో బీజేపీకి, బీఆర్ఎస్ మరింత దగ్గరవుతున్నదనే సంకేతాలు వెలువడ్డాయి.

ఇక్కడ మేమే...అక్కడ మీరే..!

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం బీజేపీ సహకరించేలా...పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీకి సహకరించేలా రెండు పార్టీల మధ్య సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఇక్కడొక్క చిక్కు ప్రశ్న కూడా ఉందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఎంఐఎం పార్టీతో బీఆర్ఎస్ ఫ్రెండ్లీ ఒప్పందాన్ని కొనసాగిస్తున్నది. మరోవైపు బీజేపీతో స్నేహం కొనసాగించేందుకు సిద్ధమవుతున్నది. ఎంఐఎం, బీజేపీ రెండూ మతతత్వంతో కూడిన భిన్న ధృవాలు. ఆ రెండు పార్టీలతో స్నేహం కొనసాగించడం కారును ప్రమాదాలకు గురి చేస్తుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో బీఆర్ఎస్ కీలకంగా మారబోతున్నదని మంత్రి కేటీఆర్ చెప్పడంతో ఈ రెండు పార్టీల మధ్య బంధం బలపడుతున్నదనే బలమైన వాదనలు వినిపిస్తున్నాయి.

బీజేపీ సభకు ఆర్టీసీ బస్సులు..

ఖమ్మం సభావేదికగా బీజేపీ, బీఆర్ఎస్ దోస్తీ బట్టబయలు అయ్యింది. గతంలో ఖమ్మంలో కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'జనగర్జన' సభకు కేసీఆర్ సర్కార్ ఆర్టీసీ బస్సులు ఇవ్వలేదు. పైగా పొంగులేటి అనుచరులు, కార్యకర్తలు, అభిమానులు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలిరాగా వారిని ఎక్కడికక్కడ అడ్డుకోవడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. ఆదివారం అమిత్ షా సభకు మాత్రం పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులు తరలివెళ్లాయి. బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ఆర్టీసీ బస్సులు ఇచ్చింది. ఇలా చేయడం బీఆర్ఎస్, బీజేపీ మధ్య దోస్తీ ఉన్నట్టు కాదా? అసలు ఇదంతా దేనికి సంకేతం..? అని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తోంది. గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్, బీజేపీ మధ్య చీకటి ఒప్పందం ఉందని.. దోస్తీగా మెలుగుతున్నాయని కాంగ్రెస్ చేసిన ఆరోపణలు నిజమేనని ధృవీకరిస్తున్నట్టే ఉంది. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు ప్రజల్లో మరింత చర్చను రేకెత్తిస్తుండటం గమనార్హం!

119 స్థానాల్లో బీజేపీకి డిపాజిట్ గల్లంతే

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి అబద్ధాలతో బీజేపీ నేత అమిత్ షా చేసిన ప్రసంగం తెలంగాణ ప్రజలను ఒప్పించలేకపోయిందని విమర్శించారు. మత, వాక్ చాతుర్యంతో ద్వేషాన్ని జొప్పించడం, అభివృద్ధిపై పటిష్టమైన ప్రణాళిక లేకపోవడం, ప్రజల సాధికారతపై భవిష్యత్ దార్శనీకత లేకపోవడం పట్ల బీజేపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

మంత్రి సబితమ్మ విజయం సాధించడం ఖాయం

మాజీ అధ్యక్షుడు శ్యామ్ గుప్తా



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గంలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఘన విజయం సాధించడం ఖాయమని ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యాం గుప్తా అన్నారు. ఆదివారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ..వారి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. అంతేకాదు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను పేదవారికి అందేలా కృషి చేస్తున్నారని కొనియాడారు. మంత్రి చొరవతోనే నియోజకవర్గంలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు అయిందని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో సబితమ్మకు ఎవరూ పోటీలేరని అన్నారు. భారీ మెజార్టీతో మంత్రి గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

టీటీడీ సభ్యులు సీతారెడ్డికి శుభాకాంక్షలు



నవతెలంగాణ - మీర్ పేట్

తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులుగా గడ్డం సీతా రెడ్డి ఎన్నికైన సందర్భంగా ఆదివారం మీర్‌పేట్ బీఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్ రెడ్డి సతీమణి సీతా రెడ్డి టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమితులైన సందర్భంగా మీర్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వంటేరు నర్సింహారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ప్రేమ్ చంద్ర రెడ్డి,జనార్దన్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, శ్రవణ్ కుమార్ రెడ్డిలు ఆమె నివాసంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

'పేదరికం చదువుకు అడ్డుకాదు'



నవతెలంగాణ- చైతన్యపురి

పేదరికం చదువుకు అడ్డుకాదని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హెూల్డర్ (4 టైమ్స్), రచయిత, సోషల్ వర్కర్, ప్రముఖ కళాకారులు డాక్టర్ పెండెం కృష్ణకుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నంకు చెందిన మేఘన కు ఎంబీబీఎస్ సీట్ వచ్చింది. కానీ ఫీజుకు సరిపడ డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ పెండెం కృష్ణకుమార్ ఆదివారం మేఘన చదువుకు రూ.11000 ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి చేయూత

అబ్దుల్లాపూర్ మెట్ :

ఎంబీబీఎస్ సీటు సాధించిన మేఘనకు చేయూతనందించి మానవత్వాన్ని చాటుకున్నారు టీపీసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యులు దండెం రాంరెడ్డి. ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రగుంటకు చెందిన కత్తుల అండాలు, దేవదాసు దంపతుల కుమార్తె మేఘన నీట్ ఎగ్జామ్‌లో 11వేల ర్యాంకు సాధించగా..సిద్దిపేట జిల్లా ఆర్వీఎం కళాశాలలో ఎంబీబీఎస్ సీటు లభించింది. ఈ మేరకు ఆదివారం దండెం రాంరెడ్డి..మేఘనను అభినందించడంతో పాటు, రూ.10వేలు సాయం



అందజేశారు. భవిష్యత్‌లో కూడా మేఘన చదువుకు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొల్కంపల్లి ఎంపీటీసీ మంగ రవీందర్, మాజీ సేవాదళ్ చైర్మన్ రాంబాబు, నాయకులు సప్తగిరి, శ్రీకాంత్, విద్యార్థి తల్లీదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం

- మంత్రి సబితా ఇంద్రా రెడ్డి



నవతెలంగాణ - బడంగ్ పేట్

తెలంగాణ అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1,2,3,4,5,22,24,26,30 డివిజన్లలో రూ.12 కోట్లు 38లక్షల హెచ్ఎండీఏ, సాధారణ నిధులతో ఆదివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాలను మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్‌లతో కలిసి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో మున్సిపల్ కార్పొరేషన్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ నిధులతో ముఖ్యంగా మంచినీటి పైప్ లైన్, సీసీ రోడ్ల నిర్మాణ, డ్రైనేజీ వ్యవస్థ, బీటీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఈ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుమన్ రావు, మున్సిపల్ అధికారులు డీఈఈ జ్యోతి, ఏఈ వినీల్, ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ యాతం పవన్ కుమార్ యాదవ్, కార్పొరేటర్లు రామిడి కవిత రాంరెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకటరెడ్డి, ఏనుగు రాంరెడ్డి, భీమిడి స్వప్న జంగారెడ్డి, దీపిక శేఖర్ రెడ్డి, రామిడి మాధురి వీరకర్ణ రెడ్డి, ముత్యాల లలిత కృష్ణ,పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, లిక్కి మమత కృష్ణారెడ్డి, జెనిగ పద్మ ఐలయ్య యాదవ్, చుక్క శివకుమార్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహపురి కాలనీలో 24 సీసీ కెమెరాలు



నవతెలంగాణ-వనస్థలిపురం

కాలనీలోని ప్రజలు ప్రశాంత జీవనాన్ని సాగించడానికి సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని వనస్థలిపురం ఏసీపీ భీమ్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంజాపూర్ స్నేహ పూరి కాలనీలో.. కాలనీ సంక్షేమ సంఘ నాయకులు ఏర్పాటు చేసిన 24 సీసీ కెమెరాలను ఆదివారం వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కాలనీవాసులతో కమ్యూనిటీ పోలింగ్ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీలత గౌతమి రెడ్డి, కానీ అధ్యక్షుడు రామ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, భాస్కరాచారి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి కోసం గాలింపు

- కాలేజీ సమీప ప్రాంతంలో డ్రోన్ కెమెరాలతో జల్లెడ
- మూడు టీంలుగా పోలీసు బృందాలు



నవతెలంగాణ- అబ్దుల్లాపూర్ మెట్

నగర శివారులోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లమా ద్వితీయ సంవత్సరం చదువుతున్న నాగర్ కర్నూలు జిల్లా, కొండారెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే విద్యార్థి అదృశ్యమైన విషయం తెలిసిందే. పూర్తి వివరాలు..ఆంజనేయులు అదే కాలేజీకి చెందిన హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 20న తను ఇంటికి వెళ్లి వస్తానని హాస్టల్ వార్డెన్‌కు చెప్పి వెళ్లాడు. ఆంజనేయులు తిరిగి హాస్టల్‌కు రాకపోవడంతో వార్డెన్ విద్యార్థి తల్లీదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతని ఆచూకి కోసం తల్లీదండ్రులు తెలిసిన వారివద్ద ఆరతీశారు. కానీ ఫలితం లేకపోవడంతో.. 23న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థి అదృశ్యమైన విషయం బహిర్గతమైంది. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు తల్లీదండ్రులతో కలిసి.. కళాశాల నిర్లక్ష్యం వలనే విద్యార్థి అదృశ్యం అయ్యారని ఆరోపిస్తూ శనివారం కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన విద్యార్థులు కళాశాలలోని అద్దాలు, బెంచీలు, కుర్చీలను పగలగొట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వనస్థలిపురం ఏసీపీ భీమ్ రెడ్డి అబ్దుల్లాపూర్ మెట్ సీఐ మాన్మోహన్ ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. రాచకొండ పోలీసు ఉన్నతాధికారులు అదృశ్యమైన ఆంజనేయులును వెతకడానికి మూడు టీంలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఆదివారం కళాశాల ప్రాంతాలోని గుట్టలు, చెరువులు, వాటర్ పాల్స్ తదితర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో జల్లెడ పట్టారు. అలాగే హయత్ నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యార్థి ఆంజనేయులు కోసం ఆరాతీస్తున్నారు.

గిరిజనుల ప్రత్యేక పండుగ తీజ్

- - ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



నవతెలంగాణ - తుర్కయాంజల్

గిరిజనులు భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు జరుపుకునే పండుగ తీజ్ అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. తుర్కయాంజల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లోని సాయి దయ కాలనీలో ఆదివారం నిర్వహించిన 'తీజ్ వేడుకల్లో' ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో గిరిజన తండాలో తీజ్ వేడుకలను ప్రత్యే కంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ పండుగ బతుక మ్మను పోలి ఉంటుందన్నారు. పెళ్లికాని యువతులు తొమ్మి ది రోజుల పాటు నవదాన్యాల మొలకలకు ప్రత్యేక పూజలు చేసి నిమజ్జనం చేస్తారని



అన్నారు. బంజారా అసోసియేషన్‌కు 600 గజాల స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాలు నాయక్, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, కౌన్సిలర్లు బొక్క రవీందర్ రెడ్డి, బొక్క శ్రీలత గౌతమ్ రెడ్డి, కళ్యాణ్ నాయక్, బ్యాంక్ డైరెక్టర్ సామ సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ కందాడ లక్ష్మారెడ్డి, నాయకులు గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, కాకుమాను చిన్నయ్య, బొక్క కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి సాయం చేసిన ఉప్పల్ ఫౌండేషన్



నవతెలంగాణ- నాగోల్

రెండు సంవత్సరాలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రోగికి ఆదివారం ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఉప్పల్ ఫౌండేషన్ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. సికింద్రాబాద్ తిరుమలగిరి ప్రాంతానికి చెందిన దూది పల్లి సుబ్బారావు భార్య శారద రెండు సంవత్సరాలుగా నాల్గొవ స్టేజి క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ సందర్భంగా దూదిపల్లి సుబ్బారావు మాట్లాడుతూ తన భార్య చికిత్సకు ఇప్పటికే ఎన్నో లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి పూర్తిగా మందులపై ఆధారపడి ఉందని వివరించారు. ఇప్పటికే ఆసుపత్రి ఖర్చులు, ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నా మని..దీంతో నాగోల్ లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస గుప్తను కలిసి తమను ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. వెంటనే స్పందించిన శ్రీనివాస గుప్త బాధితురాలి చికిత్స కోసం రూ. 50 వేల నగదు ఆర్థిక సాయంగా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ నాయకులు, సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాట్యమండలి రాష్ట్రస్థాయి కళాకారుల శిక్షణా శిబిరం



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

మండల కేంద్రంలోని రాకేష్ మాస్టర్ కళానిలయంలో ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో రాష్ట్రస్థాయి కళాకారుల వర్క్ షాప్‌లో భాగంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రజానాట్య మండలి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కట్టా నరసింహ తెలి పారు. ఈ సందర్భంగా ఆదివారం మీడియాతో మాట్లా డుతూ శిక్షణా శిబిరంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి దాదాపు 70 మంది కళాకారులు పాల్గొని శిక్షణ పొందనున్నారన్నారు. వర్క్ షాప్ లో ప్రజా సమస్యలపై పాటల ద్వారా కళారూపాలు రూపొందించబడతాయని, నిరుద్యోగం, ధరల పెరుదల, ఆర్థిక మాంద్యం, మతోన్మాద పోకడలను నిరసిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ కడుతూ ప్రజలను చైతన్యం చేయడం, రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాలకు, పాలకులకు తగిన బుద్ధి చెప్పే విధంగా కళారూపాల ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఈ కళారూపాలను ప్రజలు, ప్రజాతంత్ర వాదులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గడ్డం గణేష్, బూర్గుల ప్రభాకర్, పీఎన్ఎం పూర్వ నాయకులు ఆలేటి ఆటం, శివ తదితరులు పాల్గొన్నారు.

శివం హిల్స్‌లో కమిటీ హాల్ ప్రారంభం



నవతెలంగాణ - హయత్ నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హయత్‌నగర్ శివం హిల్స్ కాలనీ సంక్షేమ సభ్యులు తమ సొంత నిధులతో కాలనీ పార్కు స్థలంలో నూతన కమిటీ హాల్‌ను నిర్మించుకున్నారు. ఈ కమిటీ హాల్‌ను ఆదివారం కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నా డివిజన్ దిన దిన అభివృద్ధి చెందుతుందని హర్షం వ్యక్తం చేశారు. గడిచిన రెండున్నర ఏండ్లలో కనీస మౌలిక సదుపాయాలు, సీసీ రోడ్లు ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుంటూ...మిగిలి ఉన్న పనులు, కాలనీ పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్, నూతన వాటర్ బోర్, కాలనీ సెంటర్‌లో హై మాక్స్ లైట్ మరో రెండు..మూడు నెలల్లో వాటిని దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్, మోహన్ రెడ్డి, నాగభూషణం, శ్యాంసుందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సత్యం, రాధ కృష్ణ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, ముకుంద రెడ్డి, యాదగిరి చరీ, శ్రీధర్ రెడ్డి, సుధాకర్ నేత, శ్రీనివాస్, జనార్ధన్ రెడ్డి, పి.శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, నాయకులు శ్రీధర్ గౌడ్, శ్యాంసుందర్ రెడ్డి, హరీష్ రెడ్డి, గంట్ల ఎల్లారెడ్డి, యాదగిరి యాదవ్, సాయిరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.51వేలు విరాళం



నవతెలంగాణ- చైతన్యపురి

రంగారెడ్డి జిల్లా మన్నెగూడ గ్రామం, పోల్కంపల్లి (గ్రామ పంచాయతీ) పరిధిలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి 51,000 రూపాయల విరాళాన్ని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయ కమిటీ సభ్యులు ఆలయ పునర్నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని కోరినట్లు తెలిపారు. అందుకే రూ.51,000 విలువ గల చెక్కును అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా తనవంతుగా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. త్వరలో తన తండ్రి పేరు మీద ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి..పేద విద్యార్థుల చదువు కోసం అడుగులు వేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలా రాజశేఖర్ రెడ్డి, నందికొండ యాదగిరి రెడ్డి, వంగాల శ్రీకాంత్ రెడ్డి, యాదగిరి రెడ్డి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు ముఖ్య కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-తుర్కయాంజల్

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధి 10వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షులు నల్లవెల్లి కార్తీక్ కుమార్ అధ్యక్షతన ఆదివారం వార్డు ముఖ్య కార్యకర్తల 3వ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పరిశీలకుడిగా దండు మైలారం మాజీ సర్పంచ్ చీమల జగన్నాథం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో పార్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్‌రెడ్డి కృషితోనే తుర్కయాంజల్ మున్సిపాలిటీ అభి వృద్ధి చెందిందని వార్డు అధ్యక్షులు కార్తీక్ అన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు పీఏసీఎస్ డైరెక్టర్ దేవదాసు రవి, వార్డు మెంబర్ కాకి లింగం, గల్లయ్య, తుర్కయాంజల్ మాజీ సర్పంచ్ చెవుల దశరథ, బీఆర్ఎస్ నాయకులు కొమ్మని దయానంద్, చెక్క బాల్ నర్సింహా, చెక్క మల్లయ్య, మెత్తరి అశోక్, చెక్క సుధాకర్, చెవుల నరేందర్, తావుల జగన్, చెక్క నర్సింహా, గుడ్ల రాజు, చెక్క రఘు, రవీందర్, రాము, 10వ వార్డు జనరల్ సెక్రటరీ ధర్మ కన్నా, యూత్ అధ్యక్షులు బబ్లు, యువజన సంఘం అధ్యక్షులు శ్రవణ్, చెవుల వినోద్, శివగణేష్, నాని, శివకుమార్, వేణు, లడ్డు, బలరాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

'చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు'

నవతెలంగాణ-నాగోల్

చిరు ధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని బీజేపీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్ ఇంచార్జి మురళీధర్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదిని అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించగా.. ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్ డివిజన్‌లోని ఇంద్రప్రస్థ కాలనీలో చిరుధాన్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మురళీధర్ రావు, కర్ణాటక ఎమ్మెల్సీ రవికుమార్, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్‌లు పాల్గొని అక్కడున్నవారికి చిరుధాన్యాల భోజనాలను అందించారు. అనంతరం మురళీధర్ రావు మాట్లాడుతూ చిరుధాన్యాలతో కూడిన భోజనాలను అలవర్చుకుంటూ..యోగా లాంటి కార్యక్రమాలలో పాల్గొంటే ఎటువంటి రోగాలు మన ధరి చేరవని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రప్రస్థ కాలనీవాసులు శెట్టి లయ, హరిబాబు, చంద్రశేఖర్ గుప్త, రాధిక తదితరులు పాల్గొన్నారు.

కిడ్స్ సైక్లింగ్‌ను ప్రారంభించిన శ్రీనివాసగుప్త



నవతెలంగాణ - నాగోల్

సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లో సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ మాక్స్వెల్ సైక్లింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కిడ్స్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ ఛాంపియన్షిప్ 2023 సీజన్ 3ని నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

'ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి'



నవతెలంగాణ - హయత్‌నగర్

18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. మాన్సూరాబాద్ డివిజన్, సెంట్రల్ బ్యాంక్ కాలనీ సమీపంలో కాకతీయ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఆదివారం ఓటర్ నమోదు ప్రక్రియ, ఓటర్ లిస్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపటి భవిష్యత్ తీర్పునకు ఓటు అనేది ఆయుధం అని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో కొత్త ఓటర్ నమోదు, మార్పులు, చేర్పులు తదితర వాటిని సరిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనిత గౌడ్, బీజేపీ నాయకులు పాతూరి శ్రీధర్ గౌడ్, మునగాల హరీష్ రెడ్డి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

నిధి శర్మిష్ట నాట్యం నవరస సహితం

నవతెలంగాణ- కల్చరల్

చక్కని తల్లికి చాంగు భళా చక్కని మోవికి చాంగు భళా అన్నమయ్య జానపద శైలిలో రాసిన కీర్తనను నిధి పద ముద్రలలో మెళకువలతో చురుకుగా నర్తించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. ప్రముఖ నాట్య గురువు దీపికా రెడ్డి శిష్యురాలు నిధి శర్మిష్ట రెడ్డి కూచిపూడి రంగప్రవేశం రవీంద్రభారతి ప్రధాన వేదిక పై జరిగింది. నిధి తొలి అంశంగా వెంకట సుబ్బయ్య కృతి ప్రణవాకరం తో నృత్యాన్ని ఆరంభించి..రామదాసు కీర్తన తక్కువేమీ మనకు రాముడు వొక్క దుండు వరకులో భక్తి రసాన్ని అభినయ ప్రదానం గా నర్తించారు. గురువు దీపికా రెడ్డి నటువాంగం చేయగా డీ.ఎస్.వీ.శాస్త్రి గానం మధురంగా వుంది. మృదంగంపై రాజగోపాలాచర్య వాయులీనంపై సాయి కుమార్, వేణువుపై మురళి సహకరించారు.

అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ...నాట్యం ఏకాగ్రత, క్రమశిక్షణ నేర్పుతుందన్నారు. గురువు ప్రతిభావంతులైన శిష్యులు ఆ స్థాయిలో రాణి స్తారన్నారు. దీపికా రెడ్డి, నిధి గురు శిష్య బంధం గొప్పదని అన్నారు. వేదిక పై గంగుల ప్రతాప రెడ్డి, అనన్య తదితరులు పాల్గొని నిధిని అభినందించారు.



ఎల్బీనగర్‌ను ఇంకా అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి వైపు అడుగులేస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కొత్త కాపు యాదవరెడ్డి గార్డెన్స్ నందు లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీని వాసరావు ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ పరిధి లోని పలు కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసు కొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెంది ఉందన్నారు. ఇంకా కొంతమేర అభివృద్ధి చేయా ల్సిన అవసరం ఉందన్నారు. గతంలో చిన్నపాటి వర్షానికి లింగోజిగూడా డివిజన్ మొత్తం వర్షపునీటితో అతలాకుతలం అయ్యేదని..రోడ్లు రవాణా స్తం భించేది..కానీ ఇప్పుడు నూతన బాక్స్ డ్రైన్స్ నిర్మాణ పనులు చేపట్టిన తర్వాత వరదనీటి సమస్యకు శాశ్వత పరి ష్కారం లభించిందని వివరించారు. దాదాపు అన్ని కాలనీల రోడ్ల నిర్మాణ పనులు పూర్తైనట్లు తెలిపారు. గతంలో వేసిన డ్రైన్స్ చిన్నగా ఉన్న ఒదు వలన డ్రైన్స్ పొంగుతున్న నేపథ్యంలో వాటి స్థానంలో నూతన డ్రైన్స్ పనులు నిర్మిస్తామని తెలిపారు. అలాగే నూతన ట్రాన్స్ఫార్మర్స్, కరెంటు పోల్స్ ఎక్కడెక్కడ అవసరమో అక్కడ ఏర్పాటు చేస్తామన్నారు. వృధాగా ఉన్న పార్కులను అభివృద్ధి చేసి, అందులో బోరు వేయిస్తామన్నారు. వందల కోట్ల రూపాయలు నిధులు తెచ్చి నియో జకవర్గాన్నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్య క్షులు వరప్రసాద్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ ప్రసన్న, కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం ధర్మకర్త మధుసాగర్, సీనియర్ నాయకులు శ్రీధర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, నర్రె శ్రీనివాస్, తిలక్ రావు, రాకేశ్ ఠాగూర్, భాస్కర్ గంగపుత్ర, నర్సింహాగుప్తా, అనంద్ గౌడ్, ఇంద్రజీ, ఆశిష్, కుమార్, ప్రకాష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ- నాగోల్

ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధా లుగా అభివృద్ధి చేశాం..ఇంకా చేయాల్సి ఉందని, అది కూడా దశల వారీగా చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్‌లోని అనంతుల రాంరెడ్డి గార్డెన్‌లో ఆదివారం జరిగిన



నాగోల్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీ సంక్షేమ సంఘ సభ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దాదాపుగా అన్ని కాలనీల రోడ్ల నిర్మాణ పనులు పూర్తి అయినట్లు తెలిపారు. ఇంకా ఎక్కడెక్కడ పూర్తి కాలేదో గుర్తించి, వెంటనే పూర్తి చేస్తానని అన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలో కొన్ని కాలనీల యందు రిజిస్ట్రేషన్ సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారికి 118 జీవో తెచ్చి వారికి ఉపశమనం కలిగించడం జరిగిందని గుర్తు చేశారు. డంపింగ్ యార్డు స్థలంలో రాబోయే రోజుల్లో అద్భుతమైన పూలవనాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు చిరంజీవి, సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు ప్రమీల, సీనియర్ మహిళా నాయకురాలు రంగేశ్వరి, శిల్ప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్ ప్రారంభించిన బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ చక్రిపురం చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన నేచురల్స్ బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవానికి ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, కాప్రా కార్పొరేటర్ స్వర్ణ రాజ్, సినీ హీరో శ్రీ కృష్ణ, నేమూరి మహేష్‌గౌడ్, నేచురల్స్ యాజమాన్యం రమేష్, మహేష్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షే సంఘం అధ్యక్షుడిగా జనార్ధన్‌రెడ్డి



నవతెలంగాణ-ఘట్కేసర్

రెడ్డి సంక్షేమ సంఘం మున్సిపాల్టీ అధ్యక్షుడిగా కట్ట జనార్ధన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సంజీవరెడ్డి, కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పన్నాల శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కొమ్మిడి శివప్రదీప్‌రెడ్డి, కోశాధికారిగా ఆల్వ జైపాల్‌రెడ్డి, సభ్యులుగా గడీల రాంచంద్రారెడ్డి, పురుషోత్తంరెడ్డి, బొక్క సంజీవరెడ్డి, మైపాల్‌రెడ్డి, కట్ట హరినాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని నూతన కమిటీ తెలిపింది. అనంతరం నూతన అధ్యక్షుడిని పూలమాలలతో సత్కరించారు.

అవయవదానాల్లో తెలంగాణకు 1స్థానం



నవతెలంగాణ-కాప్రా

అవయవ దానాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాల కన్నా ముందు ఉన్నదని అవయవదాన అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి గురు ప్రకాష్ పేర్కొన్నారు. చర్లపల్లిలోని ఈసీ నగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన అవయవదానం అవగాహన సదస్సులో మాట్లాడారు. దేశవ్యాప్తంగా గత ఏడాది 2200 మంది అవయవ దానాలు చేయగా తెలంగాణలోనే 550 మంది అవయవదానం చేశారని తెలిపారు. ఇతరుల ప్రాణాలు కాపాడటంలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అవార్డు కూడా ఇచ్చిందని చెప్పారు. ప్రజలందరూ అవయదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. ఏఆర్‌సీ హాస్పిటల్ వైద్యులు వీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ప్రజల్లో రక్తదానం. అవయవదానం చేసేందుకు అవగాహన కల్పించాలన్నారు. 97 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. ప్రజలు సంవత్సరానికి కనీసం ఒక్కసారైనా సరే రక్త దానం చేయాలని కోరారు. ఈ సదస్సుకు ఈసీనగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సీహెచ్. వరప్రసాద్ అధ్యక్షత వహించారు. అసోసియేషన్ కార్యదర్శి సత్తిరెడ్డి, సమ్మయ్య వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి తదితరులున్నారు.

ఓనం పండుగకు హాజరైన బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ సిరి గార్డెన్‌లో నిర్వహించిన ఓనం పండుగ ఉత్సవాల్లో కేరళ మంత్రి రాధాకృష్ణతో బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి హాజరైయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓనం కేరళ రాష్ట్రంలో జరిగే సాంస్కృతిక పండుగ అని తెలిపారు. కేరళీయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మల్లేశ యాదవ్, మహేష్ గౌడ్, బొడిగే రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోలీస్ ఆస్పత్రి 6వ వార్షికోత్సవం



నవతెలంగాణ-కాప్రా

సోలీస్ ఆస్పత్రి 6వ వార్షికోత్సవ వేడుకలు ఈసీఐఎల్ సోలీస్ఐ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరాధ్య బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వందమంది రక్తదానం చేశారు. ఆస్పత్రి అధినేత నందనపాటి రాము 58వ పుట్టినరోజు కావడంతో కేక్‌కట్ చేయించారు. అనంతరం సోలీస్ ఆస్పత్రి యాజమాన్యం అన్నదానం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, ఆర్ఎస్ఎస్ జాతీయ నాయకులు రాఘవులు, అశ్విని హెయిర్ ఆయిల్ అధినేత సుబ్బారావు, కుషాయిగూడ లైన్స్ హాస్పిటల్ చైర్మెన్ మాజీ కార్పొరేటర్స్ కొత్త రామారావు, పావనిమణిపాల్‌రెడ్డి, మోహన్‌రావు, ఏఎస్‌రావునగర్ బీఆర్ఎస్ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి,మురళీ , మహేష్, తులసి టీవీఎస్ షోరూమ్స్ అధినేత శివరాం , రవి , సోలీస్ ఇన్‌చార్జి మహేష్ , విజయేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ శివానంద్,వంశరాజ్ మల్లేష్, , బొడిగే రాజు ఉన్నారు.

65వ వారానికి చేరిన అంబేద్కర్ జ్ఞానమాల



నవతెలంగాణ-కాప్రా

తాడూరి గగన్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం శనివారంతో 65వ వారానికి చేరింది. కాప్రా సర్కిల్ జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావుఫూలే విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మెన్ బండారి లక్ష్మారెడ్డి, డాక్టర్ ఏఎస్‌రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్ రెడ్డి, భారతీయ మానజాతుల ప్రజా సమితి అధ్యక్షులు ఎం.రామచంద్రం, చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి రామ్మోహన్, ఉప్పల్ బీ బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, రామారావు, పావని మణిపాల్ రెడ్డి, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్ఫూర్తి గ్రూప్, ఇండియా ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

'ప్రతిభ వెలికి తీయడానికే క్రీడా పోటీలు'



నవతెలంగాణ -శామీర్‌పేట

గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడా పోటీలు దోహదపడుతాయని బీఆర్ఎస్ శామీర్‌పేట మండల కార్యదర్శి సతీష్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలంలోని పొన్నాల గ్రామంలో పొన్నాల్ ప్రీమియం (క్రికెట్) లీగ్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో లెజెండ్‌టీం విన్నర్‌గా, బూర్జు టీం రన్నర్‌గా నిలిచాయి. కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి సౌజన్యంతో ఇరు జట్లకు బీఆర్ఎస్ నాయకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శామీర్ పేట మండల ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, ప్రచారకార్యదర్శి కలికోట ప్రభాకర్ సంయుక్త కార్యదర్శి రమేష్, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ శంకర్, వార్డు సభ్యులు శివశంకర్, మురళి, మధు, మల్లేష్, రవి బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు.

'ఈట్ రైట్ మిల్లెట్' వాకథాన్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎఫ్ఎస్ఎస్ఏఐ, హెర్బాలైఫ్ సంయుక్తంగా నగరంలో ఈట్ రైట్ మిల్లెట్ వాకథాన్ నిర్వహించాయి. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం (ఐవైఎం) 2023కు అనుగుణంగా, పౌరుల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించే ఎఫ్ఎస్ఎస్ఏఐ చొరవను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ఉద్దేశించబడింది హైదరాబాద్‌లో ఈట్ రైట్ మిల్లెట్ వాకథాన్ ద్వారా ఆహారాన్ని వృథా చేయకుండా సురక్షితమైన, బలవర్ధకమైన, ఆరోగ్యకరమైన ఆహారంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ, దక్షిణ ప్రాంతం హెర్బాలైఫ్‌తో కలిసి సన్నద్ధమైంది. "సురక్షితమైన, పోషకమైన ఆహారాన్ని తినడం గురించి వినియోగదారులకు అవగాహన కల్పించడానికి ఉద్దేశించిన ఈ పాన్-ఇండియా చొరవలో భాగం కావడం మాకు చాలా సంతోషంగా ఉంది. ఈట్ రైట్ చొరవను ప్రోత్సహించడానికి, ఆరోగ్యకరమైన జీవనం కోసం ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడంలో ప్రజలకు సహాయపడటానికి మేం ఎఫ్ఎస్ఎస్ఏఐతో భాగస్వామ్యం కుదుర్చుకున్నాం. స్వస్థ భారత్ మిషన్‌లో భాగంగా, దేశంలో పోషకాహార అంతరాలను పరిష్కరించడానికి సమగ్ర ఆరోగ్య వ్యవస్థను అభివద్ధి చేయడంలో ఎఫ్ఎస్ఎస్ఏఐకి మద్దతు ఇస్తూనే ఉంటాం. ఇలాంటి కార్యక్రమాలు, క్షేత్రస్థాయి కార్యక్రమాల ద్వారా పౌరుల ఆహారపు అలవాట్లను మార్చవచ్చు" అని హెర్బాలైఫ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ ఖన్నా పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని షర్మిల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఒకటి నుంచి ఐదో తరగతివరకు చదువుతున్న నిరుపేద విద్యార్థులకు టి. కాలేషా, డాక్టర్ నర్సింహ్మా చారి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండీ. పాషామియా, మాజీ వార్డ్ మెంబర్ దాస్, కృష్ణ, కమాలి హుస్సేన్ సాబ్ సమక్షంలో స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు, జామెంట్రీ బాక్స్, పెన్నులు, స్కేల్స్ అందజేశారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో షర్మిల ట్రస్టు నిర్వహకురాలు షర్మిల ప్రసంగిస్తూ ట్రస్టు ప్రారంభోత్సవానికి విచ్చేసిన పెద్దలకు అభినందనలు తెలియజేశారు. తన జన్మదినం రోజునే షర్మిల ట్రస్టును లాగిన్ చేయడం వెనుక ఎంతోమంది మిత్రబృందం, పెద్దల ప్రోత్సాహం ఉందని గుర్తుచేశారు.

ట్రస్టు అభివృద్ధికి సహాయం చేసి చేయుతను ఇవ్వాలని కోరారు. నిరు పేదల పిల్లలకు, వృద్ధులకు, వికలాంగులకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు అండగా నిలబడడానికి ప్రతి ఒక్కరూ షర్మిల ట్రస్టు ద్వారా నిర్వహించే సేవలో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు.

'అవకాశం ఇవ్వండి..అభివృద్ధి ఏంటో చూపిస్తా'



నవతెలంగాణ-కాప్రా

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి ఏంటో చూపిస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. అందరికీ అందుబాటులో ఉంటూ గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా పనిచేస్తానన్నారు. పార్టీ కార్యకర్తల అందరూ నా కుటుంబ సభ్యులేనని తెలిపారు. తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, గుమ్మడి జంపాల్‌రెడ్డి ,డివిజన్ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి'



నవతెలంగాణ-కీసర

ఆర్య వైశ్యులు అన్ని రంగాలలో రాణించాలని

కీసర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెజుగం శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం నాగారం మున్సిపాల్టీ పరిధిలోని ఆర్య వైశ్యులు సమావేశమై నాగారం మున్సిపాల్టీ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం ఏర్పాటు చేశారు. రేణుకుంట్ల శివశంకర్ గుప్తాను అధ్యక్షులుగా, ఇరుకుల్ల రమేష్ గుప్తాను ఉపాధ్యక్షులుగా, ముక్క సంతోష్ కుమార్ గుప్తాను కార్యదర్శిగా, బెజుగం నవీన్ గుప్తాను కోశాధికారిగా, తల్లం భాస్కర్ గుప్తా, పాత వెంకటేశం గుప్తా ఉపాధ్యక్షులుగా, లింగా నాగేందర్ గుప్తా సంయుక్త కార్యదర్శిగా, మాదం శెట్టి సతీష్ గుప్తా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు.

కుమారుడికి పునర్జన్మ ఇచ్చిన తల్లి

- 21 ఏండ్లకే మూత్రపిండాల సమస్య
- తన కిడ్నీ దానం చేసిన కన్న తల్లి



నవతెలంగాణ-సిటీబ్యూరో

అతి చిన్న వయసులోనే కిడ్నీ సమస్య వచ్చిన ఓ యువకుడికి అతడి తల్లి తన కిడ్నీ దానం చేసి ప్రాణాలు పోశారు. నగరంలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆస్పత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ చల్లా రాజేంద్రప్రసాద్ ఇందుకు సంబంధించిన వివరాలను తెలిపారు. "నగరానికి చెందిన 21 ఏండ్ల విద్యార్థి రెండు, మూడేండ్ల నుంచి తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్నాడు. నిజానికి అప్పటికే అతడికి బీపీ పెరిగినా.. ఆ విషయాన్ని గుర్తించలేకపోయాడు. కొన్నాళ్ల తర్వాత నుంచి బరువు గణనీయంగా తగ్గిపోయాడు, ఆకలి కూడా ఏమాత్రం లేదు. దాంతో దగ్గరలో ఉన్న ఒక వైద్యుడి వద్దకు వెళ్లగా.. మూత్రపిండాలు దెబ్బతిన్న విషయం గమనించి, ఏఐఎన్‌యూకు పంపారు. ఇక్కడకు వచ్చిన తర్వాత మరింత క్షుణ్ణంగా పరీక్షలు చేయగా, అతడికి రెండు కిడ్నీలూ 10 సెంటీమీటర్ల పరిమాణంలో ఉండాల్సినవి ఏడు సెంటీమీటర్లకు తగ్గిపోయాయి. సాధారణంగా ఇలాంటప్పుడు డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి మాత్రమే చేయాల్సి ఉంటుంది. ఇతడి కేసులో ఇంకా చాలా జీవితం ఉండటం వల్ల కిడ్నీ మార్పిడి మంచిదని నిర్ధారించాం. అతడి తల్లికి 42 ఏండ్లు కావడంతో ఆమె అతడికి తన కిడ్నీ దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఇటీవలే ఆమె నుంచి కిడ్నీ తీసి ఇతడికి అమర్చాము. శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది" అని వైద్యులు తెలిపారు.

తగిన జాగ్రత్తలతో సుదీర్ఘ జీవితం

"కిడ్నీ మార్పిడి చేయించుకోవడంపై కొంతమందిలో ఇప్పటికీ అపోహలు ఉన్నాయి. కానీ, నేను 18 ఏండ్ల క్రితం మొదటిసారి కిడ్నీ మార్పిడి చేసిన ఒక రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇప్పటికీ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు. ఇలా 17, 18 ఏండ్ల క్రితం మార్పించుకున్నవారు సైతం ఇప్పుడూ బాగున్నారు. కిడ్నీ మార్పిడి చేయించుకున్న తర్వాత మూడు నెలలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఆ తర్వాత కూడా జీవనశైలి విషయంలో చాలా మార్పులు చేసుకోవాలి. సరైన ఆహారం తీసుకోవాలి, పరిశుభ్రంగా ఉండాలి. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలి. జీవితాంతం కొన్ని మందులు వాడుతుండాలి. అలా చేస్తే సుదీర్ఘకాలం పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవితం గడపవచ్చు" అని వైద్యులు తెలిపారు.

చిన్న వయసులోనే బీపీ.. అందుకే కిడ్నీ వైఫల్యం

"ఇటీవలి కాలంలో కొంతమందికి చిన్న వయసులోనే బీపీ బాగా ఎక్కువగా పెరుగుతోంది. కానీ దాన్ని గుర్తించే సరికే ఆలస్యం అవుతోంది. నిజానికి కాళ్ల వాపులు, కళ్ల వాపులు, బరువు తగ్గడం, మూత్రంలో రక్తం పడటం, బీపీ పెరగడం.. ఇవన్నీ కిడ్నీ వ్యాధి లక్షణాలే. ఇలాంటి లక్షణాలు ఉన్నప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలి. ఆకలి తగ్గినా, బరువు తగ్గిపోతున్నా వెంటనే తగిన వైద్యులకు చూపించుకోవాలి. ముందుగానే ఈ సమస్యను గుర్తిస్తే, కిడ్నీ బయాప్సీ చేయించి మందులతోనే చాలావరకు నయం చేయొచ్చు. మరీ ఆలస్యమైతే కిడ్నీ పరిమాణం తగ్గిపోతుంది. అప్పుడు ఇక కిడ్నీ మార్పిడి లేదా డయాలసిస్ చేయాల్సి వస్తుంది" అని డాక్టర్ చల్లా రాజేంద్రప్రసాద్ వివరించారు.

'విద్యార్థులు క్రీడల్లో రాణించాలి'

నవతెలంగాణ-ఉప్పల్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలనికార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. తైక్వాండో మార్షల్ ఆర్ట్స్‌లో జోషి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు కేడీఆర్ క్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన హై రేంజ్ పంచ్ విభాగంలో ఒకే నిమిషంలో 250 పంచ్‌లు కొట్టి గిన్నీస్ వరల్డ్ రికార్డ్ నెలకొల్పిన జోషి విద్యానికేతన్ విద్యార్థులకు కార్పొరేటర్ బహుమతులు ప్రదానం చేసి విజేతలను అభినందించారు. విద్యార్థులు విద్యతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లోనూ రాణించడం అభినందనీయమన్నారు. వారు సైనికులుగా దేశ రక్షణలో సేవలు అందించాలని మార్గదర్శకం చేశారు. కార్యక్రమంలో హబ్సిగూడ కార్పొరేటర్ చేతనాహరీష్, పాఠశాల కరస్పాండెంట్ జగదీష్ జోషీ, కేడిఆర్ టైక్వాండో అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీతోనే మైనార్టీల అభివృద్ధి

- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్

ముస్లిం, ఇతర మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం పీర్జాదిగూడ కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ మైనార్టీ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. మైనార్టీల అభ్యున్నతి కోసం పోరాడే పార్టీ, ఆలోచించే పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గం మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎండీ. అబ్దుల్ మఖ్సూద్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ అష్రఫ్ అలీలను నియమిస్తూ మేడ్చల్ నియోజకవర్గం మైనార్టీ విభాగం చైర్మెన్ షేక్ ఖలీల్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన మైనార్టీ యువకులు తోటకూర వజ్రేష్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ మండల అధ్యక్షులు కర్రె రాజేష్, ఘట్కేసర్ మండల మున్సిపాల్టీ అధ్యక్షులు ముత్యాలు యాదవ్, మూడుచింతల్ పల్లి మండల అధ్యక్షులు నర్సింహ యాదవ్, కచవాని సింగారం గ్రామ అధ్యక్షులు మధు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌తోనే ఆత్మగౌరవం'



నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్రంలోని బీసీల ఆత్మ గౌరవం కోసం నిరంతరం కృషి చేసేది బీఆర్ఎస్ సర్కారేనని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలా కర్ అన్నారు. ఆదివారం మేడ్చల్ జిల్లా మేడిపల్లిలో చాత్తాద శ్రీ వైష్ణవి ఆత్మ గౌరవ భవనం కోసం మంత్రి మల్లారెడ్డితో కలిసి శంకుస్థాప న చేశారు. కులాల ఆత్మగౌరవం కోసం భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించిన ఘనత కేసీఆర్ సర్కారు కే దక్కుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ దయాకర్ రెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు శుభాకాంక్షలు వెల్లువ

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కూకట్‌పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా మాధవరం కృష్ణారావును సీఎం కేసీఆర్ మూడవ సారి ప్రకటించారు. ఈ సందర్భంగా బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరిష బాబురావు , డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్‌లతో కలిసి బాలాజీనగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బడబందల భాస్కర్ రావులు ఆదివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'వైభవ్ రెస్టారెంట్'ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'వైభవ్ రెస్టారెంట్'ని ఆదివారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మన్నే రాజు, మాజీ కౌన్సిలర్ బోబ్బా రంగా రావు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు వుప్పాల భాస్కర్, రుద్రా అశోక్, సీనియర్ నాయకుల వారాల వినోద్, మక్సూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

102వ రోజుకు చేరిన ఎమ్మెల్యే " ప్రగతి యాత్ర "



● ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 102వ రోజు ప్రగతి యాత్రలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ 130 డివిజన్ సుభాష్ నగర్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హమీద్ బస్తీ రాళ్ళకంచెలో రూ. 50లక్షల వ్యయంతో చేపడుతున్న భూగర్భ డ్రయినేజీ నిర్మాణ పనులకు హమీద్ బస్తీ, రాళ్ళకంచెలో నూతనంగా నిర్మించిన మజీద్ - ఏ- మెహ్రాజ్ భవనం, భగత్ సింగ్ నగర్ పోచమ్మ ఆలయం వద్ద రూ.18 లక్షలతో చేపట్టనున్న నూతన కమ్యూనిటీ హాలు భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి కాలనీ అభివృద్దే తమ ధ్యేయం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మెన్ మన్నే రాజు, మాజీ కౌన్సిలర్ బి.రంగారావు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ హుస్సేన్, విష్ణు, మజీద్ - ఏ- మెహ్రాజ్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ నాయకులు చిల్లర రాజకీయాలకు పాలపడుతూ బాలానగర్ డివిజన్ పరిధిలో బలవంతంగా కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని బాలానగర్ డివిజన్ వినాయకనగర్ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వినాయకనగర్‌లో బలవంతంగా కాషాయ కండువా కప్పి రాజకీయంగా దుమారం రేకెత్తించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు అతని అనుచరులు వినాయకనగర్ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తీవ్రంగా ఖండించారు. ఆదివారం సంఘం కార్యాలయలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు సిద్ధిరాములు మాట్లాడుతూ ఊహించని విధంగా మాట లలో మభ్యపెట్టి పార్టీ కండువాను కప్పి రాజకీయ లబ్ధికోసం సోషల్ మీడియాలో ఫోటోలను వైరల్ చేశారని, ఒక జాతీయ పార్టీ రాష్ట్ర నాయకుడిగా వడ్డేపల్లి రాజేశ్వర్ రావుకు ఇంటి కార్యక్రమాలకు పాల్పడితే మర్యాద వుండదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. వినాయకనగర్ సంక్షేమ సంఘం ఎన్నడూ బీఆర్ఎస్ పార్టీ వీడబోదని సభాముఖంగా కాలనీ అధ్యక్షుడు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షు లు సిద్దిరాములు, ప్రధాన కార్యదర్శి శివకుమార్, సంఘం సభ్యులు గువ్వల వేణు, నాగవెల్లి మహేష్, నాగరాజు, నరేష్, సోమయ్య, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ సేవలు చిరస్మరణీయం : గద్దర్ కుమార్తె వెన్నెల



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజా యుద్ధనౌక గద్దర్ యావత్ తెలుగు రాష్ట్రాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని దివంగత గద్దర్ కుమార్తె వెన్నెల అన్నారు. శనివారం సాయంత్రం చింతల్ డివిజన్ పరిధి భగత్ సింగ్ నగర్‌లో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఐఏఎస్ అధికారి అంబేద్కరిస్టు జేబి. రాజు, గద్దర్‌కు అత్యంత సన్నిహితులు సిఎల్. యాదగిరిలు ముఖ్య అతిథులుగా పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న అవినీతిని పాటలతో ప్రజలను చైతన్యవంతులను చేస్తూ వారిలో మనోధైర్యాన్ని నింపిన గొప్ప వారిని కొనియాడారు. గద్దర్ ఆశయ సాధనకు ప్రతి తెలంగాణ పౌరుడు కవులు కళాకారులు కృషి చేయాలని తెలిపారు. కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ టి. లక్ష్మారెడ్డి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సత్యం, కార్యక్రమ నిర్వాహకులు దళిత రత్న అవార్డు గ్రహీత నిషాని చందర్, కె .శ్యామల, డి .మల్లేష్ లు మాట్లాడుతూ, భగత్ సింగ్ నగర్ స్థాపన కొరకు అప్పటి భగత్ సింగ్ నగర్ అధ్యక్షులు స్వర్గీయ యాలమూరి పెంచల్ రెడ్డి గద్దర్ కు అత్యంత సన్నిహితుడుగా ఉండేవాడని ఆయన సలహాలు పనిచేసేవాడని తెలిపారు. గద్దర్ భౌతికంగా మన మధ్యలో లేకపోయినా ఆయన పాటలు ఆయన రూపం మన మన సులో సజీవంగానే ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు జెల్లా వెంకటేష్, సంక్షేమ సంఘం సభ్యులు బీసు వెంకటేశం గౌడ్, జి. వరదరాజు, జి. నారాయణ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పరుశు రాం, సహదేవ్, కే. రాములు, ఏ. రాజిరెడ్డి, జి. సత్తిరెడ్డి, భగత్ సింగ్ నగర్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని గద్దర్‌కు ఘనంగా నివాళులు అర్పించిచారు. దళిత చైతన్య కళామండలి ఆధ్వర్యంలో చందరన్న బృందం నర్సింగ్ రావు పోచయ్య నీలమ్మ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి , పాటలు పాడి ప్రజలను ఉత్తేజపరిచాయి.

జనంలోకి జనసేన ప్రభంజనాన్ని సృష్టిస్తాం



● జనసేన రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్ డివిజన్‌లో జనసేన పార్టీ రాష్ట్ర కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ జన శ్రేణులతో కలిసి ఆదివారం సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. జనసేన పార్టీ విధానాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్ళుతూ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నమని జనసేన రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ తెలిపారు. ఈ నేపధ్యంలో గౌతమ్ నగర్, అక్షయ్ ఎన్ క్లేవ్ కాలనీ, శోభన కాలనీ, ఫతేనగర్ పైపు లైన్ రోడ్, భగత్ సింగ్ పార్క్ రోడ్డు పాదయాత్ర చేస్తూ జనసేన పార్టీ సిద్ధాంతాలను, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజలకు వివరిస్తూ డివిజన్‌లోని సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో యువత గంజాయి మాదక ద్రవ్యాలకు అలవాటు పడి భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న వారిపై కఠిన చర్య తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో జనసేన పార్టీని ఆదరిస్తే కూకట్ పల్లి నియోజకవర్గ యువతతో పాటు రాష్ట్రంలోని యువతకు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో మంచి భవిష్యత్తు ఇస్తామన్నారు. ముస్లింలు ,బడుగు బలహీన వర్గాలకు ఎల్లప్పుడూ జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్ జనసేన పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, ఎస్.కె నాగూర్, భరత్ గౌడ్, రాము, శ్రీనివాస్ రెడ్డి, కావ్య, వెంకటలక్ష్మి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు గడ్డం రంజిత్ రెడ్డి సతీమణి సీతా రంజిత్ రెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మెంబర్‌గా నియమితులైన సందర్భంగా, వారి నివాసంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందచేసి ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదర్శ్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రజల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబురావు అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని వివేక్ నగర్ కమ్యూనిటీ హాల్ పైన షెడ్ వేసేందుకు స్థానిక కార్పొరేటర్ శిరీష బాబురావు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ప్రెసిడెంట్ దుగూరి ప్రకాష్, ఏరియా జిఎస్ అనిల్ కుమార్, సీనియర్ నాయకులు ఏట్టయ్య, చందు, శోభ, లలిత, సురేష్, మోహన్, అశోక్, వెంకటేష్, సాయి, జీత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఫిషేర్మన్ కమిటీ వైస్ చైర్మెన్‌గా ఆకుల నరేందర్ ఇటీవల నియమితులైన సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నేత, కంటెస్టెడ్ కాంగ్రెస్ అభ్యర్థి గొట్టిముక్కల పద్మారావును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన నరేందర్‌ను అభినందిస్తూ, మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆశీర్వదించారు. వారిని కలిసిన వారిలో దీప్ సింగ్, రాంరెడ్డి, అఖిల్, శనూర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బాలానగర్



" వాషింగ్ కెప్టెన్ " ప్రారంభించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేఎం. ప్రతాప్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని యం.ఎస్. రెడ్డి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వాషింగ్ కెప్టెన్‌ను రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులు, కె.యం. ప్రతాప్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ యువకులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా, స్వయం ఉపాధి నెలకొల్పుకోవాలన్నా రు. కష్టపడి పని చేసుకుంటేనే అభివృద్ధి చెందుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో యం.ఎస్. రెడ్డి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్నే శ్యామ్, విట్టల్ నాయక్, పండరి, బాలచందర్ గౌడ్, శంకరయ్య, ఎల్లా గౌడ్, కుమార్, ఎమ్.ఎస్.రెడ్డి నగర్ ఫేస్- 2, ప్రధాన కార్యదర్శి శంకర్,వాషింగ్ కెప్టెన్ ప్రొప్రైటర్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

జె .జె కాలనీలో అనుమతి లేని పవర్ బోర్ సీజ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని జె.జె కాలనీలో ఆదివారం తమ అనుమతి లేకుండా ఆరున్నర అంగుళాల పవర్ బోర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని మల్కాజిగిరి మండల రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.డివిజన్ పరిధిలోని కాలనీలో అనుమతులు లేకుండా వేస్తున్న బోర్‌ను ఆయన సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మల్కాజిగిరి మండల పరిధిలో ఎక్కడా ఎవరూ ఆరున్నర అంగుళాల పవర్ బోర్లు వేయవద్దని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి బోర్లు వేస్తే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యారంగ సమస్యల పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ప్రభుత్వ పాఠశాలలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో కేసీఆర్‌ను గద్దె దింపుతామని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ అన్నారు. ఈ సందర్భంగా ఒక పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ విద్యారంగా సమస్యలు పరిష్కరించడంలో కేసీఆర్ సర్కార్ పూర్తిగా విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా కార్పొరేట్ వ్యవస్థకు తొత్తులుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని పేద మధ్యతరగతి విద్యార్థులకు దూరం చేసే విధంగా ఈనాడు తెలంగాణ రాష్ట్రంలో నెలకొ ందని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన నుంచి నేటి వరకు ప్రభుత్వ విద్యాసంస్థలలో ఎలాంటి మార్పులు ఈ రాష్ట్ర ప్రభుత్వం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను పూర్తిగా ప్రభుత్వ విద్యను కార్పొరేట్ వ్యవస్థకు అందించి బడా బాబులకు లాభాలు చేకూర్చే దిశగా ఈనాడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళుతున్నాయని వెంటనే ఈ ధోరణిని మార్చు కొని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని ప క్షంలో కేసీఆర్‌ని ప్రభుత్వాన్ని ఓడిస్తామని హెచ్చరించారు.

అన్ని వర్గాల న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ-మల్కాజిగిరి

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ రుణం చెక్కులను ఆయన చేతుల మీదుగా 250 లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, సునీత రాముయాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి, జితేంద్ర నాథ్, జి.ఎన్వి సతీష్ కుమార్, రాముయాదవ్, గుండా నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్ భాగ్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవమ్ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు గారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, సతీష్ కుమార్, గుండా నిరంజన్, ఈఓ.రవీందర్ రెడ్డి, ముడుంబై వెంకట్ రమణ చార్యులు, క్లర్ సుధాకర్, సంతోష్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే

యశోద హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్‌ను ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంత రావు ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్ జితేంద్ర నాథ్, సతిష్ కుమార్, బాబు, సత్యనారాయణ, ఎస్.ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.



గూలాబీ కండూవా కప్పకున్న బీజేపీ నాయకులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి/బాలానగర్

ముఖ్యమంత్రి కేసీఆర్ జనరంజక పాలన చూసి, బీఆర్ఎస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో పలువురు బీజేపీకి చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో, డివిజన్ పరిధిలోని శివశంకర్ నగర్, అమృత నగర్ తాండకు చెందిన 40 మంది నాయకులు, కార్యకర్తలు, అనుచరులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారిని ఎమ్మెల్యే తన క్యాంప్ కార్యాలయంలో, గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై దేవేందర్ గౌడ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో అగ్రగామిగా నిలిపిన దార్శనిక పాలకుడు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంచి.బిక్షపతి, హెచ్ .శ్రీనివాస్, ఆర్.దేవేందర్, బి.కన్న, డి. శ్రీకాంత్, డి.కుమార్, డి.అనిల్, రాము గౌడ్, యు.రాము, ఏ ఎన్.భీమా తదితరులు పాల్గొన్నారు.

హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో వివిధ పార్టీల నుండి భారీ ఎత్తున కాంగ్రెస్‌లో చేరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 సూరారం డివిజన్ కృష్ణ నగర్, సోనియా గాంధీ నగర్ 125 డివిజన్ దేవేందర్ నగర్ వాసులు కేంద్ర రాష్ట్ర వైఫల్యాల పై నిరంతరం పోరాటం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి గారి నాయకత్వానికి ఆకర్షితులై షేక్ అస్లాం, ఎండి ఆకిల్, అఫ్సర్ భాయ్, సమీర్, ప్రసన్న కుమార్ ఫరీద్, ఎండి అలీమ్, ఎండి మోసీన్, ఎండి అఫ్సాక్ గారి మిత్రబృందంతో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో హన్మంత్ రెడ్డి మట్లడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పథకం కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగర వేయడం కాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ అవిజె జేమ్స్, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, 125 డివిజన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు షఫీ, ఎండీ లాయక్, అజయ్, షేక్ అన్వార్ హుస్సేన్,129 డివిజన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ హనీఫ్ ఉద్దీన్, సంతోష్ ముదిరాజ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించడమే తన ధ్యేయం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన ధ్యేయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కె.పి.హెచ్.బి కాలనీ, రోడ్ నెంబర్ వన్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ అల్లూరి సీతారామరాజు పార్క్ , పవర్ నగర్, శ్రీ ఏ.పి.జే అబ్దుల్ కలాం పార్క్‌లను ఎమ్మెల్యేతో పాటు స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావులు పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధులు, దేశానికి సేవలు అందించిన గొప్ప నేతల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఉండాలనే ఆకాంక్షతో వారి పేర్లను ఖరారు చేయడం జరిగిందని తెలిపారు. అద్భుతంగా పార్కును రూపొందించిన ఎమ్మెల్యేకు, కార్పొరేటర్‌లకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ. సత్యనారాయణ, డిఈ. ఆనంద్, ఏఈ శ్రీనివాస్, సమత, శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, కార్యదర్శి వెంకటేష్ చౌదరి, శారద పాల్గొన్నారు.



ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి : బోగ విష్ణు మూర్తి



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

పర్యవరణ విధి, సైక్లింగ్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బోగ విష్ణు మూ ర్తి ఆధ్వర్యంలో ఆదివారం పలు అంశాలపై ప్రజలలో చైతన్యం తీసుకుని రావడానికి సైకిల్ యాత్ర, పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర వీబీఆర్ గార్డెన్ నుండి ఇందిరా గాంధీ విగ్రహం, సూర్య నగర్, అయ్యప్ప కాలనీ, అంబేద్కర్ నగర్, శ్రీ నగర్ కాలనీ మీదగా తిరిగి వీబీఆర్ గార్డెన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా చంద్రయాన్ జైత్ర యాత్ర, రక్షాభంధన్, వృక్షాబంధన్ గురించి ప్రజలకు అవగాహన కల్పిం చారు. చంద్రయాన్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తలకు, భారత ప్రభుత్వానికి, ప్రధాన నరేంద్ర మోడికి శుభాకాంక్షలు తెలిపా రు. రక్షా భందన్ కార్యక్రమంలో భాగంగా నేను నీకు రక్ష నీవు నాకు రక్ష మనమిద్దరం కలిసి దేశానికి రక్ష అని చెప్పి ఒకరికి ఒకరు రాఖీ కట్టుకున్నారు. వృక్ష రక్షణలో భాగంగా వేప చెట్టుకు రాఖీ కట్టి పూజ చేసి ప్రతి ఒక్కరు చెట్లను రక్షించాల న్నారు. చెట్లు నాటాలి పర్యావరణాన్ని కాపాడాలి అని శపథం చేశారు. ప్రముఖ్ మల్లీకార్జున్‌ఎం.రమాదేవి, రాంగోపాల్ రావ్, అశోక్, జగన్, కరుణాకర్ రెడ్డీ, సుదీప్, జగన్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో గాంధీ, కృష్ణారావులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు చెందిన ముస్లిం సోదరులు, సోదరీమణులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పలు సమస్యలు , పలు అభివృద్ధి పనుల పై ఆదివారం ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ నివాసంలో, జరిగిన ఆత్మీయ సమావేశంలో ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీని, ఎమ్మెల్యే కృష్ణారావులను సన్మానించారు. ఈ సందర్భంగా మైనారిటీ సోదరులు మాట్లాడుతూ, ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ ,ఎమ్మెల్యే కృష్ణారావులు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోయోజకవర్గంలను అన్ని రంగాలలో అభివృద్ధి చేశారని కొనియాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాబోయే ఎన్నికల్లో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఆరెకపూడి గాంధీని, కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా కృష్ణారావుని ప్రకటించిన నేపథ్యంలో ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్తి స్థాయి మద్దతు మీకే ఉంటుందనీ ,రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వ విప్ గాంధీ ని ,ఎమ్మెల్యే కృష్ణారావు లను భారీ మెజారిటీతో గెల్పించుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ కి కానుకగా ఇస్తామని ముస్లిం సోదరులు ముక్త కంఠంగా తెలియచేసారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ ,ఎమ్మెల్యే కృష్ణ రావులు మాట్లాడుతూ, ముస్లిం సమాజం బాగు కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఏ చిన్న సమస్య ఎదురైన మా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని తెలిపారు. అదేవిధంగా ఎల్లమ్మబండలో ఈద్గాను సకల హంగులతో ,అన్ని రకాల మౌలిక వసతులు కలిపిస్తూ అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జాతీయ సమైక్యతకు కలలు దోహదపడతాయి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జాతీయ సమైక్యతకు, సమగ్రతకు కలలు దోహదపడతామని" ఉమ్మడి హైకోర్టు పూర్వ నారామమూర్తి, ఆంధ్రప్రదేశ్ విద్యా నియం త్రణ మండలి అధ్యక్షులు రామలింగేశ్వర రావు అన్నారు.ఆదివారం నవ్యకటక సమితి ఆధ్య ర్యంలో తెలంగాణా సారస్వత పరిషత్ నిర్వహి స్తున్న నృత్యోత్సవ పోటీలకు హాజరై కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఖజానా శాఖ ఉపసంచారకులు వసుంధర. నవ్య నాటక సమితి ప్రతినిధులు టి శ్రీనివాసరావు. పాల్గొన్నారు.

కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా వేదాటి మధుసాగర్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కూకట్‌పల్లి నియోజకవర్గానికి కాంగ్రెస్ అభ్యర్థిగా వేదాటి మధు సాగర్ నాంపల్లి గాంధీభవన్‌లో దరఖాస్తు పత్రాన్ని దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ... తాను 1989లో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా గా పని చేసిన అనుభవం నియోజకవర్గంలో మంచి పేరును తెచ్చిందన్నారు. ఎప్పటి కప్పుడు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్య లనుపరిష్కరించడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలను చేసి ప్రజల మన్ననలను పొందడం జరిగిందన్నారు.సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా ఉంటూ పార్టీ ఉన్నతికి ఎనలేని సేవలు అందించానన్నారు. విద్యా, వైద్య, ఉద్యోగ, ఆరోగ్య రంగాల్లో ప్రజలకు ఎల్లవేళలా సేవలు చేస్తూ వారి మనసులో చిరస్థాయిగా నిలిచానన్నారు.దీన్ని దృష్టిలో పెట్టుకొని తనకు అధిష్టానం సీటును కేటాయిస్తే విజయుడనై కూకట్ పల్లి సీటును పార్టీకి బహుమతిగా ఇస్తానన్నారు.

'జగదీష్ రెడ్డిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి'

నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీలను అనగతొక్కుతున్న జగదీష్ రెడ్డిని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్ బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ. బీఆర్ఎస్ పార్టీలో ఎవరైనా బీసీ నాయకుడు పోటీ చేయాలని అనుకుంటే అతన్ని ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు. మంత్రి జగదీష్ రెడ్డికి మద్దతుగా పనిచేసి తన గెలుపుకు కీలకపాత్ర వహించిన డిస్టిక్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మెన్ ఒట్టే జానయ్య తనకు టికెట్ కేటాయించాలని బీసీ నాయకునిగా పోటీ చేస్తానని తెలపడంతో మంత్రి జగదీష్ రెడ్డి బీసీలు రాజకీయంగా ఎదుగుదని పక్ష సాధింపు చర్యలో భాగంగా ఒట్టే జానయ్య యాదవ్ పై ఒకే రోజు 60 కేసులను వేయించడం అన్యాయం అన్నారు. సూర్యాపేటలో బీసీలకు టికెట్లు ఇవ్వరా అని ప్రశ్నించారు. ఆంధ్ర ప్రదేశ్ లో బీసీలకు సీఎం జగన్ బీసీలకు పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. అగ్రకులాల నాయకులకు ఈ సారి రాజకీయంగా రెస్ట్ ఇవ్వాలన్నారు. బిసి సంక్షేమ సంఘం నాయకులు కృష్ణయ్య యాదవ్, సురేష్ యాదవ్ లు మాట్లాడుతూ... సూర్య పేటలో మంత్రి జగదీష్ రెడ్డి మరో మరో నయింగా మారారన్నారు. సూర్యాపేట లో బీసీలను అణిచి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అతి సామాన్యుడిగా ఉండే జగదీష్ రెడ్డి వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయి ఎలా సంపాదించారని ప్రశ్నించారు.త్వరలోనే మంత్రి జగదీష్ రెడ్డి



ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. వెంటనే జానయ్య యాదవ్ పై వేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, శ్రీకాంత్, సతీష్, సురేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాల్ కృష్ణ, విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వేముల రామకృష్ణ, రాజేందర్, రాందేవ్ మోడీ, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన 'కామధేను ఎస్టేట్స్ భారత్ షా బ్యాడ్మింటన్ లీగ్'

- ' బిగినర్స్', 'ఇంటర్మీడియట్', 'ప్రోస్' విభాగాల్లోని విజేతలకు ట్రోఫీల అందజేత

నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఎన్ఐ 'కామధేను రియల్ ఎస్టేట్స్ భారత్ షా బ్యాడ్మింటన్ లీగ్' రెండో ఎడిషన్ మాదాపూర్‌లోని గేమ్ పాయింట్‌లో ఆదివారం ముగిసింది. డబుల్స్ ఆడే ఈ టోర్నమెంట్ త్రీ పవర్ ప్యాక్ కేటగిరీలుగా విభజించబడింది. 'బిగినర్స్', సీజన్డ్ ప్లేయర్స్ కోసం 'ఇంటర్మీడియట్', 'ప్రోస్' ఉన్నాయి. రెండు రోజులుగా మూడు విభాగాల్లో 80 పైగా జట్లు ట్రోఫీల కోసం పోటీ పడ్డాయి. బిగినర్స్ విభాగంలో విజేతలు శ్రీనివాస్ బాశెట్టి, పింటు కలా, ఇంటర్మీడియట్ విభాగంలో అశోక్ చౌదరి, జీ మల్లా రెడ్డి కప్‌ను గెలుపొందారు. ప్రోస్ విభాగంలో హర్ష సుంకర, నాగార్జున ఛాంపియన్‌లుగా నిలిచారు.

టోర్నమెంట్ విజేతలు

బిగినర్స్ : శ్రీనివాస్ బాశెట్టి, పింటు కలా



ఇంటర్మీడియట్ : అశోక్ చౌదరి, జి.మల్లా రెడ్డి
ప్రోస్ : హర్ష సుంకర, కె.నాగార్జున

'శక్తినంతా కూడదీసుకుని పోరాడాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హక్కుల సాధన కోసం కార్మికులు, ఉద్యోగులు తమ శక్తినంతా కూడదీసుకుని పోరాడాలని ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ ప్రధాన కార్యదర్శి అనీరాజా సూచించారు.ఆదివారం హిమాయత్ నగర్ లోని ఎన్. సత్యనారాయణరెడ్డి భవన్ లో తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బడేటి వనజ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అనీరాజా హాజరై మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికి మహిళల్లో అణిచివేతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్‌హెచ్ఎంలో పని చేస్తున్న ఏఎన్ఎం లను రెండవ ఏఎన్ఎంలు అని పిలవడం ఏంటని ఆమె కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు.వివక్షత అనేది ప్రారంభంలోనే మొదలైందని, అది రూపుమాపే వరకు పోరాడాలని అభిప్రాయ పడ్డారు. భయపడుతూ పోరాడితే ఏదీ సాధించలేమని, తెగించి పోరాడితేనే హక్కులు సాధించుకోగ లుగుతామని సూచించారు. పోరాటాలను అణిచివేయటానికి ప్రభుత్వాలు ఎప్పుడూ ముందుంటాయని, ఆ అణిచివేతను దాటుకుని వెళ్తేనే విజయం వరిస్తుందన్నారు. మణిపూర్ లో మహిళలు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూడటానికి వెళ్లిన తనను అరెస్ట్ చేసినప్పుడు తను భయపడ లేదని, రెగ్యులేషన్ కోసం పోరాటం చేసేటప్పు డు అణిచివేత అరెస్టులు తప్పవని వాటికి భయపడాల్సిన అవసరం లేదన్నారు.రెండవ ఏఎన్ఎంలు రెగ్యులర్ అయ్యేంత వరకు పోరాడాలని ఆ పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయుసీ జాతీయ నాయకు రాలు బివి.విజయలక్ష్మి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు, రెండవ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధురిమ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సిహెచ్.విజయకుమారి, ఎస్.కరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంబర్ పేటను అభివృద్ధి చేసింది కిషన్ రెడ్డే



ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాజీవ్ గుమార్

నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలో వివిధ రాష్ట్రాల నుండి హాజరైన ఎమ్మెల్యేల పర్యటన స్థానికంగా ఆదివారంతో ముగిసిందని, అంబర్ పేటకు బాధ్యత వహించిన ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాజీవ్‌గుమార్‌కు హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా.ఎస్.గౌతమ్‌రావు వీడ్కోలు పలికారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రాజీవ్ గుమార్ మాట్లాడుతూ కేంద్ర పర్యాటక, సాంస్కృతిక , ఈశాన్య రాష్ట్రాల మంత్రి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి గతంలో అంబర్ పేట శాసనసభ్యుడిగా ఉన్నప్పుడే ఈ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాజీవ్ గుమార్ పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనాలను, అనేక పాఠశాలను నిర్మించడం జరిగిందని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎస్. గౌతమ్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల జిల్లా ఇంచార్జ్ వెంకట్ రెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, వై అమృత, పద్మ వెంకట్ రెడ్డి, కృష్ణగౌడ్, సూర్య ప్రకాష్ సింగ్, నంద కిషోర్, వనం రమేష్ , అజయ్ , రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కారం నేర్పని విద్యా సమాజానికి నష్టం

నవతెలంగాణ-కల్చరల్

ప్రస్తుతం మన విద్యావిధానం కేవలం ధన సంపాదనకు మాత్రమే అన్నట్లు రూపొందించారని దీనివల్ల విద్యార్థులలో సంస్కారం లోపిస్తోందని రామకృష్ణా మఠం ప్రతినిధి శితికంఠానంద స్వామీజీ అన్నారు. సంస్కారాన్ని నేర్పని విద్య వల్లనే నేడు సమాజంలో అవినీతి,అక్రమాలు, లంచగొండి తనం పెరిగిందని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై సెయింట్ ఆడమ్స్ హై స్కూల్ నిర్వహణలో తల్లితండ్రులు లకు అవగాహనా సదస్సు నిర్వహించారు.ప్రధాన వక్తగా హాజరైన శితికంఠానంద మాట్లాడుతూ.. పిల్లలలో వున్న ప్రతిభను గుర్తించి వెలుగులోకి తెచ్చే బాధ్యత తల్లితండ్రులులదే



నన్నారు. పిల్లలలో ఏకాగ్రతకు ధ్యానం ఉపయోగమని అది విద్యాలయల్లో నేర్పాల న్నారు. కానీ తల్లితండ్రులు కేవలం ర్యాంక్ లే ప్రధానంగా భావించటం వల్ల నైతిక విలువలు బోధన మానసిక యోగ వంటివాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. పిల్లలకు అవి నేర్పితే తల్లిదండ్రులు తమ పిల్లలు వైరాగ్యం లోకి వెళ్లిపోతారని భావిస్తున్నారని అన్నారు. పోటీ చదువులో కాకుండా వ్యక్తిత్వ నిర్మాణంలో ఉండాలని దీనికి నిజాయితీ, త్యాగ, ప్రేమను నేర్పే విద్యాలయాలలో తమ పిల్లలను చేర్పాలని కోరారు. సమాజం లో ఏ వృత్తి తక్కువ కాదని వివిధ వృత్తి నైపుణ్యాలు పిల్లలకు నేర్పాలన్నారు. కృతిమ మేధ పెరుగుతున్న తరుణంలో ఐ. టీ రంగంలో ఉద్యోగ భద్రత అనుమానమేనన్నారు. విదేశాల్లో పని సంస్కృతికి గౌరవం వుందని మనదేశం ఇంకా ఆ స్థితి రాలేదని అన్నారు. ప్రిన్సిపాల్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యావిధానం తాము ఆచరిస్తున్నామని తెలిపారు. ప్రభాకరరావు దేశభక్తి గీతాలు ఆలపించారు. ఉచ్చారణ పోటీలలో విజేతలకు బహుమతుల ను అంద జేశారు.

త్వరలో భూసామర్థ్య పరీక్షలు

● ఫలక్‌నుమా స్టేషన్ వైపు నుంచి టెస్టింగ్ ప్రక్రియా- సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పాతబస్తీ మెట్రో పనులు వేగిరం..

● ఓల్డ్‌సిటీలో మెట్రో అలైన్‌మెంట్, ప్రభావిత ఆస్తులపై డ్రోన్ సర్వే పూర్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

పాతబస్తీ మెట్రో సంబంధించిన చిక్కుముడులు ఒక్కొక్కటి తొలగిపోతున్నాయి. దాదాపు అయిదారేండ్లుగా ఓల్డ్‌సిటీకి మెట్రో రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజల కళ త్వరలోనే నెరవేరనుంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు హెచ్ఎంఆర్ఎల్ అధికారులు పాతబస్తీ మెట్రో పనులను వేగిరం చేశారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ఉన్న 5.5కి.మీ మార్గాన్ని పూర్తి చేసేందుకు మెట్రో అధికారులు సిద్ధమవుతున్నారు. రానున్న కొద్ది రోజుల్లో భూసామర్థ్య పరీక్షలు నిర్వహించడానికి రెడీ అవుతున్నారు. పలు నిర్మాణ సంస్థల నుంచి ఇప్పటికే టెండర్లు ఆహ్వానించారు. మరోవైపు ఈ మెట్రో మార్గంలో ఆస్తుల సేకరణకు సంబంధించిన సర్వే కొనసాగిస్తున్నారు. తాజాగా డ్రోన్ సర్వేను కూడా చేపట్టారు.

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పాతబస్తీ మెట్రో పనులు వేగవంతంపై దృష్టిసారించింది. ఇప్పటికే పలు సందర్భాల్లో వివిధ రాజకీయ పార్టీలు పాతబస్తీ మెట్రో పనుల ఆలస్యంపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తూ.. వచ్చాయి. ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ఈ అంశంలో ప్రతిపక్షాలకు ఛాన్స్ ఇవ్వకూడదని సర్కారు భావిస్తోంది. అందులో భాగంగానే మొదటిదశలోని ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మిగిలిన 5.5కి.మీటర్ల మార్గాన్ని పూర్తిచేయడానికి కావాల్సిన అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ హెచ్ఎంఆర్ఎల్ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాతబస్తీ మార్గంలో భూసామర్థ్య పరీక్షలు నిర్వహించేందుకు మెట్రో అధికారులు ఇప్పటికే టెండర్లు సైతం పిలిచా రు. ఈ టెండర్ ప్రక్రియ ముగిసిన వెంటనే.. వారం పదిరోజుల్లో భూసామర్థ్య పరీక్షలు నిర్వహించి నిర్మాణ పనులు చేపట్టాలని చూస్తున్నారు. అయితే ఈ పరీక్షల సందర్భంగా ఎలివేటెడ్ కారిడార్, పిల్లర్లు, వయాడక్ట్‌లు, స్టేషన్ల నిర్మాణంలో ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా జాగ్రత్త తీసుకోవడంతో పాటు భూమిలో పల ఖనిజాలు, లోహాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందంతో పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. అయితే భూసామర్థ్య పరీక్షలు ఫలక్‌నుమా మెట్రో స్టేషన్ వైపు నుంచి ప్రారంభించనున్నారు. ఫలక్‌నుమా మీదుగా షంషీర్‌గంజ్, శాలిబండ, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం వరకు పరీక్షలు నిర్వహించను న్నారు. ఈ మెట్రో మార్గంలో సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్(మెట్రో స్టేషన్‌లు ఈ రెండు చారిత్రక కట్టడాలకు 500



మీటర్ల దూరంలో ఉంటాయి), శాలిబండ, ఫలక్‌నుమా స్టేషన్లు ఉండనున్నాయి.

ఒకవైపు భూసేకరణ..మరోవైపు డ్రోన్ సర్వే..

మొదటి దశ మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా కారిడార్-2లోని జేబీఎస్- ఫలక్‌నుమా వరకు 16కి.మీ వరకు పనులు చేపట్టాలని మెట్రో రైల్ నిర్ణయించినా మతపరమైన కట్టడాలు, వివిధ కారణాలతో ఈ రూట్లో పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రస్తుతం 5.5కి.మీటర్ల మేర పాతబస్తీ మార్గంలో ముందస్తు పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సేకరించాల్సిన ఆస్తుల సర్వే ఒకవైపు కొనసాగుతుండగా.. మరోవైపు తాజాగా డ్రోన్ సర్వే నిర్వహించారు. 5.5 కి.మీటర్ల మెట్రోరైలు మార్గంలో 21 మసీదులు, 12 దేవాలయాలు, 12 అషూర్ఖానాలు, 33 దర్గాలు, 7 స్మశానవాటికలు, 6 చిల్లాలతో సహా మొత్తం 103 మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాలు మెట్రో నిర్మాణానికి ప్రధాన సవాలుగా మారాయి. దారుల్-షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ మధ్య ఇరుకైన మార్గంలో రహదారి విస్తరణ, మెట్రో స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన ప్రభావిత ఆస్తుల కచ్చితమైన కొలతలు తీసుకోవడానికి తాజాగా నిర్వహించిన డ్రోన్ సర్వే సహాయపడనుంది. మెట్రో అలైన్‌మెంట్, పిల్లర్ లొకేషన్‌లు ఈ నిర్మాణాలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం పడకుండా మెట్రో అధికారులు ప్లాన్ చేస్తున్నారు. డ్రోన్ సర్వే ద్వారా రియల్ టైమ్ డేటా, 3డీ మోడలింగ్, జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) డేటా, క్యాడ్ సాఫ్ట్‌వేర్ ఏకీకరణ, డేటా విశ్లేషణ విజువలైజేషన్‌ను త్వరితగతిన సేకరించవచ్చని అధికారులు చెబుతు న్నారు. అంతేగాక మతపరమైన, సున్నితమైన నిర్మాణాలను కాపాడేందుకు, రోడ్డు విస్తరణ 80 అడుగులకు.. స్టేషన్ స్థానాల్లో మాత్రం రహదారిని 120 అడుగులకు విస్తరించనున్నారు. మొత్తంగా టెండర్ ప్రక్రియ పూర్తయి.. కంపెనీల ఎంపిక అనంతరం వారం పదిరోజుల్లో భూసామర్థ్య పరీక్షలను మెట్రో అధికారులు ప్రారంభించనున్నారు. మొదటి దశ మెట్రో ప్రాజెక్టులో భాగంగా మూడు కారిడార్లు కలిపి 69.2కి.మీటర్లు మేర మెట్రో రైలు అందుబాటులోకి రాగా.. ప్రస్తుతం

బీఆర్ఎస్ పథకాలకు యువత ఆకర్షితులవుతున్నారు



నవతెలంగాణ - ముషీరాబాద్

బీఆర్ఎస్ సంక్షేమ పథకాలకు అభివృద్ధికి యువత పెద్ద ఎత్తున ఆకర్షితుల వుతూ బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ముషీరాబ ద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నియోజకవర్గంలోని ముషీరాబాద్ డివిజన్ లో బీజేపీ పార్టీ నుంచి నాగ సుందీంద్ర, శ్రావణ్ కుమార్ రెడ్డి, సామ్యూల్, బిక్షపతి, సిద్దేశ్వర్, ప్రవీణ్, నాగరాజు, అశోక్ తదితర నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.వారిని పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ. నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కనుమరుగవుతున్నాయన్నారు.బిఆర్ఎస్ రాష్ట్ర సంక్షేమ పథకాలకు యువత పెద్ద ఎత్తున ఆకర్షితులవుతున్నారు ముషీరాబా ద్‌లో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి చూసి ఎంతోమంది నాయకులు సామాన్య ప్రజలు బిఆర్ఎస్ పార్టీలోకి వస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తలే పార్టీకి కొండంత బలం అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జై సింహ, లక్ష్మీ గణపతి దేవాలయం చైర్మన్ మచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ ప్రెసిడెంట్ నర్సింగ్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా శ్రీధర్, జనరల్ సెక్రెటరీ ఆకుల అరుణ్, నాయకులు ఎయిర్టెల్ రాజు, శివ ముదిరాజ్, ప్రవీణ్, అస్లాం పాల్గొన్నారు.

నవతెలంగాణ
హైదరాబాద్
సోమవారం । 28 ఆగస్టు । 2023

నా పేరుని పరిశీలించండి బీఆర్ఎస్ అధిష్టానానికి

● సీనియర్ నాయకులు మురళి కృష్ణ విజ్ఞప్తి



నవతెలంగాణ-అంబర్‌పేట
అంబర్‌పేట నియోజకవర్గానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా నా పేరును పరిశీలించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కే.మురళీకృష్ణ సీఎం కేసీఆర్ మంత్రి కేటీఆర్‌కి విజ్ఞప్తి చేశారు. ఆదివారం రత్న నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ అంబర్ పేట అభ్యర్థిపై పునరాలోచించాలని ఈ సందర్భంగా వారికి విజ్ఞప్తి చేశారు.

హాస్టల్ వర్కర్స్‌కు విద్యార్థుల సత్కారం



నవతెలంగాణ-ఓయూ
న్యూ సరయు హాస్టల్ విద్యార్థులు హాస్టల్ వర్కర్స్ ఆదివారం ఉదయం విద్యార్థుల ఆధ్వర్యంలో సన్మానం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసి తమకు సేవలు అందించి నందుకు గాను వారిని సన్మానం చేస్తున్నట్లు విద్యార్థులు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, హాస్టల్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాలకు వెళ్ళే విద్యార్థులకు..
గుర్తింపు లేని సంస్థలతో ఇబ్బందులే..



నవతెలంగాణ-బంజారాహిల్స్
విదేశాల్లో విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులు కొన్ని గుర్తింపు లేని సంస్థల ద్వారా విదేశాలకు వెళ్ళి అక్కడ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్లోబల్ ట్రీ సంస్థ ఫౌండర్ శుభకర్ ఆలపాటి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని హయత్‌ప్లేస్ హెటల్‌లో యూఎస్, కెనడాదేశాలకు సంబంధించిన 50కిపైగా ప్రసిద్ధి చెందిన యూనివర్సిటీల ప్రతినిధులతో ఎడ్యుకేషన్ ఫెయిర్‌ను నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రతి మధ్య తరగతి కుటుంబం తమ పిల్లలను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపించాలని కోరుకుంటున్నారని, అలాంటి వారు ముందు అన్ని ఆయా దేశాలు, యూనివర్సిటీలకు చెందిన అన్ని వివరాలు తెలుసుకొని, అవగాహన చేసుకొని సరైన సంస్థల ద్వారానే విదేశాలకు వెళ్ళాలని సూచించారు. చాలా మంది విద్యార్థులు ప్రాపర్ డాక్యుమెంటేషన్ లేకుండా వెళ్ళి అక్కడ అధికారుల విచారణ తర్వాత మళ్ళీ వెనక్కి వస్తున్నారని ఇది అత్యంత బాధాకరమని అన్నారు. విద్యార్థుల చదువుల కోసం బ్యాంకులు ఎడ్యుకేషన్ రుణాలు ఇస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. యూఎస్, కెనడాలకు చెందిన పార్డ్‌నార్త్‌వెస్ట్ యూనివర్సిటీ, లాస్‌వెగాస్ యూనివర్సిటీ, నార్త్‌వెస్ట్ మెసోరి, యూనివర్సిటీ ఆఫ్ కెనడా వంటి ప్రసిద్ధి యూనివర్సిటీల ప్రతినిధులు ఫెయిర్‌కు హాజరైన విద్యార్థులకు ఆయా యూనివర్సిటీలు అందించే కోర్సులు, సబ్సిడీలు ఇతర వివరాలను తెలియజేశారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

'డబుల్' ఇండ్లపై అఖిలపక్ష సమావేశం

● బీజేపీ, ఎంఐఎం నాయకుల గైర్హాజరు
● బీఆర్ఎస్ నాయకులపై స్థానికుల మండిపాటు
● వాగ్వివాదంతో ముగిసిన సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో
నాంపల్లి నియోజకవర్గంలోని గుడిమల్కాపూర్ డివిజన్ బోజగుట్టలో డబుల్‌బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలపై ఆదివారం మూడు బస్తీలకి చెందిన స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. బోజగుట్టలోని శ్రీరామ్‌నగర్, శివాజీ నగర్, వివేకానందనగర్‌లో 10వేల మంది బస్తీ వాసులు 40 ఏండ్లుగా నివాసం ఉంటున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక మూడు బస్తీల ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని నాయకులు హామీనిచ్చారు. 2017 ఎస్ఈఎస్ సర్వే ప్రకారం 13.6 ఎకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి 1,824 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించాలని కాంట్రాక్టర్లకు పనులను అప్పజెప్పింది. అదే ఏడాది ప్రభుత్వం హడావిడిగా అక్కడ ఉన్న గుడిసెలను తొలగించి 570 కుటుంబాలను ఖాళీ చేయించి 240 ఇండ్ల పనులను చేపట్టారు. కొన్ని కారణాల వల్ల పనులను మధ్యలోనే ఆపేసి ఆరేండ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి చేయలేదని బస్తీ వాసులు తెలిపారు. ఈ అఖిలపక్ష సమావేశానికి బీఆర్ఎస్ నుంచి బంగారు ప్రకాష్, జీవన్ సింగ్, ఆనంద్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నుంచి ఫిరోజ్‌ఖాన్, వేణుగోపాల్, బీఎస్పీ నుంచి చిరంజీవి, అంజయ్య, సీపీఐ(ఎం) నుంచి వెంకటేష్, మల్లేష్ హాజరు కాగా, ఎంఐఎం, బీజేపీ నాయకులు మాత్రం గైర్హాజరయ్యారు.

రసాభాసగా సమావేశం : అఖిలపక్ష సమావేశం మొదలైన ప్పటి నుంచి రసాభాసగా కొనసాగింది. పలువురు రాజకీయ నాయకులు మాట్లాడారు. మొదటి నుంచి బస్తీవాసులు బీఆర్ఎస్ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 200 మంది తమకు పట్టాలు కావాలిని కోర్టును ఆశ్రయించారు. మిగిలినవారు ఇండ్లను నిర్మించాలని మొదటి నుంచి పట్టు పట్టారు. కాగా చివరి క్షణంలో బంగారు ప్రకాష్ బస్తీవాసులు మీరు మీరు తేల్చుకోండి 200 మందిని కొట్టి తరిమేయండి అంటూ మాట్లాడిన మాటలకు ఒక్కసారిగా బస్తీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను కొట్లాడుకుని చావమంటారా..? పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగమంటారా..? అలాంటప్పుడు మీ ప్రభుత్వం ఎందుకు ఉంది..? మిమ్మల్ని ఎవరు అడిగారు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టివ్వమని అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే వచ్చి ఇండ్లు కట్టిస్తామని హామీనిచ్చినట్టు స్థానిక మహిళలతోపాటు మండిపడ్డారు. దీంతో కొద్దిసేపు బీఆర్ఎస్ నాయకులు బంగారు ప్రకాష్, జీవన్‌సింగ్, బస్తీవాసుల మధ్య మాటలు యుద్ధం కొనసాగింది. దీంతో బంగారి ప్రకాష్ మధ్యలోనే సమావేశాన్ని నిలిపివేసి వెళ్ళిపోయాడు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఇండ్లు కేటాయిస్తాం : ఫిరోజ్‌ఖాన్

వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఆ తర్వాత అర్హులందరికీ ఇండ్లు, రూ.6 లక్షలు కేటాయిస్తామని కాంగ్రెస్ నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఫిరోజ్ ఖాన్ స్థానికులకు హామీనిచ్చారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయన్నారు. లక్ష ఇండ్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం కేవలం 10వేల మందికి మాత్రమే ఇండ్లు ఇచ్చారన్నారు. నెల రోజుల్లో ప్రభుత్వం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకో నాలుగు నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పటి వరకు ఓపిక పట్టాలని స్థానికులను కోరారు.

అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తాం

● మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్
పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ దశల వారీగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఆదివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివాసం వద్ద ఇటీవల ఎంపికైన 500 మంది డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. పేద ప్రజలకు అనువుగా ఉండే రోడ్లు, డ్రయినేజీ, విద్యుత్, త్రాగునీరు వంటి అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి లబ్ధిదారులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులపై ఒక్క పైసా ఖర్చు లేకుండా ఒక్కో ఇంటిని 9.50 లక్షల వ్యయంతో ప్రభుత్వమే నిర్మించి ఉచితంగా ఇస్తున్నట్లు వివరించారు. జీహెచ్ఎంసీ రిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి దశల వారిగా ఇచ్చే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇండ్లు రాలేదని ఎవరు అధైర్య పడవద్దని, దశల వారిగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ లు కొలన్ లక్ష్మి, టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు నామన శేషు కుమారి, అత్తిలి అరుణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ఉచిత ప్రమాద బీమా కార్డుల పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్
కంటోన్మెంట్ నియోజకవర్గంలోని శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఫౌండేషన్ చైర్మన్ శ్రీగణేష ఆటోడ్రైవర్లకు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ద్వారా ఉచితంగా రూ3లక్షల ఇన్సూరెన్స్ చేయించారు. ఈ మేరకు లియో ప్యాలెస్ లో సమావేశం నిర్వహించి ఆటోడ్రైవర్లకు ఇన్సూరెన్స్ బాండ్ పేపర్ అందజేశారు. అనంతరం శ్రీ గణేష్ మాట్లాడుతూ 24 గంటల పాటు ఆటోలు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న ఆటో డ్రైవర్ల కష్టాలు తనకు తెలుసునని, వారికి చేయూత నిచ్చేందుకు తన వంతుగా బీమా సదుపాయం కల్పించామన్నారు. తమ, శ్రీ గణేష్ ఫౌండేషన్ తరపున విద్య, వైద్య సేవలతో పాటు వివిధ రంగాల్లో ఉన్న సంఘటిత అసంఘటిత కార్మికులు. ఆటో.కార్ డ్రైవర్లకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఖ్ విలేజి, అన్నానగర్, రసూల్‌పుర, హాకీ గ్రౌండ్, గణేష్ టెంపుల్ అడ్డా, తిరుమలగిరి లాల్ బాజార్ అడ్డా బాపూజీనగర్ డైమండ్ పాయింట్, స్వామి నారాయణ్ మందిర్, బాలం రాయి, లోతుకుంట ఆటో స్టాండ్లకు చెందిన ఆటో యూనియన్ ప్రతినిధులు డ్రైవర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో బన్సీలాల్‌పేట డివిజన్లో 'దళిత గర్జన'



నవతెలంగాణ-బేగంపేట్
రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. దళితులను మోసం చేసిన స్థానిక మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను అన్ని విధాలుగా మోసం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బన్సీలాల్ పేట డివిజన్లో 'దళిత గర్జన' పేరుతో డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో పాదయాత్రను ఆదివారం నిర్వహించారు. బన్సిలాల్ పెట్టలోని సీసీ కాలనీ, సీసీ కాలనీ ఏ, బీ, సీ, డీ బస్తీల నుండి నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయం వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ దళిత స్కాలర్షిప్ పేరుతో ఇద్దరు దళిత విద్యార్థులకుపై చదువులు చదువుకునేందుకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సహాయం అం దజేశారు. ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ.. చేవెళ్ల సభలో దళిత, గిరిజనులకు ఇచ్చిన ప్రతి హామీని కచ్చితంగా అమలు చేసి తీరుతామని ప్రకటించారు. దళిత రిజర్వేషన్ పెంపు, కార్పొరేషన్ ఏర్పాటు, అంబేద్కర్ అభయహస్తి వంటి అనేక హామీలు ఉన్నాయని గుర్తు చేశారు. డివిజన్ లోని అనేకమంది అర్హులకు కనీసం రేషన్ కార్డు, పింఛను కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు మాట్లాడుతూ.. తమ స్థలం తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి తమకు ఇవ్వడం లేదన్నారు. తమ ప్రాంతంలో డ్రయినేజీ సమస్య అధికంగాఉందని , సరిగా మంచినీరు రావడంలేదని, అర్హులకు పింఛను ఇవ్వడంలేదని, పథకాల అమలులో అర్హులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ విజయానికి యువత కృషి చేయాలి



● అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్
● జోష్‌లో బీఆర్ఎస్.. పార్టీలోకి చేరికలు

నవతెలంగాణ-అంబర్‌పేట
నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పలువురు నాయకులు, యువత బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యేగా కార్యాలయంలో అంబర్‌పేట డివిజన్ చెందిన వివిధ పార్టీల నాయకులు, యాదవ్ బృందం నాయకులు ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, సిద్ధార్థ ముదిరాజ్, కాలేరుభరత్ ఆధ్వర్యంలో 300 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి సాధారణంగా సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నిరుపేదల కోసం అనేక పథకాలను అమలు చేసి అర్హులైన వారికి అందించారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిజాల గేలవయ్య, సంతోష్, శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

ఏసీపీ రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపిన వృద్ధురాలు

● ఏసీపీ పట్టుకొని ఏడ్చిన వృద్ధురాలు
● ఆశ్చర్యపోయిన కానిస్టేబుళ్లు స్థానికులు



నవతెలంగాణ-బేగంపేట్
ఓ మహిళ వేగంగా సికింద్రాబాద్ ఆర్పీ రోడ్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బందోబస్త్ విధుల్లో ఉన్న మహంకాళి ఏసీపీ రవీందర్‌ను కలవటానికి కదులుతున్న ఆర్టీసీ బస్సులో నుంచి దూకింది. ఏసీపీ రవీందర్‌కు వృద్ధురాలు దండం పెట్టింది. చుట్టు పక్కన స్థానికులు ఆశ్చర్యపోయారు. ప్రస్తుతం మహంకాళి ఏసీపీగా ఉన్న రవీందర్ 2014 సంవత్సరంలో టప్పాచ భుత్ర ఇన్స్‌పెక్టర్‌గా ఉన్నప్పుడు కార్వాన్‌కు చెందిన కవిత అనే మహిళా రోడ్డుపై అనారోగ్యంతో బాధపడుతుంటే తన సొంత డబ్బులతో అస్పత్రిలో చేర్పించి ఆపరేషన్ చేయించారు. బస్సులో వెళ్తున్న ఆమె ఏసీపీని గుర్తుపట్టి బస్సుమధ్యలో దిగి ఆయనను కలిశారు. అన్న నీకోసం వెండి రాఖీని తెచ్చాను వచ్చి కడుతానని ఆనందం వ్యక్తం చేసింది. ఆ మహిళా ఫోన్‌లో ఉన్న ఏసీపీ ఫోటో చూసి ఆమె కృతజ్ఞతకు ఏసీపీతో పాటు అందరు ఆశ్చర్య పోయారు.

ఓటు హక్కు నమోదు తప్పనిసరి

● అడిషనల్ కమిషనర్ శంకరయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట:
అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అడిషనల్ కమిషనర్ శంకరయ్య అన్నారు. ఆదివారం ఓటు హక్కు నమోదు భాగంగా డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్‌తో కలిసి పోలింగ్ బూత్లను సంద ర్శించి ప్రతి ఒక్కరికి ఓటర్లు నమోదు చేసుకున్న ఆకాశం ఉందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తప్పు ఒప్పులుంటే సరి చేసుకోవాలని వారు అన్నారు. ప్రజాస్వా మ్యంలో ప్రజా ఆయుధం ఓటు కీలకమని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు శివ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదుపై స్పెషల్ డ్రైవ్



నవతెలంగాణ -సుల్తాన్ బజార్
ఎన్నికల కమిషన్ ఓటర్ నమోదును గోషామహల్ నియోజకవర్గం గన్ ఫౌండ్రి డివిజన్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ వద్ద ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్ ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ సర్కిల్ – 14 బీఎల్ ఓ లు బీసీ నవీన్ కుమార్. ఆర్ పి రాజేశ్వరి కొత్త ఓటర్ నమోదుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పత్రాలను అందించారు

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్
వైద్య రంగంలో రోజు రోజుకు వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా వైద్యులు అందుకు అడుగులు వేస్తున్నారని జెమ్ కేర్ గ్రూప్స్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రవిపాటి, కామినేని డైరెక్టర్ డాక్టర్ ఆదిత్య, కామినేని మెడికల్ కాలేజ్ హెచ్ఓడీ డాక్టర్ సాయిలు అన్నారు. కామినేని, జెమ్ కేర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 'ఐసీయూలో అత్యవసర సమయంలో రోగి ప్రాణాలను ఎలా కాపాడాలి' అనే అంశంపై యువ వైద్యులకు వర్క్ షాప్ నిర్వహించారు. నగరంలోని వివిధ హాస్పిటల్స్ కు చెందిన వంద మంది వైద్యులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఐసీయూలో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న సీనియర్ వైద్యులతో నిర్వహించిన ఈ వర్క్ షాప్ లో యువ వైద్యులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ రాకేష్, డాక్టర్ సాయి, గురుప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా గద్దర్ సంస్మరణ సభ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్
కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి, ఇండియా సంయుక్త రాష్ట్రాల ఆధ్వర్యంలో హనుమాన్ టెక్డిలోని బీసీ సాధికారత భవన్‌లో ఆదివారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆ సభకు అఖిల భారత కన్వీనర్ బండారు లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్లుప్రొ.కే.వై.రత్నం, ప్రొ.కే.లక్ష్మీనారాయణ, ప్రొ"ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ ప్రభంజన్ యాదవ్ సీనియర్ జర్నలిస్ట్ ఇంద్రవెల్లి రమేష్ సావిత్రి బాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు సరోజన, ప్రముఖులు, వక్తలు, నాయకులు హాజరై ప్రసంగించారు. ప్రొ ప్రభంజన్ యాదవ్ మాట్లాడుతూ.. గద్దర్ ఒక యుగకర్త అని ఆయన కళ్లెంలో సిరాని కాదు కసిని నింపుకున్నాడన్నారు. రత్నం మాట్లాడుతూ గద్దర్‌ను కారంచేడులో విప్లవ వీరుడుగా గుండెకు హత్తుకున్నాడు అన్నారు. ఈ దేశంలో వర్గంతో పాటు కులాన్ని కూడా పట్టించుకుని కులవర్గ పోరాటాలను ముందుకు తీసుకపోయినప్పుడే విప్లవం విజయవంతం అవుతుందన్నారు. ప్రొ" లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడారు.

ఓటుహక్కు నమోదు తప్పనిసరి డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ
స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సికింద్రాబాద్ నియోజకవర్గ, తార్నాక డివిజన్‌లోని సెంట్ ఆన్స్ హై స్కూల్ డేవిడ్ మెమో రియల్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన ఓటర్ల జాబితాల పరిశీలన, పేర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ ను గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు శ్రీ మోతె శోభన్ రెడ్డి తో కలిసి తనిఖీ చేశారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ, వారి పేర్లు నమోదు చేసుకోవాలని మరియు ఏమైనా తప్పులు ఉన్న అక్కడికక్కడే బిఎల్ఓలు పరిష్కరిస్తారని, అలాగే పూర్తి వివరాలకు ఇతర సందేహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1950 కు సంప్రదించాలని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశానికి సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సంఘం అధికారులు బూత్ లెవెల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

నాలాబజార్‌లో నాలా నిర్మాణ పనుల పరిశీలన



● మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్
ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మోండా మార్కెట్ డివిజన్ పరిధిలోని నాలాబజార్‌లో 60 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన నాలా నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను మరింత త్వరితగతిన పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శిథిలావస్థకు చేరి నీటి ప్రవాహం సక్రమంగా వెళ్ళకపోవడంతో స్థానిక నాలా పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దూరం చేయాలనే ఆలోచనతో నూతన నాల నిర్మాణ పనులను సుమారు రెండు నెలల క్రితం చేపట్టడం జరిగిందని, గతంలో ఉన్న దానికంటే వెడల్పుగా నూతన నాలా ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. స్థానికులు చేసిన విజ్ఞప్తి నూతనంగా నిర్మించే నాలా పై స్లాబ్ వేయడం ద్వారా సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మంత్రి వెంట జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, మోండా మార్కెట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, నాగులు, రాములు తదితరులు ఉన్నారు.

వేగంగా వృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ

● జీవన్‌లాల్ లవిడియా



నవతెలంగాణ-బంజారాహిల్స్
పన్నులు సకాలంలో చెల్లిస్తే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుందని, ఇందుకు జీఎస్టీ కూడా మంచి అవకాశమని ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లవిడియా అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డెక్కన్ హెూటల్లో బిజినెస్ మింట్‌లో 50వ జాతీయ అవార్డుల వేడుకను పురస్కరించుకొని బిజినెస్ మింట్ అవార్డులనూ 72 మంది వ్యక్తులకు అవార్డులను అందజే శారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎంపీ కృష్ణయ్య, ఏసీపీ వి.ప్రదీప్ కుమార్‌రెడ్డి, జెఎన్టీయు హైదరాబాద్ వైస్ ఛాన్సలర్ కె. నరసింహారెడ్డి, విహబ్ సీఈఓ ఆర్.దీప్తి, లీడ్‌ఇండియా ఫౌండేషన్ చైర్మెన్ డా. హరి ఎప్పనపల్లి, భారతీయ చలనచిత్ర సంగీత దర్శకుడు అనుప్ రూబెన్స్ హజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపీ కృష్ణయ్య మాట్లాడుతూ సామాజిక, నైతిక, మానవీయ విలువల పునాదులై నిర్మించబడిన భారతదేశం ప్రపంచ దేశాలకు మార్గదర్శంగా నిలుస్తోందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. యువ మేథావులు తమ మేథాశక్తితో భారతదేశాని శాస్త్ర,సాంకేతిక, విద్య, వైద్య రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఐఆర్ఎస్ అధికారి జీవన్‌లాల్ లావిడియా మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోందని, ప్రస్తుతం 3.2ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్, టెస్లా వంటి కొన్ని బహుళజాతి కంపెనీలను ఉదాహ రణగా చెప్పారు. పన్నులు వెంటనే చెల్లిస్తే, భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్నారు. బిజినెస్ మింట్ వ్యవస్థాపకుడు వినయ్ కాంత్ కొరపాటి మాట్లాడుతూ 50వ అవార్డు వేడుక తనకు, తన సంస్థకు ఒక ముఖ్యమైన మైలు రాయిగా ఒక ప్రత్యేక స్థానాన్ని పొందిందన్నారు.సంస్థ సాధించిన విజయాలను, వివిధ డొమైన్‌లలో కార్పొరేషన్‌లు, సంస్థల సహకా రాన్ని గుర్తించడంలో దేశవ్యాప్తంగా దాని ఉనికిని చాటుకుందని తెలిపారు. ఎస్‌కే కేటరింగ్‌కి చెందిన యూ సుఫ్ ఉస్తాద్,కిమ్స్ హాస్పిటల్‌లో వెన్నెముక శస్త్రచికిత్స వైద్యుడు మురహర్ పెంకులింటి, ఓన్ గోల్ఫ్, ఈస్ట్-వెస్ట్ సీడ్ ఇండియా,కసా డైరెక్టర్లు వర్షిత్ వీసంశెట్టి, వినీత్ వీసంశెట్టితో సహా 72 మందితో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను విస్మరిస్తున్నారు

● తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం
● తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్



నవతెలంగాణ-ముషీరాబాద్
ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు నిర్వహి ంచారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1200కు పైగా ఆత్మ బలిదానాలు చేసుకున్నారని ఎంతో మంది ఉద్యమకారులు తమ సర్వస్వాన్ని కోల్పోయారని, ఉద్యమాలతో సాధిం చుకున్న రాష్ట్రంలో గత పది సంవత్సరాలలో తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. రాష్ట్రం కోసం త్యాగం చేసిన ఉద్యమకారులు ఆత్మగౌరవం లేకుండా అవకాశాలు లేకుండా తమ కుటుంబాలు గడవడం కూడా కష్టంగా జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి ఉద్యమకారులను ఆదుకోవాలని ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ ఐలయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డి , ఉపాధ్యక్షులు పరిధుల శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి సురేందర్, కన్వీనర్ జంగా సుదర్శన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్, కోకన్వీనర్ ,సంపత్ ,నరేందర్ గౌడ్, తదితరు నాయకులు పాల్గొన్నారు

రాజ్యాంగం కల్పించిన హక్కులు మన బలానికి మూలాలు



● ఇంజి వెంకట్ జాదవ్

నవతెలంగాణ-ముషీరాబాద్
రాజ్యాంగం కల్పించిన హక్కులు మన బలానికి మూలాలని బామ్ సేఫ్ రాష్ట్రీయ మూల నివాసి సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఇంజి వెంకట్, జాదవ్అన్నారు. బామ్ సేఫ్, రాష్ట్రీయ మూల నివాసి సాంఘ్ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం పదవ తెలంగాణ రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జాతీయ ఉపాధ్యక్షులు వెంకట్, దళిత సేన జెబి రాజు, మురళి మనోహర్ రావు, డాక్టర్ కుమార్, బట్టి చెన్నయ్య హాజరై మాట్లాడుతూ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఉపయోగించిన పేపర్ ట్రెల్ మిషన్‌లలో పడిన పేపర్ ఓట్లను ఎన్నికల కమిషన్ నాలుగు నెలలులోపు ఎందుకు ధ్వంసం చేసిందన్నారు. జనాదరణ కోల్పోతున్న 3.5శాతం జనాభా ఉన్న బ్రాహ్మణుల జాతీయ పార్టీలను పునస్థాపితం చేయడంలో ఈవీఎంల పాత్ర ఉందని, ఎన్నికల కమిషన్ ద్వారా ప్రజాస్వామ్యం నాశనం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఓబీసీలు హిందువులు అయితే ఓబీసీల కులాధారత జనగణన జరపడానికి బ్రాహ్మణులు ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ ముస్లిం మోర్చా జాతీయ అధ్యక్షులు సయ్యద్ మక్సూద్ అహ్మద్, దళిత సేన నేషనల్ చైర్మన్ జేబీ రాజు, ఎమ్మార్పీఎస్ ఎంపీఎస్ జాతీయ అధ్యక్షులు బి ఎస్ రమేష్, ఐ ఎల్ పి ఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు విజయ దేవరాజ్ గౌడ్, ఎస్ టి పి ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొంగు ప్రసాద్ , తదితర నాయకులు పాల్గొన్నారు.



అమ్మతో అనుబంధం.. బిడ్డతో అనురాగం...

తల్లులు కూతుళ్ళకి ఎన్నో సలహాలు ఇస్తుంటారు. ఇవి వారి మంచి కోసమే. అయితే కొన్ని సలహాలు పాటించడం ఈజీ అయితే, మరి కొన్ని కష్టంగా ఉంటాయి. అయితే తల్లులు ఇచ్చే సలహాలు అనుభవాల ఆధారంగా ఉంటాయి. వాటిని పాటిస్తే జీవితంలో చాలా సమస్యల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. కానీ కొంతమంది వాటిని పాటిస్తే కొంతమంది పాటించరు. అయితే తల్లులు కూడా పిల్లల పెంపకం విషయంలో కచ్చితంగా కొన్ని పాటించాలి. అవేంటో తెలుసుకుందాం...

చాలా మంది తల్లులు పిల్లలతో సమయం గడపరు. ఇది సరైనది కాదు. పిల్లలతో కూర్చొని వాళ్ళతో కాస్త టైమ్ స్పెండ్ చేయాలి. కథలు చెప్పడం లాంటివి చేస్తుండాలి. దీంతో వారితో మీకు అనుబంధం పెరుగుతుంది. వారు ఏమనుకుంటున్నారో, వారి మనసులో ఏముందో ఇలాంటి విషయాలన్నీ మీతో చెప్పుకుంటారు. ఇది తల్లీ, కూతుళ్ళ మధ్య బంధాన్ని పెంచుతుంది. ఇదే జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకునేలా పిల్లల్ని బలంగా చేస్తుంది.



విశ్వాసం అవసరం

తల్లులకి పిల్లలపై నమ్మకం ఉంటుంది. అదే విధంగా పిల్లలకు తల్లులపై కొంత నమ్మకం ఉంటుంది. అలాంటి నమ్మకం లేకపోతే ఒకరితో ఒకరు ప్రేమగా, ఆప్యాయంగా ఉండలేరు. అందువల్ల తల్లులు వారి మాటలు వినాలి. వారు ఏం చెబుతున్నారో అర్థం చేసుకోవాలి. దానికి తగిన విధంగా స్పందించాలి. దీని వల్ల ఇద్దరి మధ్య బంధం పెరుగుతుంది. అప్పుడు పిల్లలు కూడా తల్లులు చెప్పే మాటలు వింటారు.



ఇలా చేయొద్దు..

కొంతమంది తల్లులు తాము చెప్పిందే సరైందని వాదిస్తారు. పిల్లలు చెప్పింది అస్సలు వినరు. అదే విధంగా, వాళ్ళేం చేసినా తప్పు అని ఒక్క మాటలో కొట్టి పడేస్తుంటారు. ఇది పిల్లల్ని అవమానించినట్లుగా, పట్టించుకోనట్లుగా అనుకుంటారు. ఇలా జరగకుండా ఉండాలంటే వారు చెప్పింది కూడా వినాలి. ఇలా చేస్తే అమ్మ తమని అర్థం చేసుకుంటున్నారని అనుకోవడమే కాకుండా వారిద్దరి మధ్య మంచి బంధం ఉంటుంది.

వయసు తేడా..

ఎలాగూ తల్లులు, పిల్లల మధ్య తేడా ఉంటుంది. దీని కారణంగా తల్లులు పిల్లల్లా ఆలోచించలేరు. చాలా మంది తల్లులు వారి తరంలో ఎలా పెరిగారో అలానే ఆ మనస్తత్వంతోనే ఆలోచిస్తుంటారు. పిల్లల్ని ఈ విధంగానే ఉంచడం, వారి చుట్టూ ఉన్న మార్పులని అర్థం చేసుకోకపోవడం వల్ల పిల్లలు వారి తల్లులకి దూరం కావొచ్చు. ముఖ్యంగా పెండ్లి విషయంలో కూతుళ్ళు, తల్లులకి భిన్నమైన ఆలోచనలు ఉంటాయి. అందువల్ల తల్లులు తమ పిల్లల విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. కొన్ని మార్పులు చేసుకోవాలి. అప్పుడే ఇద్దరి మధ్య అనుబంధం పెరుగుతుంది.

మొక్కలకు సహజ ఎరువులు

వర్షాకాలం అంటేనే మొక్కలు పెంచే కాలం. ఎంత వర్షాకాలమైన మొక్కలు సరిగ్గా పెరగాలంటే వాటికి ఎరువులు అవసరం. వాటిని ఇంట్లోనే చేసుకోవాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. అవేంటో చూద్దాం...



యాపిల్ తొక్కలతో: యాపిల్స్‌ని చాలా మంది ఇష్టంగా తింటారు. వాటిని తినేటప్పుడు కొంతమంది తొక్కని తీసిపారేస్తుంటారు. వాటిని అలా పారేసే బదులు చెట్లకి వేయాలి. మొక్కలు పెరగడానికి ఇవి చాలా సాయపడతాయి. కాబట్టి యాపిల్ తొక్కలను వేస్ట్‌గా పారేయొద్దు.

సోయా: సోయా బీన్స్‌ని చాలా మంది నానబెడుతుంటారు. ఆ నీటిని పారేస్తుంటారు. అలా కాకుండా వీటిని చెట్లకి పోయడం వల్ల చెట్లు ఏపుగా పెరుగుతాయి.



పండ్ల తొక్కలు: చాలా మంది అరటిపండ్ల తొక్కలు పారేస్తుంటారు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. వీటిని చెట్లకి వేయడం వల్ల ఎరువులా పనిచేస్తాయి.

బియ్యం కడిగిన నీరు: సాధారణంగా అందరూ ఈ నీరు కూడా పారబోస్తుంటారు. అలా కాకుండా వీటిని కూడా చెట్లకి పోయడం అలవాటు చేసుకోండి. ఈ నీరు చెట్ల మూలాలకి మంచి బలాన్ని ఇస్తాయి. వీటి వల్ల చెట్లు బలంగా పెరుగుతాయి.

గుడ్లసొన: గుడ్లు పై పొట్టు కూడా చెట్లకి చాలా మంచిది. దీనిని కూడా చెట్లకి వాడడం వల్ల చెట్లు బలంగా, ఏపుగా పెరుగతాయి. వేస్ట్‌గా పారేసే ఈ పెంకులు చెట్లకి బలమన్నిస్తాయని గుర్తుంచుకోండి.

వాడేసిన కాఫీ, టీ పొడి: ఈ పౌడర్స్‌ని కూడా చాలా మంది పనికి రావని పారేస్తుంటారు. కానీ ఈ సారి నుంచి వీటిని చెట్లకి వేయండి. వీటిలోని సారం చెట్ల వేర్లకి బలమని ఎంత మందికి తెలుసు. వీటి వల్ల చెట్లకి సహజ ఎరువుని వేసినవారు అవుతారు.

ఇలాంటి కొన్ని టిప్స్‌ని పాటించడం వల్ల ఇంట్లోనే చక్కని ఎరువులని తయారు చేసుకోవచ్చు. ఇవి మాత్రమే కాకుండా ఇంకా కొన్ని ఉన్నాయి. ఉల్లిగడ్డ పొట్టు, కూరగాయల వ్యర్థాలు, అన్నింటిని స్టోర్ చేసి వాటిని కూడా ఎరువుల్లా వాడొచ్చు. వీటితో చెట్లని పెంచుకోవచ్చు. వీటి ద్వారా కెమికల్స్ లేని సహజ ఎరువులని మీ మొక్కలకు వాడొచ్చు. వీటివల్ల ఎలాంటి నష్టం ఉండదు. చెట్లు ఏపుగా పెరగాలంటే ఇలాంటి సహజ సిద్ధమైన ఎరువులు ఎంతో ఉపయోగపడతాయి. చెట్లు ఏపుగా పెరగాలంటే వీటితో పాటు ఎప్పటికప్పుడు ఆ చెట్ల వ్యర్థాలను క్లీన్ చేయాలి. దీని వల్ల అవి చూడ్డానికి కూడా బావుంటాయి. అదే విధంగా వాటికి సరిపడా నీరు పోయాలి.

ఇవి ఒత్తిడిని తగ్గిస్తాయి



ప్రస్తుత కాలంలో చాలా మంది ఎదుర్కొంటున్న సమస్య ఒత్తిడి. ఈ ఒత్తిడి సమస్యను తగ్గించి, మంచి మానసిక ఆరోగ్యాన్ని అందించే కొన్ని ఆహార పదార్థాలను ఇప్పుడు చూద్దాం.

- విటమిన్ బి అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. చికెపీస్, ఆకుకూరల్లో విటమిన్ బి పుష్కలంగా ఉంటుంది.
- క్యారెట్‌తో సహా కూరగాయలను సలాడ్‌గా చేసుకుని తినడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది.
- అరటిపండ్లలో ఉండే ట్రిప్టోన్ అనే రసాయనం మంచి నిద్రను కలిగించి, మనసును ప్రశాంతంగా ఉంచుతుంది.
- విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలు ఒత్తిడి హార్మోన్లను తగ్గించడంలో సహాయపడతాయి.
- సోయా బీన్స్‌లో ట్రిప్టోన్ ఉంటుంది కాబట్టి ఒత్తిడిని తగ్గించుకోవడానికి సోయా ఉత్పత్తులను తినవచ్చునని నిపుణులు అంటున్నారు. కాబట్టి మీ రోజు వారి ఆహారంలో వీటిని చేర్చుకోండి.

ఈజీగా బరువు తగ్గడానికి...

కొందరు సన్నగా ఉన్నా సరే వారికి పొట్ట ఉంటుంది. ఇంక బరువు ఎక్కువగా ఉన్నవారి పరిస్థితి చెప్పనవసరం లేదు. దానిని తగ్గించుకోవడం కోసం చేయకూడని అన్ని పనులు చేస్తారు. అయితే ఎక్కువ కష్టపడకుండా రోజూవారీ చర్యల్లో కొన్ని భాగం చేసుకుంటే ఈజీగా పొట్ట తగ్గించుకోవచ్చు అంటున్నారు.



హైడ్రేట్‌గా ఉండండి: ఉదయాన్నే నిద్రలేచినప్పుడు ముందుగా ఒక గ్లాసు నీరు తాగండి. అనంతరం గోరువెచ్చని నీటిలో నిమ్మకాయ, తేనె కలిపి తీసుకోవాలి. ఇలా చేస్తే జీవక్రియకు చాలా మంచిది. ఇది శరీరంలోని టాక్సిన్‌లను బయటకు పంపడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. అందం కోసమైనా, ఆరోగ్యం కోసమైనా ఏదైనా ప్రారంభించే ముందు శరీరంలోని మలినాలు తొలగించుకోవడం చాలా ముఖ్యం. అప్పుడే మీరు ఏమి చేసినా ఫలితాలు దక్కుతాయి.

మంచి అల్పాహారం: ఉదయాన్నే ప్రోటీన్‌తో నిండిన ఆహారాన్ని తీసుకుంటే.. అది మీ శరీరంలోని చక్కెర స్థాయిలను స్థిరీకరిస్తుంది. అది మీ జీవక్రియను పెంచుతుంది. కాబట్టి మీ రోజులో మొదటి తీసుకునే ఆహారం ప్రోటీన్‌లతో నిండి ఉండేలా చూసుకోండి. అందుకే గుడ్లు, చీజ్ వంటి వాటిని లేదా ప్రోటీన్ రిచ్ స్మూతీలు కూడా తీసుకోవచ్చు. ఇవి కడుపు నిండుగా ఉండి.. అనారోగ్యకరమైన ఆహారం, వాటికి సంబంధించిన కోరికలను నిరోధిస్తాయి.

ఫైబర్ తప్పని సరి: మీ అల్పాహారంలో ప్రోటీన్లతో పాటు ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని కూడా చేర్చుకోండి. ఇది మీ పొట్టను ఎక్కువ సమయం నిండుగా ఉండేలా చేస్తుంది. మీ ఆహార కోరికలను కంట్రోల్‌లో ఉంచుతుంది. దీనికోసం ఉదయాన్నే పండ్లు, కూరగాయలు, చిక్కుళ్ల తినండి.

ఒత్తిడి తగ్గించుకోండి: ఒత్తిడి వల్ల విడుదలయ్యే కార్టిసాల్ మీ ఆకలిని పెంచుతుంది. క్రమంగా ఆకలిని చంపుతుంది. ఈ రెండింటి వల్ల కూడా ఎక్కువ బరువు సమస్యలు వస్తాయి. కాబట్టి మీ ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రయత్నం చేయండి. దానితో పాటు శ్వాసకు సంబంధించిన కొన్ని వ్యాయామాలు చేస్తూ మీ రోజును ప్రారంభించండి. ఉదయాన్నే జిమ్‌కి వెళ్లడానికి లేదా ఏదైనా శారీరక వ్యాయామం చేయడానికి నిర్ణీత సమయం కేటాయించుకోండి. కచ్చితంగా ఏదొక వ్యాయమం చేయండి. దానికి అనుగుణంగా మీ భోజనాన్ని ప్లాన్ చేసుకోగలుగుతారు. వ్యాయామం చేసేందుకు జిమ్‌కు వెళ్ళాల్సిన అవసరం లేదు. ఇంట్లోనే చిన్న చిన్న వ్యాయామాలు చేయండి. ఏదైనా రోజూ చేయడం వల్ల చక్కటి ఫలితాలను ఇస్తాయని గుర్తుంచుకోండి.

డిసెంబర్ 4న చలో పార్లమెంట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయస్థాయిలో ఉద్యమాన్ని నిర్మించనున్నట్టు జాతీయ దళిత సమ్మిట్ ప్రకటించింది. అందులో భాగంగా డిసెంబర్ నాలుగో తేదీన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు పిలుపునిచ్చింది. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఆధ్వర్యంలో రెండురోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ దళిత్ సమ్మిట్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 92 సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 322 మంది ప్రతినిధులు హాజరయ్యారు. పది మందితో జాతీయస్థాయి సమన్వయ కమిటీని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మల్లేపల్లి లక్ష్మయ్య, మాజీ ఎంపీ రామచంద్ర డోమ్, వివిఎస్ నిర్మల్, ధీరేంద్ర ఝా, గుల్జార్‌సింగ్ గోరియా, డాక్టర్ విక్రంసింగ్, కర్నైల్‌సింగ్ ఎక్‌లాహ, బి వెంకట్, సాయిబాలాజీ, వీణా పల్లికల్ సభ్యులుగా ఉన్నారు.

దళితుల సమస్యలు రాజకీయ ఎజెండాగా మారాలి : బి వెంకట్

ఉత్పత్తి రంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్న దళితులకు రాజ్యాంగం ఎలాంటి హక్కులు కల్పించింది, 75 ఏండ్లుగా అవి ఎలా అమలవుతున్నాయనే అంశాలపై చర్చించామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన సామాజిక అంశాలను ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. కులనిర్మూలన జరగాలంటూ రాజ్యాంగంలో ఉన్నా అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లయినా కుల వివక్ష, దళితులపై దాడులు, సామాజిక అణచివేత నేటికీ కొనసాగడం సిగ్గుచేటని అన్నారు. పేదరికం నిర్మూలన, ఉపాధి కల్పన, గౌరవంగా జీవించే హక్కు సంపూర్ణంగా అమలు కావడం లేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్దతుతోనే దళితులు, సామాజిక తరగతులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. దాడులకు పాల్పడే వారిని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రక్షిస్తున్నదని అన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం ఉద్యమిస్తామన్నారు. దేశంలో దళితుల సమస్యలే ఎజెండా కావాలని వివరించారు. చంద్రునిపైకి రాకెట్‌ను పంపించే స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినా భారత్‌లో అంటరానితనం, వివక్ష, దోపిడీ, పీడన ఉండడం దురదృష్టకరమని అన్నారు. మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీ అభివృద్ధి కోసమే పనిచేస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగం స్థానంలో మనస్మృతిని, చాతుర్వర్ణాన్ని తేవాలని చూస్తున్నదని చెప్పారు. భూమి, ఉపాధి, సామాజిక న్యాయం, అందరికీ విద్య, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం, అంటరానితనాన్ని నిర్మూలించడం కోసం ఉద్యమిస్తామని అన్నారు. 2024లో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో దళితుల సమస్యలే రాజకీయ ఎజెండాగా మారాలని చెప్పారు. దీనిపై రాజకీయ పార్టీలు స్పందించాలని కోరారు. కోటి సంతకాలను సేకరించి రాష్ట్రపతికి అందజేస్తానన్నారు.

అంటరానితనం లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలి : మల్లేపల్లి లక్ష్మయ్య

దళితులు ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలపై ఈ సమ్మిట్‌లో సుదీర్ఘంగా చర్చించామని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య చెప్పారు. వాటి పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. భవిష్యత్తులో రాష్ట్రాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న దళితుల సమస్యలను ఎజెండాలోకి తీసుకుంటామని చెప్పారు. అక్కడ కమిటీలను ఏర్పాటు చేస్తామని వివరించారు. రాష్ట్రాల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. డిసెంబర్ నాలుగో తేదీన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపడతామని వారు పిలుపునిచ్చారు. పదేండ్లుగా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తామని అన్నారు. దళితులు అన్ని రంగాల్లో అసమానతలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలు, సంస్థలు, ప్రజాస్వామిక వాదులంతా ఆలోచించి ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. వివక్ష, దోపిడీ, పీడన, అణచివేత, వెలివేతకు గురవుతున్న దళితులకు అండగా నిలవాలని సూచించారు. అంటరానితనం దేశంలో లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఆ దిశగా ఈ ఉద్యమాన్ని ముందుకుతీసుకెళ్తామని చెప్పారు.

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి

- అంటరానితనం, కులవివక్షపై 5 ఏండ్లకోసారి సర్వే చేపట్టాలి
- దళితులకు భూపంపిణీ ఎజెండా కావాలి
- విద్యా రుణాల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- ఎస్సీలకు విద్యా, ఉపాధి, వ్యాపారం హక్కు ఉండాలి
- అప్పుడే దేశంలో దళితుల సాధికారత సాధ్యం : జాతీయ దళిత్ సమ్మిట్‌లో ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో అత్యంత వెనుకబడిన ఉన్న దళితులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి కావాలంటే, వారి సాధికారతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మాజీ చైర్మెన్ ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్ చెప్పారు. ప్రభుత్వరంగంతోపాటు ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించిన జాతీయ దళిత్ సమ్మిట్ ఆదివారం హైదరాబాద్‌లో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సుఖ్‌దేవ్ థోరట్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లయినా దళితులపై అంటరానితనం, వివక్ష, అణచివేత, దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. 1950 వరకు ఎలాంటి హక్కుల్లేవనీ, బానిసలుగా బతికారని గుర్తు చేశారు. దళితులు చదువుకునే హక్కు లేదు, ఉద్యోగం చేసే హక్కులేదు, సమానంగా జీవించే హక్కు లేదని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమల్లోకి వచ్చాక వారికి హక్కులు కల్పించబడ్డాయని వివరించారు. రాజకీయ రంగంతోపాటు విద్యా ఉద్యోగాల్లో దళితులకు రిజర్వేషన్లు కల్పించబడ్డాయని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం అందరూ సమానమేననీ, వివక్షను అంటరానితనాన్ని నిర్మూలించారని అన్నారు. దళితులపై వివక్ష చూపితే శిక్షించేందుకు అట్రాసిటీ చట్టాన్ని తెచ్చారని చెప్పారు. దళితుల జనాభా ఎంత ఉంటే అదే దామాషా ప్రకారం రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు. ఇతరులతో సమానంగా తీర్చిదిద్దేందుకు ఇది కొంత దోహదపడిందని వివరించారు. అందులో భాగంగా దళితులు ఉద్యోగులుగా, అధికారులుగా, మంత్రులుగా అవుతున్నారని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వరంగంలో 20 శాతం ఉద్యోగాలున్నాయని చెప్పారు. ప్రయివేటు రంగంలో 80 శాతం ఉద్యోగాలు లభిస్తున్నాయని అన్నారు. కానీ అక్కడ రిజర్వేషన్లు అమలు కావడం లేదన్నారు. అందుకే ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరముందని కోరారు. భూమి లేని పేదల్లో ఎక్కువ మంది దళితులే ఉన్నారని చెప్పారు. వారికి భూపంపిణీ ఎజెండా కావాలన్నారు. తలసరి ఆదాయంలో ఓబీసీ, ఓసీల కంటే దళితులు తక్కువ స్థాయిలో ఉన్నారని వివరించారు. పేదరికంలో దళితులే అధికంగా ఉన్నారని అన్నారు. అనేక చట్టాలు, పథకాలు అమలు చేస్తున్నా దేశంలో పేదరికం తగ్గడం లేదన్నారు. పేదరికంలో ఓసీలు తొమ్మిది శాతం ఉంటే, దళితులు 30 శాతం ఉన్నారని వివరించారు. భూమి, పక్కా ఇండ్లు, తాగునీరు, డ్రైనేజీ, చదువు, ఉద్యోగం, ఆరోగ్యం, వ్యాపారం ఇలా ఏ రంగంలో చూసినా దళితులు వెనుకబడే ఉన్నారని చెప్పారు. ఉన్నత విద్య చదివే వారు ఓసీలు 41 శాతం ఉంటే, దళితులు 21 శాతం ఉన్నారని అన్నారు. దేశంలో సంపద ఓసీల వద్ద 45 శాతం, ఓబీసీల వద్ద 31 శాతం, ఎస్సీల వద్ద ఏడు శాతం ఉందని వివరించారు. రెగ్యులర్ సాలరీ వచ్చే ఉద్యోగుల్లో దళితులు తక్కువగా ఉన్నారని చెప్పారు. అయితే ఎక్కువమంది క్యాజువల్ కార్మికులుగా తక్కువ జీతానికి పనిచేస్తున్నారని వివరించారు. దీంతో వారు సొంత ఇల్లు లేక, గౌరవంగా జీవించేందుకు సరిపోను ఆదాయం లేక, పౌష్టికాహారం లేక, పేదరికంలో మగ్గుతున్నారని అన్నారు. దళిత వ్యాపారవేత్తలు, రైతులు కూడా వివక్షను అనుభవిస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో దళితులను దేవాలయాల్లోకి రానివ్వడం లేదనీ, రోడ్లపై తిరగనివ్వబోరనీ, హోటళ్లలో వివక్ష ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంటరానితనం లేని గ్రామాలను తీర్చిదిద్దేందుకు పది గ్రామాలకు ఒక కార్యదర్శిని నియమించాలని సూచించారు. పేదరికం, ఉపాధి, జనగణనపై పదేండ్లకోసారి సర్వే చేస్తున్నట్టుగానే అంటరానితనం, కులవివక్షపైనా ఐదేండ్లకోసారి సర్వే చేయాలని కోరారు. అందరూ సమానమేననంటూ రాజ్యాంగం చెప్తున్నా అందుకు విరుద్ధంగా వ్యవహరించే తీరుపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఎస్సీ రైతుల కోసం ప్రత్యేక రాయితీలు కల్పించాలనీ, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్, ఇతర వస్తువులు కొనేందుకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. దళితులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. భూమి లేని దళితులకు భూపంపిణీ చేయాలనీ, ఇది ఎజెండా కావాలని సూచించారు. ప్రయివేటు విద్యారంగం విస్తరిస్తున్నదనీ, అధిక ఫీజులు, వివక్ష వల్ల అక్కడ దళితులు చదువుకునే పరిస్థితి లేదని చెప్పారు. 45 శాతం విశ్వవిద్యాలయాలు, 65 శాతం కాలేజీలు, 67 శాతం పాఠశాలలు ప్రయివేటురంగంలో ఉన్నాయని వివరించారు. అందరికీ విద్య కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దళితులకు విద్యా, ఉపాధి, వ్యాపారం హక్కుగా ఉండాలన్నారు. అప్పుడే దళితులు అందరితో సమానంగా అభివృద్ధి చెందుతారనీ, వారిలో సాధికారత సాధ్యమవుతుందని కోరారు.

మణిపూర్ సీఎం రాజీనామా చేయాలని తీర్మానం

మణిపూర్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, గిరిజన మహిళలపై లైంగిక దాడులు, హత్యలను జాతీయ దళిత్ సమ్మిట్ తీవ్రంగా ఖండిస్తున్నట్టు మాజీ ఎంపీ రామచంద్రడోమ్ చెప్పారు. ఆ ఘటనలకు బాధ్యత వహిస్తూ మణిపూర్ సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేయాలని ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ప్రతినిధులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై ప్రధాని నరేంద్రమోడీ మౌనం వహించడం సరైంది కాదని చెప్పారు. గద్దర్ మరణం పట్ల సంతాప సూచకంగా ప్రతినిధులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా మాట్లాడుతూ ఐదు దశాబ్దాల్లో ఎప్పుడూ లేనిస్థాయిలో ప్రస్తుతం నిరుద్యోగం పెరిగిపోయిందని చెప్పారు. సమానత్వం, అంటరానితనం నిర్మూలన రాజ్యాంగంలో ఉన్నా అమలు కావడం లేదన్నారు. ఇప్పటికీ గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి అమల్లో ఉందని అన్నారు. ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ మాట్లాడుతూ కులాంతర వివాహాల ప్రోత్సాహకం కేంద్ర ప్రభుత్వం 500 మందికే ఇవ్వడం సరైంది కాదన్నారు. ఆ నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రక్షణ కల్పించాలని కోరారు. కులదురహంకార హత్యలను ఆపాలన్నారు. కులాంతర వివాహాల దరఖాస్తులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని పరిష్కరించాలని సూచించారు. కులాంతర వివాహం చేసుకున్న ఓబీసీలకూ నగదు ప్రోత్సాహకం వర్తింపచేయాలని కోరారు. దళితులు, ఆదివాసీల సమస్యలను పరిష్కరించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని బీకేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క బాలమల్లేష్ విమర్శించారు. రామచంద్ర డోమ్, ప్రొఫెసర్ కృష్ణ, విక్రంసింగ్, పి రామ్మూర్తి, సత్యదేవ్ రామ్, దేవి కుమారి అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో మల్లేపల్లి లక్ష్మయ్య, వివిఎస్ నిర్మల్, ధీరేంద్ర ఝా, గుల్జార్‌సింగ్ గోరియా, బి వెంకట్, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుడి చెంతకు ఉల్లి ధరలు...

(మొదటిపేజీ తరువాయి)

అత్యధికంగా (43%) ఉల్లిని సాగు చేస్తుండగా మధ్యప్రదేశ్ (15%), కర్నాటక (9%), గుజరాత్ (8%) ఆ తర్వాతి స్థానాలలో నిలిచాయి. అంటే దేశంలోని మొత్తం ఉల్లి దిగుబడులలో ఈ నాలుగు రాష్ట్రాలలోనే నాలుగింట మూడో వంతు ఉత్పత్తి జరుగుతోంది. జూలై చివరి వారంలో హోల్‌సేల్ మార్కెట్‌లో క్వింటాలు ఉల్లి ధర రూ.1,161 పలికింది. నెల రోజుల తర్వాత అది 60% పెరిగి రూ.1,819కి చేరింది. 2022లో ఇదే కాలంలో ధరలు స్థిరంగానే ఉన్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఆగస్ట్ 16-23 తేదీల మధ్య ధరలు సుమారు 80% పెరిగాయి. ఇవి ఉల్లిని అత్యధికంగా ఉత్పత్తి చేసే నాలుగు రాష్ట్రాలలోని హోల్‌సేల్ ధరలు మాత్రమే. బడా వ్యాపారులు ఈ రాష్ట్రాలలో ఉల్లిని కొనుగోలు చేసి, దేశంలోని పట్టణ ప్రాంతాలకు రవాణా చేస్తారు. అక్కడి నుండి గ్రామీణ ప్రాంతాలకు చేరతాయి. ఇలా అంచెలంచెలుగా వినియోగదారుడి వద్దకు చేరేసరికి ధర బాగా పెరిగిపోతుంది. 2022-23లో దేశంలో 318 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) ఉల్లి ఉత్పత్తి జరిగింది. శీతాకాలపు పంటలో దిగుబడులు బాగా ఎక్కువగా రావడంతో మార్చిలో హోల్‌సేల్ మార్కెట్లలో కిలోకు ఒకటి రెండు రూపాయల ధర మాత్రమే పలికింది. దీంతో చాలా మంది రైతులు పంటను పొలాలలో అలాగే వదిలేశారు. మరోవైపు ఎగుమతులు కూడా పెరిగాయి. రైతులు ఎక్కువగా ఎగుమతి వ్యాపారం చేసే వారికే తమ పంటను విక్రయించారు.

పరిస్థితి తలకిందులు

వాతావరణంలో వచ్చిన మార్పులు ఒక్కసారిగా పరిస్థితిని తలకిందులు చేశాయి. వేసవి ప్రారంభంలోనే అధిక ఉష్ణోగ్రతలు పంటను దెబ్బతీశాయి. ఉల్లి సరిగా పెరగకముందే పండిపోయింది. ఆ తర్వాత అకాల వర్షాలు. గాలిలో తేమ శాతం పెరగడంతో పంటకు ఫంగస్ ఇన్‌ఫెక్షన్లు సోకాయి. దీంతో పంటను త్వరత్వరగా తీసేయాల్సి వచ్చింది.

దేశంలో మూడు పంటలు

మన దేశంలో ఉల్లిని మూడు పంటలుగా...రబీ, ఖరీఫ్, లేట్ ఖరీఫ్...సాగు చేస్తారు. వీటిలో రబీ పంటలోనే అధికంగా అంటే 70% వరకూ దిగుబడులు వస్తాయి. సరఫరాలు శీతాకాలం చివరలో ప్రారంభమై వర్షాలు మొదలయ్యే వరకూ కొనసాగుతాయి. ఆ తర్వాత ఖరీఫ్ పంట సాగు ప్రారంభమవడంతో సెప్టెంబర్ వరకూ సరఫరాలకు ఢోకా ఉండదు. ఖరీఫ్ చివరలో వేసే పంట శీతాకాలం ప్రారంభం వరకూ సరఫరాలను అందిస్తుంది.

అయితే ఉల్లిని కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్లలో నిల్వ చేయడం సాధ్యంకాదు. గాలి బాగా సోకే బహిరంగ ప్రదేశాలలో మాత్రమే నిల్వ చేయగలం. సాధారణంగా సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఉల్లి ధరలు ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే ఆ సమయంలో ఖరీఫ్ పంట నిల్వలు అయిపోతుంటాయి. తర్వాత సీజన్‌లో వేసే పంట అప్పటికి ఇంకా చేతికి రాదు. ఏదేమైనా ఉల్లి ధరలు పెరిగిన తర్వాత కానీ ప్రభుత్వం మేలుకోలేదు. ముందుగా ఎగుమతులపై 40% పన్ను విధించింది. ఆ తర్వాత రైతుల నుండి పంట సేకరణ జరుపుతామని ప్రకటించింది. సేకరణ లక్ష్యాన్ని పెంచుతామని కూడా తెలిపింది. అయితే దిగుబడులు సరిగా లేకపోవడం, మార్కెట్‌లోకి చాలినంత సరుకు రాకపోవడంతో సెప్టెంబర్‌లో ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని అంటున్నారు.



చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో విరాట్ కోహ్లి

ఆదివారం విరామం!

- జట్టు సమావేశం, డెక్సా స్కాన్‌కు పరిమితం
- భారత జట్టు ఆసియా కప్ క్యాంప్

నవతెలంగాణ-బెంగళూర్

వరుసగా రెండు మెగా ఈవెంట్లకు సన్నద్ధమవుతున్న టీమ్ ఇండియా.. ఆగస్టు 30 నుంచి ఆరంభం కానున్న ఆసియా కప్ ముంగిట బెంగళూర్‌లో శిక్షణ శిబిరంలో పాల్గొంటుంది. రెండు రోజుల పాటు మైదానంలో క్రికెటింగ్ డ్రిల్స్‌తో చెమటోడ్చిన రోహిత్‌సేన.. ఆదివారం మైదానం నుంచి కాస్త విరామం తీసుకుంది!. గ్రౌండ్‌కు వెళ్లకపోయినా.. క్రికెటర్లకు ఆశించిన విశ్రాంతి లభించలేదు. జాతీయ క్రికెట్ అకాడమీలో జట్టు సమావేశంలో పాల్గొన్న క్రికెటర్లు.. కీలక డెక్సా స్కాన్‌కు వెళ్లారు. బెంగళూర్ శివారులోని ఆలూర్ గ్రౌండ్స్‌లో భారత జట్టు సాధన చేస్తున్న సంగతి తెలిసిందే. ఆగస్టు 29తో శిక్షణ శిబిరం ముగియనుండగా.. మరుసటి రోజు బెంగళూర్ నుంచి కొలంబోకు భారత జట్టు బయల్దేరనుంది.

ప్రాక్టీస్ ప్రాక్టీస్

ఆసియా కప్ క్యాంప్‌లో భాగంగా తొలి రోజు క్రికెటర్లు అందరూ యోయో ఫిట్‌నెస్ టెస్టుకు హాజరయ్యారు. ఐర్లాండ్ పర్యటన నుంచి వచ్చిన క్రికెటర్లు ఆ తర్వాత ఈ టెస్టు పూర్తి చేశారు. రెండో రోజు ఆలూర్ గ్రౌండ్స్‌లో బ్యాటింగ్ సాధన చేవారు. మూడో రోజు ప్రధానంగా మ్యాచ్ సిములేషన్స్ (అనుకరణలు)పై దృష్టి నిలిపారు. పేసర్లు యశ్ దయాల్, ఉమ్రాన్ మాలిక్ సహా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిలు చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పర్యవేక్షణలో బ్యాటింగ్ జోడీలకు బౌలింగ్ చేశారు. నాల్గో రోజు గ్రౌండ్ వర్క్‌కు విరామం లభించగా క్రికెటర్లు కీలక డెక్సా స్కాన్ పరీక్షకు వెళ్లారు. ఇక చివరి రెండు రోజుల శిక్షణ శిబిరంలో సైతం మ్యాచ్ సిములేషన్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్లను ఎదుర్కొవటంలో భారత బ్యాటర్ల బలహీనత బహిరంగమే. అందుకోసం అనికెత్ చౌదరిని పిలిపించిన ద్రవిడ్.. రోహిత్ శర్మ, అండ్ మెన్‌ను సవాల్‌కు సిద్ధం చేశాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లు సాయి కిశోర్, కుల్దీప్ యాదవ్ సహా మరో పది మంది నెట్ బౌలర్లు విరాట్ కోహ్లి బౌలింగ్ చేశారు. ప్రాక్టీస్‌లో భాగంగా శనివారం రెండు గంటల పాటు బ్యాటింగ్ చేసిన కెఎల్ రాహుల్.. వికెట్ కీపింగ్ సమయంలో ఇబ్బంది పడినట్టు కనిపించింది.

ఏమిటీ డెక్సా స్కాన్? :

డెక్సా (డిఈఎక్స్ఏ) అనగా డ్యూయెల్ ఎనర్జీ ఎక్స్ రే అబ్సార్ప్టియోమెట్రీ. ఎముక మినరల్ డెన్సిటి, బోన్ డెన్సిటి మోతాదు శాతం తెలుసుకునేందుకు ఇదో ఓ శాస్త్రీయ పద్దతి. ఈ పరీక్షలో రెండు ఎక్స్ రే బీమ్‌లు విభిన్న ఎనర్జీ లెవల్స్‌లో ఓ వ్యక్తి ఎముకపై పడతాయి. అందుకు అనుగుణంగా ప్రస్తుత ఎముక సాంద్రత, మినరల్ కంటెంట్ ఎంత ఉన్నాయనేది తెలుస్తుంది. ఈ పరీక్షతో గాయాల బారిన పడే ప్రమాదం నుంచి తప్పించటంతో పాటు, ప్రత్యేక డైట్ పాటించేందుకు సైతం ఉపయోగిస్తారు.



విజేతలతో ఆర్‌పీ పట్నాయక్, నవీన్ నాయక్

స్లాన్ అంతర్జాతీయ చెస్ చాంప్ శుభమ్

రన్నరప్స్‌గా యశ్వి జైన్, సాత్విక్ డిఎస్ఎస్‌యు

హైదరాబాద్: మూడురోజుల పాటు ఉత్సాహభరితంగా సాగిన స్లాన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. ఫిడె 1600 రేటింగ్ చెస్ మాస్టర్లు తలపడిన ఈ టోర్నీలో అమెరికా, కెనడా, యెమన్ సహా భారత్ నుంచి 15 రాష్ట్రాల చెస్ క్రీడాకారులు పోటీపడ్డారు. 575 మంది పాల్గొన్న స్లాన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ చాంపియన్‌గా బిహార్‌కు చెందిన శుభమ్ కుమార్ విజేతగా నిలిచాడు. తెలంగాణ అమ్మాయి యశ్వి జైన్ ద్వితీయ స్థానంలో నిలువగా, ఆంధ్రపదేశ్‌కు చెందిన సాత్విక్ డిఎస్ఎస్‌యు తతీయ స్థానంలో నిలిచారు. యూసుఫ్‌గూడలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. విజేత రూ.1 లక్ష, రన్నరప్ రూ.60 వేలు, సెకండ్ రన్నరప్ రూ.40 వేలు నగదు బహుమతి దక్కించుకున్నట్టు నిర్వాహకులు, స్లాన్ స్పోర్ట్స్ సీఓఓ నవీన్ నాయక్ తెలిపారు.

సెప్టెంబర్ 25న బీసీసీఐ ఏజీఎం

2023 ప్రపంచకప్‌పైనే ప్రధాన చర్చ



బీసీసీఐ ఆఫీస్ బేరర్లు జై షా, రోజర్ బిన్ని, రాజీవ్ శుక్లా

ముంబయి : అక్టోబర్ 5న అహ్మదాబాద్‌లోని మొతెరా మైదానం అగ్ర జట్లు, గత వరల్డ్‌కప్ ఫైనలిస్ట్‌లు ఇంగ్లాండ్, న్యూజిలాండ్ మెగా పోరుతో 2023 వన్డే వరల్డ్‌కప్ ఆరంభానికి వేదిక కానుండగా.. అందుకు సరిగ్గా పది రోజుల ముంగిట భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక సమావేశానికి సిద్ధమైంది. సెప్టెంబర్ 25న ముంబయిలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో బీసీసీఐ వార్షిక సర్వ సభ్య సమావేశం (ఏజీఎం) జరుగనుంది. ఈ మేరకు రాష్ట్ర క్రికెట్ సంఘాలకు బీసీసీఐ సమాచారం అందించింది!. చివరగా అక్టోబర్ 18, 2022న బీసీసీఐ ఏజీఎం సమావేశమైంది. వన్డే వరల్డ్‌కప్‌కు ఆతిథ్యం ఇస్తున్న బీసీసీఐ.. ఇప్పటివరకు ఎక్కువగా విమర్శలే చవిచూసింది. షెడ్యూల్, టికెట్లను సైతం సరైన సమయంలో అభిమానులకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఆరంభానికి ముందు చేదు సంఘటనలను మరిపించేలా.. ఆతిథ్యం ఇచ్చేందుకు బోర్డు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రపంచకప్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుంది. ఏజీఎంలో ప్రధానంగా ఆతిథ్యంపైనే చర్చ సాగనుండగా.. ఐపీఎల్ 2023, మహిళల సీనియర్ జట్టు చీఫ్ కోచ్ ఎంపిక సైతం చర్చించే అవకాశం కనిపిస్తోంది.

4న ఆరంభ వేడుకలు

అక్టోబర్ 4న వన్డే వరల్డ్‌కప్ ఆరంభ వేడుకలు జరుగనున్నాయి. ఈ మేరకు ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. వన్డే వరల్డ్‌కప్‌లో పోటీపడుతున్న జట్ల కెప్టెన్ల సమావేశం సైతం అదే రోజు జరుగుతుంది. సాధారణంగా ఐపీఎల్ ఓపెనింగ్ సెర్మానికి బోర్డు రూ.20-25 కోట్లు ఖర్చు చేస్తుంది. ఐసీసీ వరల్డ్‌కప్ ఆరంభ వేడుకల కోసం రూ.50 కోట్ల వరకు వెచ్చించే అవకాశం లేకపోలేదు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాల రూపకల్పన ఉండనుంది. పాన్ ఇండియా, బాలీవుడ్ సినీ తారలు ఆరంభ వేడుకల వేదికపై నృత్య ప్రదర్శనలతో అభిమానులకు మధురమైన అనుభూతులు మిగిల్చేలా బీసీసీఐ భారీ ఎత్తున ప్లాన్ చేస్తోంది.

కరోనాపై బీజేపీ రాజకీయాలు

- కోవిడ్ కట్టడి భేష్ అంటూ ప్రచారాలు
- మోడీ సర్కారు గొప్పతనమంటూ స్వంత డబ్బా
- సోషల్ మీడియాలో ఊదరగొడుతున్న కల్పిత కథనాలు
- రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కుయుక్తులు
- కరోనాపై బీజేపీ లెక్కలు తప్పని చెప్తున్న డబ్ల్యూహెచ్ఓ గణాంకాలు



దేశంలో ఈ ఏడాది, వచ్చే ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఒకపక్క అధికార ఎన్డీయే కూటమి, మరోపక్క యూపీఏ నుంచి 'ఇండియా'గా రూపాంతరం చెందిన అలయన్స్.. రెండూ ఎన్నికల్లో తలపడనున్నాయి. ఇందుకోసం రాజకీయ అస్త్రశస్త్రాలతో ఇరుపక్షాల కూటములు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే మాత్రం కాదేదీ ప్రచారానికనర్హం అన్న విధంగా వ్యవహరిస్తున్నది. ఇందుకు కరోనా మహమ్మారి వ్యాధి కట్టడిని ముందుకు తెస్తున్నది. కేంద్రంలోని మోడీ సర్కారు కట్టుదిట్టంగా పని చేయటం కారణంగానే మహమ్మారికి అడ్డుకట్ట పడిందని అసత్య ప్రచారం చేసుకుంటున్నది. ఈ విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గణాంకాలను ఉటంకిస్తూ బీజేపీ ప్రచారాన్ని సామాజికవేత్తలు, విశ్లేషకులు తిప్పికొడుతున్నారు.

న్యూఢిల్లీ : దేశంలో కరోనా కేసులు, మరణాలు, రికవరీ రేటుపై వాస్తవాలను కప్పిపుచ్చుతూ, తప్పుడు గణాంకాలతో జనాలను నమ్మించే చర్యకు అధికార బీజేపీ పూనుకున్నది. ఇందుకు ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్రధాన సోషల్ మీడియా వేదికలతో పాటు తమకు (బీజేపీకి) అనుకూలంగా పని చేసే వార్త సంస్థలు, యూట్యూబ్ ఛానెళ్లతో ఇలాంటి ప్రచారాలకు తెరలేపుతున్నది. తాజాగా బీజేపీ 'ఎక్స్'లో ఓ వీడియోను షేర్ చేసింది. ఒకప్పుడు భారతదేశం అట్టడుగున ఉన్నదనీ, నేడు ప్రపంచానికి కొత్త మార్గాన్ని చూపుతున్నదని అందులో ఉన్నది. బీజేపీ, ప్రధాని మోడీ, ఇతర మంత్రులు, బీజేపీకి చెందిన మొత్తం ప్రచార యంత్రాంగం కోవిడ్ నిర్వహణకు సంబంధించి నిరంతరం వాదనలు వినిపిస్తున్నారు. ఎన్నికల ముందు ఈ తరహా ప్రచారం మరింత ఉధృతంగా మారింది.

"రియల్ స్టోరీ" పేరుతో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో హోస్ట్ రిచా అనిరుధ్ బీజేపీ ప్రభుత్వ కోవిడ్ నిర్వహణను ప్రశంసించారు. చాలా అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే భారతదేశంలో కరోనాతో మరణించిన వారి సంఖ్య చాలా తక్కువని తెలిపారు. ఇప్పుడు ఈ వాదన నిజమేనా? అనే ప్రశ్న తలెత్తుతున్నది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే భారత్‌లో నిజంగా కరోనా మరణాలు తక్కువగా ఉన్నాయా? అన్నవి చర్చకు దారి తీస్తున్నది.

కోవిడ్ మరణాల్లో భారత్‌ది మూడో స్థానం

డబ్ల్యూహెచ్ఓ సమాచారం ప్రకారం.. గత మూడేండ్లలో ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 76,98,06,130 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ఈ సమయంలో, ప్రపంచవ్యాప్తంగా 69,55,497 మంది కోవిడ్ కారణంగా మరణించారు. కోవిడ్ మరణాల కేసులలో భారతదేశం ప్రపంచంలో మూడో స్థానంలో ఉండటం గమనించాల్సిన అంశం. భారత్‌లో కోవిడ్ కారణంగా 5,31,925 మంది మరణించారు. కోవిడ్ మరణాల కేసుల్లో అమెరికా మొదటి స్థానంలో, బ్రెజిల్ రెండో స్థానంలో ఉన్నాయి. కోవిడ్ వల్ల అమెరికాలో 11,27,152 మంది, బ్రెజిల్‌లో 7,04,659 మంది మరణించారు.

కేసుల పరంగానూ భారత్‌ది మూడో స్థానం

మొత్తం కోవిడ్ కేసుల పరంగానూ భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 76,98,06,130 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. అమెరికాలో అత్యధికంగా అంటే 10,34,36,829 కేసులు నమోదయ్యాయి. మూడో స్థానంలో ఉన్న భారత్‌లో 4,49,96,599 కోవిడ్ కేసులు నమోదు కావటం గమనార్హం.



'ఆ దేశాల' కంటే భారత్‌లోనే ఎక్కువ మరణాలు

డబ్ల్యూహెచ్ఓ గణాంకాల ప్రకారం.. కోవిడ్ మరణాల సంఖ్యలో ప్రపంచంలోని 195 దేశాలలో భారత్ మూడో స్థానంలో ఉన్నది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే భారత్‌లో కోవిడ్ కారణంగా చాలా తక్కువ మరణాలు సంభవించాయని బీజేపీ వాదిస్తున్నది. అయితే, వివిధ దేశాల గణాంకాలు మాత్రం ఈ వాదన తప్పని రుజువు చేస్తున్నాయి.జపాన్, జర్మనీ, కెనడా, ఇంగ్లాండ్, అమెరికా, చైనా, డెన్మార్క్, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, ఇటలీ మొదలైనవి అభివృద్ధి చెందిన దేశాలలో కంటే కోవిడ్ మరణాల సంఖ్య భారత్‌లోనే ఎక్కువ (అమెరికాను మినహాయిస్తే). ఈ సంఖ్య ఈ దేశాలలో భారత్ కంటే ఐదు నుంచి పది రెట్లు తక్కువగా ఉండటం గమనార్హం. భారత్‌లో కోవిడ్‌తో 5,31,925 మంది మరణించారు. జపాన్‌లో 74,694, కెనడాలో 53,147, డెన్మార్క్‌లో 8780, జర్మనీలో 1,74,979, ఇంగ్లండ్‌లో 2,28,707, చైనాలో 1,21,628, ఆస్ట్రేలియాలో 22,696, నెదర్లాండ్స్‌లో 22,986, ఫ్రాన్స్‌లో 1,67,985, ఇటలీలో 1,91,167 కరోనా మరణాలు సంభవించాయి.ఇటు భారత్ కంటే చిన్న దేశాలతో పోలిస్తే కూడా కరోనా మరణాలు బీజేపీ చేస్తున్న వాదనలు తప్పని నిరూపిస్తున్నాయి. పొరుగు దేశాలలో కూడా భారత్‌లో కంటే కోవిడ్ సమయంలో చాలా రెట్లు తక్కువ మంది మరణించారు. కోవిడ్ కారణంగా పాకిస్తాన్‌లో 30,656 మంది, శ్రీలంకలో 16,882 మంది, బంగ్లాదేశ్‌లో 29,476 మంది, నేపాల్‌లో 12,031 మంది మరణించారు.

కోవిడ్ మరణాల గణాంకాలలో అస్పష్టత

భారత్‌లో కోవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య అధికారిక గణాంకాల కంటే చాలా ఎక్కువ అని డబ్ల్యూహెచ్ఓ ఒక సందర్భంలో తన నివేదికలలో పేర్కొన్నదని నిపుణులు, విశ్లేషకులు గుర్తు చేశారు. భారత్‌లో కోవిడ్ కారణంగా మరణించిన వారి వాస్తవ సంఖ్య, ప్రభుత్వం చెబుతున్న దానికంటే తొమ్మిది నుంచి పది రెట్లు ఎక్కువ అని డబ్ల్యూహెచ్ఓ పేర్కొన్నట్టు చెప్పారు. ఇలాంటి తరుణంలో మోడీ సర్కారు డబ్ల్యూహెచ్ఓ గణాంకాలపై ప్రశ్నలను లేవనెత్తుతూ, అవన్నీ తప్పని ప్రచారం చేసుకున్నది.కోవిడ్ సమయంలో కరోనా మరణాలను ఉద్దేశపూర్వకంగా తక్కువగా లెక్కిస్తున్నారని భారత ప్రభుత్వంపై పలు ఆరోపణలు ఉన్నాయి. అంత్యక్రియల స్థలాల వద్ద పొడవైన క్యూలు, వందలాది మృతదేహాలు కాలిపోవడం, నదుల్లో తేలుతున్న మృతదేహాల చిత్రాలు, సంబంధిత వార్తలు కరోనా కాలంలో సోషల్ మీడియాలో, ప్రధాన వార్త పత్రికలు, ఛానెళ్లలో వచ్చిన విషయాన్ని సామాజిక కార్యకర్తలు, విశ్లేషకులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది కాకుండా, కోవిడ్ తప్పుడు నిర్వహణ, ఆరోగ్య అత్యవసర పరిస్థితిని శాంతి భద్రతల సమస్యగా పరిగణించడం, లాక్‌డౌన్ సమయంలో ప్రజలకు కలిగే కష్టాలు, కార్మికుల వలసలు, నిలిచిపోయిన వ్యాపారాలు, దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ వంటి విషయాలను బీజేపీ మర్చిపోయి ఒక విపత్కర పరిస్థితిని సైతం తనకు అనుకూలంగా మలచుకుంటూ తప్పుడు ప్రచారాలకు పూనుకోవటం సరైన తీరు కాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

ఖుషి.. మ్యూజికల్ బ్లాక్‌బస్టర్ ఖాయం



హేషమ్ అబ్దుల్ వాహబ్

విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. మైత్రీ మూవీస్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. సెప్టెంబర్ 1న గ్రాండ్‌గా రిలీజ్ అయ్యేందుకు ఈ సినిమా రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో దీనికి సంగీతం అందించిన మలయాళ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్ మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..

- నా మలయాళ హిట్ ఫిల్మ్ 'హృదయం' రిలీజైన తర్వాత మైత్రీ సంస్థ నుంచి పిలుపు వచ్చింది. ఈ సినిమాకు వర్క్ చేయమని అడిగారు. దర్శకుడు శివ చెప్పిన కథ విన్నాక ఒక బ్యూటిఫుల్ మూవీకి వర్క్ చేయబోతున్నా అని అర్థమైంది. ఈ సినిమా మొదలైనప్పటి నుంచి మొత్తం మ్యూజిక్ వర్క్ కంప్లీట్ చేసేవరకు ఎగ్జైటింగ్‌గా మా జర్నీ సాగింది.
- ఈ సినిమాలోని పాటల కోసం వీణ, సితార్ వంటి ఇన్‌స్ట్రుమెంట్స్ వాడాం. 'నా రోజా నువ్వే..' పాట నుంచి రీసెంట్‌గా రిలీజ్ చేసిన 'ఓసి పెళ్లామా' వరకు అన్ని పాటలు బాగా కుదిరాయి. విదేశాలకు వెళ్లినా కూడా 'ఖుషి' పాటల గురించి మాట్లాడుతున్నారు. అదే మాకు పెద్ద ఎచీవ్‌మెంట్. 'నా రోజా నువ్వే' పాటలో డైరెక్టర్ మణిరత్నం సినిమా టైటిల్స్‌తో లిరిక్స్ ఉంటాయి. పాట ఇలా ఉండాలని డైరెక్టర్ శివ ప్లాన్ చేశారు. ఆయనే లిరిక్స్ రాశారు. ఈ సినిమాలో హీరో విజయ్ మణిరత్నం, ఏఆర్ రెహమాన్ ఫ్యాన్. ఆయన లవ్ గురించి తన ఫేవరేట్ డైరెక్టర్ మ్యూజిక్ డైరెక్టర్ సినిమాలను గుర్తు చేస్తూ పాట పాడతారు. ఈ థీమ్ బాగా వర్కవుట్ అయ్యింది. ఈ సినిమా కచ్చితంగా మ్యూజికల్ బ్లాక్ బస్టర్ అవుతుంది.
- దర్శకుడు శివ మ్యూజిక్ గురించి ప్యాషన్ ఉన్న దర్శకుడు. సమంత, విజయ్ క్యారెక్టర్స్ మధ్య కెమిస్ట్రీ చాలా బాగుంటుంది. వాళ్లు పోటా పోటీగా నటించారు. ఈ సినిమాకు వాళ్ల పెయిర్ పెద్ద అసెట్ అవుతుంది.
- నాని హీరోగా నటిస్తున్న 'హాయ్ నాన్న' మ్యూజిక్ వర్క్ స్టార్ట్ చేస్తా. అలాగే శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో శర్వానంద్ నటిస్తున్న సినిమాకు కూడా మ్యూజిక్ అందిస్తున్నాను. తెలుగులో కీరవాణి, మిక్కీ జే మేయర్, థీమ్స్ మ్యూజిక్ ఇష్టం.

అద్భుతమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

హీరో రామ్ పోతినేనితో దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న మాస్ యాక్షన్ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'స్కంద- ది ఎటాకర్'. శ్రీలీల నాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో సెప్టెంబర్ 15న వరల్డ్ వైడ్‌గా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ థండర్ ఈవెంట్‌ని నిర్వహించారు. నందమూరి బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది. ఈ ఈవెంట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ, "ఈ సినిమా తప్పకుండా బాగా ఆడాలని కోరుకుంటున్నాను. బోయపాటి చాలా అంకితభావంతో పని చేస్తారు. తమన్ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. దేవదాస్ నుంచి రామ్ ప్రయాణం చూస్తున్నాం. అన్ని రకాల వైవిధ్యమైన పాత్రలు చేస్తున్నారు. ఎంతో తపన ఉన్న నటుడు. మనం అందరం గర్వించదగ్గ నటుడు, కళామతల్లి మనకి ఇచ్చిన ఒక వరం. శ్రీలీల అభినయం, నృతం అన్ని కలగలిపిన ప్రతిభ ఆమె సొంతం. సయీ మంజ్రేకర్ ప్రధాన పాత్ర పోషించారు. ట్రైలర్‌లో చూసినట్లే సినిమా కూడా కన్నుల విందుగా, చెవులకు ఇంపుగా ఉంటుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు. 'తమన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. త్వరలో ఒక పాట వస్తుంది అది మామూలుగా ఉంటుంది. అది వింటే ఈ సినిమా మీటర్ ఏమిటో బాగా అర్థమవుతోంది. నిర్మాత శ్రీనివాస్ లేకపోతే ఈ సినిమా ఉండదు. బోయపాటి మొండిగా నమ్మి వెళ్ళిపోతారు. బాలయ్య గురించి ఒక మాట చెప్పాలి. మాస్, క్లాస్, ఫ్యామిలీ, అమ్మాయిలు .. ఇలా అన్నీ సెక్షన్స్ జై బాలయ్య మంత్రం జపిస్తుంది. నా ఫ్యాన్స్‌కి ఒక మాట చెప్పాలి. పులి వేటకి వచ్చింది. నా లక్కు మీరే నా కిక్కు మీరే' అని హీరో రామ్ పోతినేని అన్నారు. దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ,'బాలయ్యతో 'అఖండ 2' ఉంటుంది. ప్రేక్షకులకు, రామ్ అభిమానులకు ఒక్కమాట కచ్చితంగా చెప్పగలను. గుండె మీద చేయి వేసుకొని ఈ సినిమా చూడండి. ఇదొక అద్భుతమైన ఫ్యామిలీ డ్రామా ఫిల్మ్. పరిపూర్ణమైన సినిమా ఇది. ఇందులో రామ్ అద్భుతంగా నటించాడు. బాగా నటించాలనే తపనే ఆయన్ని ఈ స్థాయికి తీసుకొచ్చింది. శ్రీలీల, సయీ మంజ్రేకర్ మిమ్మల్ని అలరిస్తారు' అని అన్నారు.



బోయపాటి శ్రీను, బాలకృష్ణ, రామ్, శ్రీనివాసా చిట్టూరి

కథానాయిక శ్రీలీల మంచి డాన్సరే కాదు.. మంచి గాయని కూడా అని 'స్కంద' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిరూపించింది. స్టేజ్‌పై ఆమె తమన్‌తో కలిసి పాట అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసింది.
'ధమాకా' రిలీజ్‌కి ముందు సైన్ చేసిన చిత్రమిది. బోయపాటికి థ్యాంక్స్. బాలయ్య గురించి చాలా చెప్పాలని ఉంది. మరో నెలలో ఇలాంటి ప్రీరిలీజ్ ఈవెంట్ జరుగుతుంది అప్పుడు చెబుతాను. (నవ్వుతూ). తమన్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. రామ్‌తో పని చేయడం చాలా ఆనందంగా ఉంది. 'గండర బాయ్' పాట షూటింగ్ చేసినప్పుడు డ్యాన్స్‌లో మా ఎనర్జీ ఎక్స్‌ఛేంజ్ చేసుకునేలా అనిపించింది. అది గ్రేట్ మూమెంట్. ఇంత మంచి సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన బోయపాటికి కృతజ్ఞతలు.

\- శ్రీలీల



నవచిత్రం

తమ్ముడుగా నితిన్



శిరీష్, దిల్‌రాజు, నితిన్, శ్రీరామ్ వేణు

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ మరో క్రేజీ కాంబినేషన్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో 'తమ్ముడు' సినిమా గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ఈ చిత్ర ముహూర్తపు సన్నివేశానికి ఫైనాన్షియర్ ప్రసాద్ క్లాప్ ఇవ్వగా, దర్శకుడు అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు వంశీ పైడిపల్లి ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. దిల్ రాజు నిర్మాణంలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో నిర్మితమవుతున్న 56వ చిత్రమిది. ఈ చిత్రానికి 'దంగల్, కహానీ, తారే జమీన్ పర్' లాంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలకు పనిచేసిన సత్యజిత్ పాండే (సేతు) సినిమాటోగ్రాఫర్‌గా పనిచేయనున్నారు. సెప్టెంబర్ 1 నుండి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరగనుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉంది. హీరో నితిన్ 'దిల్, శ్రీనివాస కళ్యాణం' వంటి మూవీస్ చేయగా, నాని హీరోగా 'ఎంసీఏ', పవన్ కల్యాణ్‌తో 'వకీల్ సాబ్' వంటి సూపర్ హిట్ చిత్రాలను దర్శకుడు శ్రీరామ్ వేణు రూపొందించారు. తాజాగా ఈ ముగ్గురి కాంబినేషన్‌లో 'తమ్ముడు' సినిమా ప్రారంభం అవడం సినీ ప్రియుల దృష్టిని మరింతగా ఆకర్షిస్తోంది.

పవర్‌ఫుల్ సూపర్ హీరో




అరవింద్ కృష్ణ

'శుక్ర, మాటరాని మౌనమిది' వంటి డిఫరెంట్ మూవీస్ తర్వాత దర్శకుడు సుకు పూర్వజ్ రూపొందిస్తున్న కొత్త సినిమా 'ఏ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రాన్ని సినిమా బండి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ కండ్రేగుల నిర్మిస్తున్నారు.

ఈ సినిమా నుంచి తాజాగా ప్రీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సూపర్ హీరోను పరిచయం చేస్తూ స్టన్నింగ్ విజు వల్స్, డైలాగ్స్‌తో రిలీజైన ఈ ప్రీ టీజర్ అందర్నీ ఆకట్టుకుంటోంది.

'సమాజంలో జరిగే నేరాలపై స్పందిం చడం చిన్నప్పటి నుంచే అలవాటు చేసుకుం టాడు హీరో. అతన్ని తల్లి మందలిస్తూ ఉంటుంది. కోరుకున్నట్లే పెరిగి పెద్దయ్యాక సూపర్ హీరో అవుతాడు. చిన్నప్పుడు గొడవలు ఎందుకని చెప్పిన తల్లే...అతను సూపర్ హీరో అయ్యాక..వాడు ఎదురొస్తే డీల్ చేయగలిగే దమ్ము మీకుందా అంటూ ధైర్యంగా సవాల్ చేస్తుంది. బలమున్న వాడిని పట్టుకోవాలంటే పవర్ కావాలి. కానీ నీలా బలం ప్లస్ పవర్ ఉన్నవాడిని పట్టుకోవాలంటే ఎమోషన్ కావాలి..అంటూ ప్రీ టీజర్‌లో వచ్చిన డైలాగ్స్ పవర్ ఫుల్‌గా ఉన్నాయి. ప్రస్తుతం రెగ్యులర్ చిత్రీకరణ తుది దశలో ఉన్న ఈ సినిమా ఒక న్యూ కాన్సెప్ట్ సూపర్ హీరో మూవీ ఎక్స్‌పీరియన్స్‌ను తెలుగు ప్రేక్షకులకు అందించనుంది. గతంలో ఈ సినిమా నుంచి విడుదల చేసిన హీరో అరవింద్ కృష్ణ, సూపర్ విలన్ మనీష్ గిలాడ్ ఫస్ట్ లుక్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది' అని చిత్ర బృందం తెలిపింది. దీనికి సినిమాటోగ్రఫీ- శివరామ్ చరణ్, సంగీతం- ఆశీర్వాద్, ఎడిటర్ - మనోజ్ కుమార్.బి, స్టంట్స్ - రాజ్ కుమార్ గంగపుత్ర.

మరో సర్‌ప్రైజ్



షారూఖ్ ఖాన్

షారూఖ్ ఖాన్, నయనతార జంటగా నటిస్తున్న చిత్రం 'జవాన్'. సెప్టెంబర్ 7న ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రిలీజ్ కానుంది. ఈ సినిమాకు సంబంధించి అభిమానులకు, ప్రేక్షకులకు మేకర్స్ ఇప్పటికే ఎన్నో సర్‌ప్రైజ్‌లను అందించారు. తాజాగా మరో సర్‌ప్రైజ్‌తో అలరించటానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే జవాన్ ప్రివ్యూ సహా సాంగ్స్‌తో ఆకట్టుకున్న ఈ చిత్రం నుంచి 'నాట్ రామయ్యా వస్తావయ్యా..' అనే సాంగ్‌ను విడుదల చేయబోతున్నారు. ఆ పాటకు సంబంధించిన సాంగ్ టీజర్‌ను సోషల్ మీడియా ద్వారా షారూఖ్ పోస్ట్ చేశారు.

'ఇప్పటికే జవాన్ సినిమా నుంచి 'దుమ్మే దులిపేలా..' అనే పాటతో పాటు 'ఛలోనా' అనే రొమాంటిక్ సాంగ్ విడుదలైన సంగతి తెలిసిందే. ఈ రెండు పాటలకు ఆడియెన్స్ నుంచి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ మూవీ నుంచి మూడో పాటగా 'నాట్ రామయ్యా వస్తావయ్యా..'ను రిలీజ్ చేస్తున్నారు. దీంతో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరుగుతున్నాయి. సాంగ్ టీజర్‌ను గమనిస్తే, సాంగ్ ఎంత ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుందనే విషయాన్ని తెలియజేస్తోంది. రాబోతున్న 'నాట్ రామయ్యా వస్తావయ్యా..' సాంగ్‌తో ఆడియెన్స్‌కి ఓ మ్యూజికల్ ఎక్స్‌పీరియెన్స్ కలుగుతుందని మేకర్స్ భావిస్తున్నారు. షారూఖ్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న 'జవాన్' చిత్రాన్ని రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై అట్లీ దర్శకత్వంలో గౌరీ ఖాన్ నిర్మిస్తున్నారు. గౌరవ్ వర్మ ఈ సినిమాకు సహ నిర్మాత. సెప్టెంబర్ 7న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ అవుతుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

జాతీయోద్యమ స్ఫూర్తితో ప్రజాసేవలో 'ఎల్ఐసి'

ఈ మధ్య పార్లమెంట్‌లో పెట్టిన అవిశ్వాస తీర్మానంపై దేశ ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఎల్ఐసి తమ హయాంలో శక్తివంతమైందని, సంస్థ పురోగతిపై జరిగిన దుష్ప్రచారాలు పటాపంచలు అయ్యాయని చెప్పుకొచ్చారు. ఎట్టకేలకు ఎల్ఐసి గురించి ప్రధాని సానుకూలంగా మాట్లాడడం ఆహ్వానించదగిన విషయం. ప్రభుత్వాల సహకారం కన్నా, పాలసీదారుల అచంచెల విశ్వాసం వల్లనే, ఎల్ఐసి ఇంత అద్భుతమైన పురోగతి సాధించిందనేది తిరుగులేని చారిత్రక వాస్తవం. ఎల్ఐసి ఆవిర్భావంలో, ప్రస్థానంలో జాతీయోద్యమ లక్ష్యాలు దాగి ఉన్నాయి. మన మువ్వన్నెల జెండా దేశ స్వాతంత్ర్యానికి, దేశ సార్వభౌమాధికారానికి ప్రతీక. మన దేశ సార్వభౌమాధికారం, ఆర్థిక స్వావలంబనపైన ఆధారపడి ఉంటుంది. 200 సంవత్సరాలు వలస పాలనలో ఆర్థికంగా దోచుకోబడింది కనుక, దేశం ఆర్థికంగా స్వావలంబన సాధించడానికి ప్రభుత్వరంగ సంస్థలు నెలకొల్పారు. 76ఏండ్ల స్వతంత్రంలో దేశం ఆర్థిక స్వావలంబన సాధించడంలో ప్రభుత్వ ఆర్థిక సంస్థలైన బీమా సంస్థల, బ్యాంకుల పాత్ర మహత్తరమైనది.



పి. సతీష్
9441797900

స్వాతంత్రోద్యమ పోరాట సమయంలోనే స్వతంత్ర భారతం ఎలా నిర్మించాలనే అంశంపై విస్తృత మేధో మధనం జరిగింది. 'దోపిడీని అంత మొందించాలంటే, రాజకీయ స్వేచ్ఛతో బాటు, ఆర్థిక వెనుకబాటు ఉన్న లక్షలాది మందికి నిజమైన ఆర్థిక స్వాతం త్రం కల్పించాలని 1931లో కరాచీలో జరిగిన జాతీయ కాంగ్రెస్ సదస్సు తీర్మానించింది. 1934లో జరిగిన కాంగ్రెస్ సోషలిస్ట్ గ్రూప్ సమావేశంలో 'ప్రజల పొదుపును జాతీయం చేయాల్సిన అవసరం ఉందనీ, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వానికి గట్టి నియం త్రణ ఉండాలని కాంగ్రెస్ గట్టిగా నమ్ముతుందని పేర్కొన్నారు. భారత దేశం స్వాతంత్రం సిద్ధించే నాటికి అప్పుడున్న పెట్టుబడి దారులకు తగినంత నిధులు లేవు గనుక దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థను నెలకొల్పే ఉద్దేశ్యంతోనే వారు బొంబాయి ప్లాన్‌ను రూపొందించారు. (ఎనిమిది మంది పారిశ్రామికవేత్తలు-టాటాలు, బిర్లాలు, దాల్మియాలు, సింఘానియాలు తదితరులు) దేశంలో మౌలిక వనరులు నెలకొల్పే బాధ్యత ప్రభుత్వం చేపట్టాలని, పారిశ్రామీకరణ కూడా ప్రభుత్వమే నిర్వహించాలని వారు పట్టుబట్టారు. దేశంలో ఆర్థిక వ్యవస్థను సోషలిస్టు నమూనా పద్ధతిలో నిర్మించాలనేది సోషలిజం కాదు. సోషలిజం నమూనాలో ఆర్థిక వ్యవస్థను నిర్మించటం అంటే పెట్టుబడిదారీ వ్యవస్థను నిర్మించడమే. ఎటొచ్చి దీనిలో దిగువ, మధ్యతరగతి వర్గాలకు కొన్ని రాయితీలు కల్పిస్తారు. అందువల్లే 1955లో ఇంపీరియల్ బ్యాంక్‌ను జాతీయకరణ చేసి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెలకొల్పారు.

జీవిత బీమా అనేది దీర్ఘకాల పెట్టుబడి కనుక జీవిత బీమా వ్యాపారం కేవలం నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. యూరోపియన్ దేశాల్లో ప్రయివేట్ గుత్త సంస్థలు చేసిన ఆర్థిక అరాచకం గుర్తించిన ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బీమా రంగం ప్రభుత్వ అజమాయిషీలోనే ఉండాలని తన స్టేట్స్ అండ్ మైనారిటీస్ గ్రంధంలో పేర్కొన్నారు. 'బీమా వ్యాపార నిర్వహణ, యాజమాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వానికి బదిలీ చేసే చట్టాన్ని అమలుచేయడానికి వీలైనంత త్వరగా చర్యలు చేపట్టాలని ఈ సభ అభిప్రాయపడుతుంది' అని రాజ్యాంగ అసెంబ్లీ 12జనవరి 1948 నాడు తీర్మానించింది. ఆనాడు మనదేశ బీమా రంగంలో ఘోరమైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో జీవిత బీమా రంగంలో పట్టదారుల సొమ్ముకు భద్రత ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో లభించిందని నిర్ధారణకు వచ్చిన ప్రభుత్వం, జనవరి 19, 1956న జీవిత బీమా రంగాన్ని జాతీయాకరణ చేస్తూ ఆర్డినెన్సు తీసుకువచ్చింది. బీమా జాతీయకరణ ఆర్డినెన్స్‌ను అత్యంత గోప్యంగా ఇచ్చి ఉండకపోతే, ప్రయివేటు బీమా సంస్థలు మరింతగా ప్రజల సొమ్మును దిగమింగేవని ఆనాటి ఆర్థికమంత్రి సి.డి దేశముఖ్ తన ఆత్మకథలో రాసుకున్నారు. ఎల్ఐసి ఆవిర్భావాన్ని మన రాజ్యాంగం ఆత్మగా భావింపబడే ఆదేశిక సూత్రాల అధికరణలు 38, 39లో పొందుపరచబడిన విధంగా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే సౌధంగా చూడవచ్చు. ఈరోజు ఏడాదికి రూ.3.5లక్షల కోట్ల నుండి రూ.4లక్షల కోట్లు దేశాభి వృద్ధికి పెట్టుబడులు అందించగల స్థితిలో ఎల్ఐసి ఉందంటే, దానికి జాతీయోద్యమ నాయకుల దార్శనికతే ప్రధాన కారణం. 1956 నుండి ఇప్పటివరకు దేశ ఆర్థిక వ్యవస్థలో రూ.40లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టి, 40 కోట్ల పాలసీదారులకు ఎల్ఐసి విశేష సేవలందిస్తున్నది.

అప్రతిహతంగా ఎల్ఐసి పురోగతి

1956లో కేవలం రూ.5కోట్ల మూలధనంతో ప్రారంభమైన ఎల్ఐసి, నేడు రూ.46లక్షల కోట్ల ఆస్తులను సమకూర్చుకుంది. 2022-23 మొదటి క్వార్టర్‌తో పోల్చినప్పుడు, 2023-24 మొదటి క్వార్టర్‌లో 1300శాతం లాభం (రూ.9544 కోట్లు) ఎల్ఐసి ఆర్జించడం విశేషం. దేశీయ బీమా రంగంలో ప్రయివేటు బీమా కంపెనీల ప్రవేశం జరిగి 23 ఏండ్లు అయినా, ఎల్ఐసి నేటికీ ప్రీమియమ్ ఆదాయంలో 63శాతం మార్కెట్ వాటా, పాలసీలలో 72శాతం మార్కెట్ వాటాతో ఇప్పటికీ మార్కెట్ లీడర్‌గా ముందుకు సాగు తోంది. దేశీయ బీమా రంగంలో ఎల్ఐసి తర్వాత 2వ స్థానంలో ప్రయివేటు బీమా కంపెనీ ఎస్‌బీఐ లైఫ్ కంపెనీ!! ఎల్ఐసి మార్కెట్ వాటా 63శాతం ఉంటే, ఎస్‌బీఐ లైఫ్ మార్కెట్ వాటా 8శాతం లోపే !! దేశవ్యాప్తంగా ఉన్న అన్ని మ్యూచువల్ ఫండ్ల ఆస్తుల కన్నా ఎల్ఐసి ఆస్తులు 1.2 రెట్లు ఎక్కువ క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్‌లో లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ సమర్థత వంటివాటిని పరిశీలిస్తే, క్లెయిమ్ సెటిల్‌మెంట్‌లో ఎల్ఐసి ప్రపంచ రికార్డును కలిగి ఉంది. క్లెయిమ్ సెటిల్‌మెంట్, నిర్వహణ సామర్థ్యాలు, ఉత్పాదకత పరంగా ప్రపంచంలోని మరే ఇతర కంపెనీ కూడా ఎల్ఐసి లాంటి రికార్డును పొందలేదు. ప్రపంచంలో 99శాతం పైబడి క్లైములను పరిష్కరిస్తూ, నేటికీ ప్రపంచంలో నెంబర్ వన్ స్థానంలో ఎల్ఐసి ఉంది. దేశంలో రక్షణ, రైల్వేల తర్వాత ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్న ఆర్థిక సంస్థగా ఎల్ఐసీ పేరెన్నికకంది. ఫార్చ్యూన్ గ్లోబల్ సూచీ-



2023లో 107వ ర్యాంక్ పొందడమే గాక, మొత్తం ప్రీమియం ఆదాయంలో ప్రపంచంలో పదవ అతి పెద్ద సంస్థగా ఎల్ఐసి నిలిచింది.

"ప్రజల పొదుపు ప్రజల శ్రేయస్సు కోసమే" అనే నినాదంతో 1956 నుండి ఇప్పటివరకి దేశ ఆర్థిక వ్యవస్థలో దాదాపు 40లక్షల కోట్ల రూపాయలు పైబడి పెట్టుబడులుగా పెట్టింది. 31 మార్చి 2022 నాటికి ఎల్ఐసి రూ.40, 84,826 కోట్ల పెట్టుబడులను మన దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టింది. ఇందులో రూ.28,85,569 కోట్ల నిధులను కేంద్ర, రాష్ట్ర సెక్యూరిటీలలో, హౌసింగ్, నీటిపారుదల సౌకర్యాల కల్పన కోసం ఎల్ఐసి కేటాయించింది. సుమారు ఒక లక్షల ఉద్యోగులను మాత్రమే కలిగిన ఎల్ఐసి సంస్థ దాదాపు 30కోట్ల వ్యక్తిగత పాలసీలకు సేవలు అందిస్తోంది. ఎల్ఐసి సంస్థ కోసం పని చేసే 13.43లక్షల ఏజెంట్లలో 48శాతం పైబడి గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నారు. నేడు దేశీయ బీమా రంగంలో ఉన్న 26 ప్రయివేటు బీమా కంపెనీలు అన్నీ కలిపి దేశంలో ఉన్న 79శాతం జిల్లాల్లో ఆఫీసు లు కలిగి ఉంటే,ఒక్క ఎల్ఐసి సంస్థనే దేశవ్యాప్తంగా ఉన్న 92 శాతం జిల్లాల్లో కార్యాలయాలు కలిగి ఉంది. ప్రయివేటు బీమా రంగంలో ఉన్న మొత్తం పాలసీల సంఖ్య దాదాపు 6 నుండి 6.5కోట్ల వరకు ఉంది. అయితే దాదాపు 2.45లక్షల మంది ఉద్యోగులు ప్రయివేటు బీమా రంగంలో పనిచేస్తున్నారు. ఎల్ఐసీ ఉద్యోగుల ఉత్పాదకత ప్రయివేటురంగ ఉద్యోగుల కంటే చాలా ఎక్కువ. మొత్తం ఖర్చులు, జీతానికి సంబంధించిన ఖర్చులు వంటి వాటిని పోల్చినప్పుడు ప్రతి అంశంలో ఎల్ఐసి, ప్రయివేటు బీమా కంపెనీలతో పోలిస్తే మెరుగ్గా ఉంది.

ప్రభుత్వ బీమా రంగం ముందున్న సవాళ్లు!

నేడు ప్రభుత్వ బీమా రంగం ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వ బీమా రంగ ప్రయోజనాలకు ప్రతికూలంగా ఉండే కొన్ని విధాన నిర్ణయాలను తీసుకురావడానికి బీమా నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) ప్రయత్నాలు చేస్తోంది!ఈ మధ్య ముగిసిన పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని ప్రచారం జరిగినా, ప్రభుత్వం వెనక్కు తగ్గింది. బీమా చట్ట సవరణల ద్వారా, కనీస మూలధన అవ సరాన్ని మార్చాలని, కమిషన్ చెల్లింపులో మార్పులను, మిశ్రమ లైసెన్సుల జారీని అనుమతించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఈ సవరణలు అమలైతే, ప్రజల పొదుపుకు హాని కలిగించే మోసపూరిత అవకాశాలు ఉన్న1956కి ముందు ఉన్న కాలానికి బీమా రంగం వెళ్లినట్లవుతుంది. ఐఆర్‌డీఏఐ కూడా లైఫ్, నాన్-లైఫ్ వ్యాపారంలో దాదాపు ఇరవై కంపెనీలకు లైసెన్స్‌లు జారీ చేసే అవకాశం ఉందని ప్రకటించడం ద్వారా బీమా మార్కెట్‌లో ఎక్కువ కంపెనీలను అనుమతించాలని యోచిస్తోంది. ప్రతి భారతీ యుడు 2047 నాటికి బీమా పాలసీని కలిగి ఉండాలని, దాని కోసం బీమా వ్యాప్తిని పెంచాలని ప్రభుత్వం, ఐఆర్‌డీఏఐ వాదిస్తూ వచ్చాయి. కానీ తామర తంపరాలుగా ప్రయివేటు బీమా కంపెనీలను అనుమతించడం ద్వారా, బీమా వ్యాప్తిని పెంచలేమని గమనించాలి.

జీఎస్టీ అన్యాయం

బీమా వ్యాప్తి ప్రజల మిగులు ఆదాయంపై ఆధారపడి ఉంటుంది, బాధాకరమైన విషయం ఏమిటంటే మన దేశంలో ఇది చాలా తక్కువగా ఉంది. తలసరి ఆదా యంలో ప్రపంచ దేశాల్లో మన స్థానం 138వది. భారతదేశంలో జీవిత బీమా సాంద్రత, జీవిత బీమా వ్యాప్తి కెనడా కంటే చాలా ఎక్కువ, ఇది యునైటెడ్ స్టేట్స్‌తో సమానం. మన దేశంలో ఆర్థిక వాతా వరణం అంత ఆశాజన కంగా లేకున్నా ఎల్ఐసి, ప్రభుత్వ రంగ బీమాసంస్థలు అద్భుతమైన ప్రదర్శన నమోదు చేసాయి. ఇంత అద్భుతమైన పనితీరున్నప్పటికీ, ప్రభుత్వ బీమా రంగ ప్రయోజనాలను దెబ్బ తీసే చర్యలు తీసుకువ స్తుండటం ఏ మాత్రం సమంజసం కాదు. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ విధించడం అన్యాయం మాత్రమే కాదు, అనైతికం కూడా.భారత రాజ్యాంగం గౌరవ ప్రదంగా జీవించే హక్కును కల్పించిన సందర్భంలో ఆరోగ్యం ప్రాథమిక హక్కుగా చూడాలి. అలాంటి బీమా పొదుపుపై రాయితీ ఇవ్వలేదు సరికదా, ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం నుండి అధిక ప్రీమియం పాలసీలపై తాజాగా పన్ను విధించింది. కచ్చితంగా, ఇది పరిశ్రమపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుంది. కాబట్టి ప్రభుత్వ రంగ బీమా పరిశ్రమ ప్రయోజనాల కోసం, దేశ ప్రజల ప్రయోజనాల దష్ట్యా ఈ అంశాలను ప్రభు త్వం పునః పరిశీలించాలి. కస్టమర్ సేవలలో మరింత మెరు గుదలలు తీసుకురావడానికి, దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపశ మనం కలిగించడం కోసం ఎల్ఐసిలో తరగతి 3, 4 ఉద్యో గుల ఉద్యోగుల నియామకాలు తక్షణం చేపట్టవలసిన అవసరం ఉంది. స్టాక్ మార్కెట్‌లో నమోదైన మార్కెట్ కాపీటలైజేషన్ కన్నా ఎల్ఐసి నిజవిలువ కొన్ని రెట్లు ఉంటుం దనే వాస్తవాన్ని ప్రజలకు, పాలసీదారులకు తెలియ చెప్ప డానికి జన సభలు, వీధి సమావేశాలు దేశవ్యాప్తంగా నిర్వ హించాలని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ఇప్పటికే పిలుపునిచ్చింది. పార్లమెంటు సాక్షిగా ఎల్ఐసిని కీర్తించిన ప్రధాని ప్రభుత్వ బీమా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. 76ఏండ్ల దేశ స్వాతంత్ర్య ప్రస్థానంలో దేశ ఆర్థిక పరిపుష్టికి, స్వావలంబనకు విశేష కృషిచేస్తున్న ఎల్ఐసి ని బలోపేతం చేయడమే నిజమైన దేశభక్తికి తార్కాణం. ■

ఒక 'విధ్వంసపు' రచన!

ఒకావిడ తన ఇంట్లో కొండ చిలువను పెంచుకుంది. ప్రతిరోజూ ఆహారం పెట్టేది. దానితో ఆటలాడేది. ఎంతో చనువుగా ఉండేది. ఎక్కువసేపు ముచ్చటించేది. కొద్ది రోజుల్లోనే ఆ పాముతో ఆమెకు విడదీయరాని బంధం ఏర్పడింది. ఇంట్లో కుటుంబ సభ్యునిలాగే దాన్ని కూడా చూసుకునేది. అయితే ఉన్నట్టుండి ఒకరోజు సడెన్‌గా అది ఆహారం తినడం మానేసింది. ఎక్కువసేపు ఆమెను అల్లుకునే ఉండేది. ఇలా వారం గడిచింది. అది బక్కచిక్కు తోందని గ్రహించి దాన్ని వైద్యుని దగ్గరకు తీసుకెళ్లింది. పామును గమనించిన అతను దాన్నుంచి ఏదో పసిగట్టాడు. 'అది ఆహారం తినకుండా ఎందుకుంటుందో తెలుసా? అని అడిగాడు. ఆమెకు అర్థం కాలేదు. 'ఏదో ఓరోజు నిన్నే తిని ఆకలి తీర్చుకుందామని ఇన్ని రోజులు ఉపవాసంగా ఉంటోంది' అని చెప్పాడు. 'నీతో అల్లుకోని ఎందుకు పడుకుంటుందో తెలుసా?' అన్నాడు. 'నీ ఎముకలు విరగ్గొట్టే శక్తి తనకుందా లేదా అని పరీక్షిం చుకుంటుంది'. అన్నాడు. ప్రేమతో ముద్దాడేది ఎందుకో తెలుసా? 'నిన్ను అమాంతం మింగితే కడుపులో పడతావా లేదా?' అని అన్నాడు...

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే దేశంలో బీజేపీ-ఆరెస్సెస్ చేపట్టిన విధ్వంసపు రచన నేను చెప్పిన కథకు అద్దం పట్టేలా ఉంది. భావజాల రంగంలో విస్తరిస్తున్నకొద్దీ దాని అసలు రంగు బయట పడుతోంది.



ఎన్. అజయ్‌కుమార్



ముందుగా ప్రజలంటే ప్రేమగా నటిస్తూనే అంతర్గతంగా ఆరెస్సెస్ భావజాలాన్ని విస్తరింపజేస్తోంది. దీనికి ఎన్నికలకు ముందే తన హిందూత్వ ప్లాన్ అమలుకు కొన్ని ఈశాన్య రాష్ట్రాలను ప్రయోగ శాలలుగా ఎంపిక చేసుకున్నట్టు తెలుస్తోంది. అక్కడి నుంచి దేశంలోకి విద్వేషపు మంటల్ని రెచ్చగొడుతోంది. మణిపూర్‌లో ఇద్దరు కుకీ మహిళలపై జరిగిన లైంగికదాడి, హత్యదేశాన్నే కాదు యావత్ ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురిచేసింది. మూడునెలలుగా మారణకాండ అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉంది.ముందు మనకు ఇది కుకీ, మైతేయి వర్గాల రిజర్వేషన్ వివాదంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగింది. కానీ ఇది మతశక్తుల దుష్ట పన్నాగం! ఇందులో మరో కుట్రకోణం దాగుంది! మైతేయిలకు ఎస్టీ హోదా ద్వారా కొండ ప్రాంతాల్లో భూమిని కార్పొరేట్లకు ధారాదత్తం చేయడం. ప్రస్తుతానికి కుకీలకే ఆ భూములపై హక్కుంది గనుక ఆధిపత్యం ఉన్న మైతేయిలకు ఎస్టీ హోదా కల్పిస్తే వారు ఆ భూముల్లోని వనరులు, ఖనిజ సంపదకు వారసుల్ని చేయాలనేది వారి ప్రణాళికలో అంతర్భాగంగా కనిపిస్తోంది. ఆ వర్గానికి చెందిన అక్కడి ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పావులు కదిపారు. ముందు జాతుల మధ్య ఘర్షణగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వారు ఖనిజ సంపదను కొల్లగొట్టాలంటే కుకీలు కొండ ప్రాంతాల్ని ఖాళీ చేయాలి. అందుకు ముందు వారిని మయన్మార్ నుంచి వచ్చిన వలసదారులుగా చిత్రీకరించి వారిపై దాడులకు మైతేయిల్ని తెగబడేలా చేశారు. ఇండ్లు ధ్వంసం చేశారు, చర్చీలు తగలబెట్టారు .ఇలా కుకీల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీనేలా చేద్దామనుకున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక పోలీసులు కాని ఈ అరాచకాలను అదుపు చేయలేదు. ఎందుకంటే అధి కారులు, పోలీసుల్లో చాలామంది మైతేయి వర్గానికి చెందినవారే. అందుకే ఎంతో మంది కుకీలు హత్యకు గురవుతున్నా వారు మాట్లాడటం లేదు. ఇండ్లు, చర్చీలు దగ్ధమవుతున్నా ఆపడం లేదు.

అయినా కాషాయ పరివారం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. ఆ భూముల కోసం మరో పథకం వేశాడు విశ్వగురు. ఎందుకంటే రాజకీయ విద్యలో ఆరితేరిన సుప్రసిద్ధుడనే పేరు సార్థకం చేసుకున్నాడు కదా! సులభంగా ఆటవీ భూముల రక్షణ చట్టానికి సవరణ చేశాడు. పార్లమెంట్‌లో మందబలంతో ఆమెదించుకున్నాడు. చట్టం ఇప్పుడు మణిపూర్ చుట్టు పక్కల వంద కిలో మీటర్ల అడవులన్నీ కేంద్రం ఎవరికైనా కట్టబెట్టుకునే వీలును కల్పించింది. అయితే వారి ప్రయోగశాలల్లో చేసిన కుట్రలతో వారిలో ఒక ఆశాభావం ఏర్పడింది. మతం మంటల్లో చలికాచుకునే పరిస్థితి దేశంలో ఉందని! విద్వేషపు రాజకీయాలతో ప్రజల్ని విడదీసే స్వేచ్ఛ ఉందని! అందుకే ఆస్తులు ధ్వంసమైనా, ప్రాణాలు పోయినా, ఆదుకోవాలని చేసిన ఆర్తనాదాలు మౌనమునికి వినపడలేదు. కనపడలేదు. అది ఆరుతుందనుకునే సమయంలోనే హర్యానాలో హిందూ,ముస్లింల ఘర్షణకు మరో బీజం పడింది. కానీ ఇంతవరకు ఘర్షణలు జరిగిన రెండు రాష్ట్రాల్లో ప్రజల్ని పాలిస్తున్నవి, విభజిస్తున్నవి డబులింజన్ సర్కార్లే అన్న సంగతి మరవకూడదు. గోద్రా అల్లర్లు మానవత్వాన్ని మంటకలిపాయి. కాశ్మీరీపండిట్లు, ముస్లింల మధ్య ఘర్షణ జమ్మూకాశ్మీర్‌ను విభజించాయి. తాజాగా మణిపూర్ మండుతూనే ఉండగానే హర్యానాలో మత చిచ్చు రగిలింది. ఇదంతా పథకం ప్రకారమే జరుగుతున్నట్టు కనిపిస్తోంది. దేశాన్ని హిందూత్వగా మార్చాడానికి బీజేపీ-ఆరెస్సెస్ చేపట్టిన అరచాకాలే ఇవన్నీ! రేపు ఏ రాష్ట్రం, ఏరూపంలో మండుతుందో చెప్పలేం! కానీ దేశంలో రాజకీయ పరిస్థితులు తారు మారవుతున్న కొద్దీ విధ్వంసపు కుట్ర శరవేగంగా అమలు చేసే ప్రయత్నం జరుగుతున్నది!

ఈశాన్య భారతంలో కాషాయ దండును తయారుచేసి, హిందూత్వ ఉద్యమంగా రూపు దిద్ద డానికి ఆరెస్సెస్ పక్కాప్లాన్‌నే హిందూత్వ శక్తులు నేడు అమలు చేస్తున్నట్టు సమాచారం. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన తరువాత హిందూత్వ సంస్థలు తమ కార్యకలాపాలను మరింత ఉధృతం చేశాయి. 2015లో మణిపూర్ అసెంబ్లీలో రెండు సీట్లు గెలుచుకున్న బీజేపీ 2017లో ఏకంగా అధికారాన్నే చేజిక్కించుకుంది. మెయితీలను హిందూ జాతీయ వాదులుగా మార్చేందుకు వైష్ణవాన్ని ప్రోత్సహించింది. తమిళనాడులో హిందీని రుద్దాలని చూసింది. ఇలా అన్నిచోట్ల ఏదో రకంగా పాగావేయాలని చేసే ప్రయత్నాలన్నీ బెడిసికొడుతున్నాయి. మతపాలనను అన్నిరాష్ట్రాల్లో ప్రజలు స్వీకరించే స్థితిలో లేరు. దేశంలో కాషాయ పార్టీకి ఉన్న బలం ముప్పై ఎనిమిది శాతం ఓటింగ్ మాత్రమే. వారు స్వతహాగా గెలుచుకున్న రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, గుజరాత్, మణిపూర్, హర్యానా, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, త్రిపుర. కొన్ని రాష్ట్రాలను కూటములతో, మరికొన్నింటిని ప్రజాస్వామ్య బద్ధంగా గెలిచినవాటిని పడగొట్టి పాలిస్తున్నవి. మెజార్టీ రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలున్నాయి. అయితే హిందూత్వ నినాదం ఎత్తుకున్న పెద్దలకు ఇది ఏమాత్రం మింగుడు పడటం లేదు. అంతెం దుకు దేశ రాజధాని ఢిల్లీని వారి చేతుల్లోకి తీసుకోవడానికి చేస్తున్న ఏకపక్ష నిర్ణయాలు ఎవరికీ తెలియనివి కావు. పాలనాధికారాలను వారి చెప్పుచేతుల్లో ఉంచుకోవడానికి ఆర్డినెన్స్‌లు, కొత్త జీవోలతో అక్కడి ప్రభు త్వాన్ని ముప్పుతిప్పలు పెడుతోంది. దేశమంతా మత, విభజన రాజకీయాలతో పాలన సాగించాలని చూస్తోంది. రెండో సారి జవాన్లపై పుల్వామా దాడిని బూచిగా చూపి, పాకిస్తాన్ నుంచి దేశానికి ప్రమాదం ఉందని చెప్పి ప్రజల్ని ఏమార్చి గెలిచింది. ఇప్పు డూ తమ హిందూత్వ ప్రయోగశాలల ద్వారా అల్లర్లు, విధ్వంసాలు సృష్టించి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తోంది! ఇప్పటికే హక్కులు హననమయ్యాయి. భరిస్తూ వస్తున్నాం.విలువలు బుగ్గ య్యాయి పోరాడుతూనే ఉన్నాం. కానీ మనం పీల్చుకునే ఊపిరిలో మతగాలులు వీస్తున్నాయి. పీల్చితే విద్వేషపు మంటల్లో చిక్కుకుని చచ్చిపోతాం. పీల్చకుంటే బతకలేమో అనే పరిస్థితిని సంఘపరివార్ సృష్టిస్తోంది. ఇది ప్రజలు గమనించకుంటే పైన పాము మహిళను ఎలా బలిగొనాలని ఆలోచిస్తుందో...వారు అనుకున్నది సాధించ డానికి దేశాన్నే కాషాయపు రంగులో ముంచే ప్రమాదం పొంచి ఉంది. అందుకే దేశానికి ఇప్పుడు అప్రమత్తత అవసరం. ■

అతి తక్కువ కాలం అమలులో వున్న చార్టర్ చట్టం?

దీపిక

డాక్టర్ అలీ సార్
భారత రాజ్యాంగ నిపుణులు
9494228002



1. క్యాబినేట్ మిషన్‌లోని సభ్యులను గుర్తించండి.
ఎ. ఎ.వి. అలెగ్జాండర్ | బి. క్లెమెంట్ అట్లీ
సి. సర్ స్టాఫర్డ్ క్రిప్స్ | డి. లార్డ్ పెథిక్ లారెన్స్
1. ఎ,బి | 2. ఎ,బి,డి
3. ఎ,సి,డి | 4. ఎ,బి,సి,డి

2. భారత ప్రభుత్వ చట్టం 1935 గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం వంటిది అని విమర్శించినది ఎవరు?
1. సుభాష్ చంద్రబోస్ | 2. అంబేద్కర్
3. జిన్నా | 4. నెహ్రూ

3. క్రిప్స్ ప్రతిపాదనలను ఒక దివాల తీసే బ్యాంకు ముందు తారీఖు వేసి అందించే చెక్కుల లాంటివి అని పేర్కొన్నవారు ఎవరు?
1. అంబేద్కర్ | 2. జిన్నా
3. గాంధీ | 4. సర్దార్ వల్లభాయ్‌పటేల్

4. క్రింది వాటిలో సరైన వాక్యం / వాక్యాలు గుర్తించండి.
ఎ. మౌంట్ బాటన్ విభజన ప్రణాళిక 3 జూన్ 1947.
బి. భారత స్వాతంత్ర్య బిల్లు 1947 బ్రిటిషు పార్లమెంటు ఆమోదం 4 జులై 1947.
1. బి మాత్రమే | 2. ఎ,బి
3. ఎ మాత్రమే | 4. ఏది కాదు.

5. 1774సం.లో కలకత్తాలోని పోర్టు విలియం లో మేయర్ కోర్టు స్థానంలో తొలిసారిగా సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. కాగా మేయరు కోర్టు ఏ సం.లో స్థాపించారు?
1. 1729 | 2. 1886
3. 1726 | 4. 1774

6.క్రింది ఏ చట్టం ప్రకారం భారతదేశంలో తొలిసారిగా ఇస్టిండియా కంపెనీ పాలనలో ద్వంద్వ ప్రభుత్వ విధానాన్ని ప్రవేశపెట్టారు?
1.రెగ్యులేటింగ్ చట్టం 1773 | 2. 1813 చార్టర్ చట్టం
3. 1784 పిట్స్ ఇండియా చట్టం | 4. 1833 చార్టర్ చట్టం

7. క్రింది వాక్యాలలో సరికాని వాక్యం / వాక్యాలు గుర్తించండి.
ఎ. బెంగాల్ గవర్నర్ జనరల్ కార్యనిర్వహక మండలి సభ్యుల సంఖ్యను 4 నుండి 3 కి తగ్గించారు - 1813 చార్టర్ చట్టం.
బి. పరిపాలన అంశాలను 2 రకాలుగా విభజించిన చట్టం 1784 పిట్స్ ఇండియా చట్టం.
1. ఎ మాత్రమే | 2. ఎ,బి
3. బి మాత్రమే | 4. ఏది కాదు.

8. జతపరుచుము.
ఎ. మున్సిపాలిటీలకు చట్టబద్ధత | 1. 1813 చార్టర్ చట్టం
బి. అతి తక్కువ కాలం అమలులో ఉన్న చార్టర్ చట్టం | 2. 1853 చార్టర్ చట్టం
సి. లా కమీషన్ ఏర్పాటు | 3. 1793 చార్టర్ చట్టం
డి. స్థానిక సంస్థలకు పన్ను విధించే | 4. 1833 చార్టర్ చట్టం
1. ఎ1,బి3,సి2,డి4 | 2. ఎ1,బి2,సి3,డి4
3. ఎ3,బి2,సి4,డి1 | 4. ఎ3,బి4,సి2,డి1

9. క్రింది ఏ చట్టమును అనుసరించి భారతదేశంలో తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నిక విధానమును ప్రవేశపెట్టారు?
1. 1919 భారత ప్రభుత్వ చట్టం
2. 1909 భారత కౌన్సిల్ చట్టం
3. 1892 భారత కౌన్సిల్ చట్టం
4. 1861 భారత కౌన్సిల్ చట్టం

10.క్రింది వాటిలో 1861 భారత కౌన్సిల్ చట్టం గురించి సరైన వాక్యం / వాక్యాలు గుర్తించండి.
1. ఐఎన్‌సి ఏర్పాటు తర్వాత ఏర్పడిన తొలి చట్టం
2. తొలిసారిగా రాష్ట్రాలలో శాసన మండలాల ఏర్పాటు.
3. దేశంలో తొలిసారిగా పోర్ట్ పోలియో విధానం ప్రవేశపెట్టారు.
4. 2 మరియు 3

11. క్రింది ఏ చట్టం ప్రకారం గవర్నర్ జనరల్ కార్య నిర్వహక మండలిలో తొలిసారిగా భారతీయులకు అవకాశము కల్పించారు?
1. 1909 భారత కౌన్సిల్ చట్టం
2. 1892 భారత కౌన్సిల్ చట్టం
3. 1861 భారత కౌన్సిల్ చట్టం | 4. పై ఏది కాదు.

12. క్రింది ఏ చట్టం ను అనుసరించి కేంద్రములో తొలిసారిగా ద్విసభ విధానమును ప్రవేశపెట్టారు?
1. 1909 భారత కౌన్సిల్ చట్టం



2. 1935 భారత ప్రభుత్వ చట్టం
3. 1919 భారత ప్రభుత్వ చట్టం
4. 1947 భారత ప్రభుత్వ చట్టం

13.క్రింది వాటిలో 1919 భారత ప్రభుత్వ చట్టం గురించి సరైన వాక్యం / వాక్యాలు గుర్తించండి.
1. దేశంలో తొలిసారిగా ద్వంద్వ ప్రభుత్వ విధానం ప్రవేశపెట్టారు.
2. మింటో మార్లే సంస్కరణలు అని అంటారు.
3. గవర్నర్ జనరల్ శాసన మండలి సభ్యుల సంఖ్య 16 నుండి 60 కి పెంచారు.
4. పైవన్నీ

14. మొదటి రౌండ్ టేబుల్ సమావేశం ఎప్పటి నుండి ఎప్పటి వరకు జరిగింది?
1. 7 సెప్టెంబరు 1930 - 7 డిసెంబరు 1930
2. 12 నవంబరు 1930 - 19 జనవరి 1931
3. 17 నవంబరు 1932 - 24 డిసెంబరు 1932
4. 7 సెప్టెంబరు 1930 - 7 డిసెంబరు 1931

15. సైమన్ కమీషన్ ఏ సం.లో తన నివేదికను బ్రిటిషు ప్రభుత్వానికి సమర్పించింది?
1. 1927 | 2. 1928 | 3. 1930 | 4. 1932

16. క్రింది ఏ చట్టాన్ని అనుసరించి భారతదేశంలో తొలిసారిగా రాజ్యాంగ చట్ట నిర్మాణంలో భారతీయులకు అనధికార సభ్యులుగా తొలిసారిగా అవకాశాన్ని కల్పించారు?
1. 1892 భారత కౌన్సిల్ చట్టం
2. 1861 భారత కౌన్సిల్ చట్టం
3. 1909 భారత కౌన్సిల్ చట్టం
4. ఏది కాదు.

17. 2వ రౌండ్ టేబుల్ సమావేశం ఎప్పటి నుండి ఎప్పటి వరకు జరిగింది?
1. 7 సెప్టెంబరు 1931 - 7 డిసెంబరు 1931
2. 13 నవంబరు 1931 - 19 జనవరి 1932
3. 17 నవంబరు 1932 - 24 డిసెంబరు 1932
4. 7 సెప్టెంబరు 1931 - 1 డిసెంబరు 1931

18. గాంధీ - ఇర్విన్ ఒప్పందం ఎప్పుడు జరిగింది?
1.13 నవంబర్ 1931 | 2. 5 మార్చి 1931
3. 17 మార్చి 1931 | 4. 7 డిసెంబరు 1931

19. క్రింది ఏ చట్టం ప్రకారం కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార విభజన చేశారు?
1. 1858 భారత ప్రభుత్వ చట్టం
2. 1919 భారత ప్రభుత్వ చట్టం
3. 1935 భారత ప్రభుత్వ చట్టం
4. 1947 భారత ప్రభుత్వ చట్టం

20. క్రింది వాటిలో సైమన్ కమీషన్ యొక్క సిఫార్సులు ఏవి?
ఎ.భారత్ లో సమాఖ్య ప్రభుత్వ ఏర్పాటు
బి. మత నియజక వర్గాల కొనసాగింపు
సి. కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేయడం
డి. రాష్ట్ర శాసన మండలాల్లో సభ్యుల సంఖ్య పెంచడం.
1. ఎ,బి,సి | 2. సి మాత్రమే
3. ఎ,బి,డి | 4. ఎ,బి,సి,డి

21. 1773 రెగ్యులేటింగ్ చట్టం గురించి క్రింది వాటిలో సరైనవి గుర్తించండి.
1. తొలి సుప్రీంకోర్టు ఏర్పాటు. | 2. ప్రప్రథమ రాజ్యాంగ చట్టం
3. కంపెనీకి 20 సం.ల పాటు వ్యాపారం చేసుకొనే అనుమతి లభించింది.
4. పైవన్నీ

22. క్రింది ఏ చట్టం ప్రకారం గవర్నర్ జనరల్‌కు కౌన్సిల్ తీర్మానాలపై 'వీటో' అధికారం కల్పించారు?
1. 1813 చార్టర్ చట్టం | 2. 1833 చార్టర్ చట్టం
3. 1793 చార్టర్ చట్టం | 4. 1853 చార్టర్ చట్టం

23. క్రింది ఏ చట్టం ప్రకారం దేశంలో ద్వంద్వ పాలన రద్దు అయ్యింది.
1. 1892 కౌన్సిల్‌చట్టం | 2. 1858 భారత చట్టం
3. 1909 కౌన్సిల్ చట్టం | 4. 1935 భారత చట్టం

24. అక్వర్త్ కమిటీ సిఫార్సు మేరకు సాధారణ బడ్జెటు నుండి రైల్వే బడ్జెటును 1921లో వేరు చేశారు కాగా ఇది ఎప్పటి నుండి అమల్లోకి వచ్చింది.
1. 1921 | 2. 1928 | 3. 1932 | 4. 1924

25. జతపరుచుము.
ఎ. 1858 భారతప్రభుత్వ చట్టం | 1. కేంద్ర శాసన మండలికి బడ్జెట్‌పై చర్చించే వీలు.
బి. 1892 భారత కౌన్సిల్ చట్టం | 2. భారత రాజ్య కార్యదర్శి
సి.1861 భారత కౌన్సిల్ చట్టం | 3. ఆర్డినెన్స్ జారీ చేసే అధికారం.
డి. 1909 భారత కౌన్సిల్ చట్టం | 4. బడ్జెటు తో సహా అన్ని అంశాలపై ప్రశ్నించే ధికారం.
1.ఎ2,బి3,సి4,డి1 | 2.ఎ3,బి4,సి1,డి2
3.ఎ1,బి2,సి3,డి4 | 4.ఎ2,బి1,సి3,డి4

సమాధానాలు

1.3	2.4	3.3	4.3	5.3
6.3	7.1	8.3	9.2	10.4
11.1	12.3	13.1	14.2	15.3
16.2	17.4	18.2	19.3	20.3
21.4	22.3	23.2	24.4	25.4

కరెంట్ అఫైర్స్

- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545



పాకిస్తాన్ తాత్కాలిక ప్రధాని అన్వరుల్ హక్ కాకర్ : పాకిస్తాన్ 8వ తాత్కాలిక ప్రధానమంత్రిగా అన్వరుల్ హక్ కాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రెసిడెంట్ హౌస్‌లో కాకర్ చేత ప్రమాణం చేయించారు. రాబోయే సాధారణ ఎన్నికలను పర్యవేక్షించడం మరియు దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక అడ్డంకులను పరిష్కరించడం వంటి బాధ్యతలను అప్పగించడం జరిగింది. ఈయన బలూచిస్తాన్ అవామీ పార్టీ (బి.ఎ.పి.) కి చెందినవారు. పాకిస్తాన్ రాజ్యాంగం ప్రకారం జాతీయ అసెంబ్లీ పదవీకాలం పూర్తయితే 60 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించాల్సి వుంటుంది. కానీ జాతీయ అసెంబ్లీ కాలం ముగియక ముందే రద్దు చేస్తే 90 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించవచ్చు.




ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా వియన్నా : ఎకనామిస్ట్ ఇంటలిజెన్స్ యూనిట్ యొక్క వార్షిక గ్లోబల్ లైవబిలిటీ ఇండెక్స్ ప్రకారం, వియన్నా ఎవరుసగా 4వ సారి ప్రపంచంలోనే అత్యంత నివాస యోగ్యమైన నగరంగా పేరు పొందింది. రాజకీయ స్థిరత్వం, నేరాల రేటు, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలు, విద్య, సాంస్కృతిక సమర్పణలతో సహా వివిధ అంశాలతో ప్రపంచ వ్యాప్తంగా 173 నగరాలను ఈ నివేదిక ర్యాంకు చేసింది. వియన్నా 2021 లో మహమ్మారి సమయంలో ర్యాంకింగ్స్‌లో పడిపోయినప్పటికీ తిరిగి పుంజుకుని 2022 లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. 2023 లోనూ ఆ స్థానాన్ని కొనసాగించింది. ఈ జాబితాలో డెన్మార్క్‌కు చెందిన కొపెన్ హగన్ 2 వ స్థానంలో ఉండగా, ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ వరుసగా 3,4 స్థానాల్లో నిలిచాయి. కెనడాకు చెందిన వాంకోవర్ 5వ స్థానాన్ని దక్కించుకుంది. మొదటి 10 స్థానాల్లో కెనడా నుండి 3 నగరాలు, స్విట్జర్లాండ్ నుంచి 2, ఆసియా నుండి 2 నగరాలు చోటు దక్కించుకున్నాయి. సిరియాలోని డమాస్కస్, లిబియాలోని ట్రిపోలి ర్యాంకింగ్‌లో అట్టడుగున నిలిచాయి. ఇండియా నుండి న్యూఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు 45 నుండి 50 స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి.



రష్యన్ లూనా - 25 విఫలం : చంద్రునిపై పరిశోధన కోసం చేపట్టిన ప్రతిష్టాత్మక లూనా - 25 ప్రయోగం విఫలం అయింది. సాంకేతిక సమస్య కారణంగా చంద్రునిపై క్రాష్ లాండింగ్ అయినట్లు రష్యన్ అంతరిక్ష పరిశోధన సంస్థ రోస్ కాస్మోస్ వెల్లడించింది. చంద్రుడిపై పరిశోధన నిమిత్తం ఆగస్టు 10న వోస్తోచ్నీ కాస్మోడ్రోమ్ నుంచి రష్యా ప్రయోగించిన లూనా - 25 ఆగస్టు 19న సాంకేతిక సమస్య తలెత్తడంతో చంద్రునిపై కూలిపోయింది. ఈ నెల 21 న ఇది చంద్రునిపై దిగాల్సి వుంది. కేవలం 11 రోజుల్లోనే చంద్రుడిపై దిగేందుకు ఈ ప్రయోగం రష్యా చేసింది. కానీ దురదృష్ట వశాత్తు ఈ ప్రయోగం విఫలమైంది.



జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ఆగస్టు 23 : చంద్రయాన్ 3 చంద్రుడి పై దిగిన ఆగస్టు 23ని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని ప్రధాని నరేంద్రమోడి ఆగస్టు 26న ప్రకటించారు. చంద్రుడిపై ల్యాండర్ దిగిన ప్రదేశాన్ని 'శివశక్తి' అని, చంద్రయాన్ 2 తాకిన ప్రదేశాన్ని 'తిరంగా పాయింట్' గా పిలవనున్నట్టు ఆయన ప్రకటించారు. కొన్ని సంవత్సరాలలో భారత అంతరిక్ష పరిశ్రమ 8 బిలియన్ డాలర్ల నుండి 16 బిలియన్ డాలర్లుగా మారుతుందని నిపుణులు సూచించారని నరేంద్రమోడి ప్రకటించారు.



ఆంధ్రప్రదేశ్ కు ప్రతిష్టాత్మక జైవిక్ అవార్డు : రాష్ట్రంలో పెద్ద ఎత్తున ప్రకృతి సాగు, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నందుకు జైవిక్ ఇండియా అవార్డు దక్కింది. ఇంటర్నేషనల్ కాంపిటిషన్స్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ (ఐసిసిఓఏ) సంస్థ 2023 కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి జైవిక్ ఇండియా అవార్డు ప్రకటించింది. జాతీయ స్థాయిలో 10 విభాగాల్లో 51 అవార్డులను వెల్లడించగా ఇందులో రాష్ట్రానికి 3 అవార్డులు దక్కడం విశేషం. ప్రకృతి వ్యవసాయం ఉద్యమం 700 గ్రామాల్లో 40 వేల మంది రైతులతో ప్రారంభమై రాష్ట్ర ప్రభుత్వం నుంచి మద్దతు పొందింది. ఫలితంగా ఇప్పుడు ప్రకృతి సాగు 3,730 పంచాయితీలకు విస్తరించింది. 9.40 లక్షల ఎకరాలకు పైగా 8.5 లక్షల మంది రైతులు భాగస్వామ్యంతో గణనీయమైన అభివృద్ధి సాధించింది.



ఇన్ఫోసిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఇగా స్వియాటక్ : మహిళల టెన్నిస్ వరల్డ్ నెంబర్ వన్ ఇగా స్వియాటెక్‌ను ఇన్ఫోసిస్ కు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించింది. డిజిటల్ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడం, ప్రపంచ వ్యాప్తంగా మహిళలను ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశం. టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదెల్ కూడా ఈ గౌరవానికి సంతకం చేశారు.

అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం

- ముగ్గురి మృతి



జాక్సన్‌విల్లె: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సష్టించాయి. ఫ్లోరిడా రాష్ట్రంలోని జాక్సన్‌విల్లెలో ఉన్న డాలర్ జనరల్ స్టోర్ వద్ద ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మరణించారు. వీరంతా నల్లజాతీయులే. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకోగా.. సాయుధ దుండగుడు స్టోర్‌లోకి చొరబడ్డాడు. కాల్పుల సమయంలో అతడికీ తీవ్ర గాయాలు కావడంతో మరణించాడు. అమెరికా కాలమానం ప్రకారం శనివారం మధ్యాహ్నం ఏఆర్-15 స్టైల్ రైఫిల్‌తోపాటు మరో హ్యాండ్‌గన్‌తో స్టోర్ వద్దకు వచ్చిన సాయుధ దుండగుడు కాల్పులకు తెగించాడు. జాత్యాహంకారంతోనే దుండగుడు వారిపై కాల్పులు జరిపినట్లు జాక్సన్‌విల్లె పోలీసులు వెల్లడించారు.

మధ్య ప్రదేశ్‌లో దారుణం

- దళితుడి హత్య...అతని తల్లిని వివస్త్రను చేసిన దుండగులు



భోపాల్ : బీజెపి పాలనలో దళితులు, మైనార్టీలపై సాగుతున్న దమనకాండకు అంతులేకుండా పోతోంది. తాజాగా లైంగిక వేధింపుల కేసును ఉపసంహరించుకోవడానికి నిరాకరించిన ఒక దళిత యువతి సోదరుడిని హత్య చేయడంతో పాటు, ఆమె తల్లిని వివస్త్రను చేసిన అమానుష సంఘటన మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో చోటుచేసుకుంది. గురువారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విక్రమ్‌సింగ్ ఠాకూర్ మరికొందరితో కలిసి ఒక దళిత యువతిపై 2019లో లైంగింక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఆ ఏడాదే కేసు నమోదైంది. అప్పటి నుండి కేసును ఉపసంహరించుకోవాలని దళిత కుటుంబంపై ఠాకూర్ ఒత్తిడి తీసుకువస్తున్నాడు. దీనికి ఎప్పటికప్పుడు దళిత యువతి కుటుంబం తిరస్కరిస్తూ వస్తోంది. దీంతో రెచ్చిపోయిన ఠాకూర్ గురువారం బాధితురాలిపై ఇంటిపై దాడిచేశాడు. అడ్డుకున్న ఆమె సోదరుడు 18 ఏళ్ల నితిన్ అహిర్వార్‌ను చితకబాది చంపేశాడు. తల్లి జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించడంతో ఆమెను వివస్త్రను చేశారు. మృతుడి సోదరి మాట్లాడుతూ పరారీలో వున్న కోమల్ సింగ్‌తో కలిసి విక్రమ్ సింగ్, అజాద్ సింగ్‌లు తన ఇంటికి వచ్చారని, కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తెచ్చారని, అందుకు తిరస్కరించడంతో ఈ అమానుష కాండకు పాల్పడ్డారని చెప్పారు. దాంతో వెంటనే తాను సమీప అడవిలోకి పరుగెత్తి పోలీసుల సాయం కోరానని ఆమె వివరించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడితో సహా 8మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ఒకరైన కోమల్ సింగ్‌తో సహా మరికొంతమంది పరారీలో వున్నారు. వారిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులపై, ప్రధాన నిందితుడితో పాటూ అరెస్టు చేసిన మరో 8మందిపై హత్య కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, బిఎస్‌పి చీఫ్ మాయావతి ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు.

చార్జిషీట్ కోర్టు పరిభాషలోనే ఉండాలనేం లేదు..

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ : చార్జిషీటు కచ్చితంగా కోర్టు పరిభాషలోనే ఉండాల్సిన అవసరం లేదని, అలాంటి నిర్దిష్ట నిబంధనలు ఏవీ లేవని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) ప్రకారం ఒక్క హైకోర్టులో తప్ప మిగతా కోర్టుల్లో ఏ భాషను ఉపయోగించాలన్న విషయాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే, అందులోనూ చార్జిషీట్ ఏ భాషలో ఉండాలనే దానిపై ఎలాంటి నిబంధనలు లేవని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది. మధ్యప్రదేశ్‌లో జరిగిన వ్యాపం కుంభకోణం కేసులోని ఇద్దరు నిందితులు తమకు ఇంగ్లీష్ రాదని, చార్జిషీట్‌ను హిందీలో అనువదించి ఇవ్వాలని ట్రయల్ కోర్టును కోరారు. అందుకు కోర్టు అంగీకరించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ వారికి అనుకూలంగా తీర్పు రాగా, సీబీఐ సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. విచారించిన న్యాయస్థానం.. ఏ ఒక్క అంశాన్ని విస్మరించినా న్యాయం జరగదని భావించిన సందర్భాల్లో మాత్రమే నిందితులు కోరిన భాషలో చార్జిషీట్‌ను ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. అంతేకాదు, ఈ కేసులో నిందితులు విద్యావంతులు కావడంతో చార్జిషీట్ ను హిందీలోకి అనువదించి ఇవ్వాల్సిన పనిలేదని స్పష్టం చేసింది.

నేడు ఎన్టీఆర్ రూ.వంద నాణేం ఆవిష్కరణ

- ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా విడుదల చేయనున్న రాష్ట్రపతి ముర్ము

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ముద్రించిన ఎన్టీఆర్ నాణేన్ని నేడు (సోమవారం) ఆవిష్కరించనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో నాణేన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇప్పటికే ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు ఢిల్లీకి చేరుకున్నారు. 44 మిల్లీ మీటర్ల చుట్టుకొలతతో ఉండే ఈ వంద రూపాయిల నాణేన్ని 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్‌తో తయారు చేశారు. అలాగే ఈ నాణేనికి ఓ వైపు మూడు సింహాలతో పాటు అశోక చక్రం ఉండగా మరోవైపు ఎన్టీఆర్ చిత్రం, ఆ చిత్రం కింద నందమూరి తారక రామారావు శతజయంతి అని హిందీ భాషలో ముద్రించారు. ఎన్టీఆర్ శతజయంతి ఈ ఏడాదితో ముగిసింది. కనుక 1923- 2023 అని ముద్రితమై ఉంది.ఎన్టీఆర్ రూ.వంద నాణెం విడుదల కార్యక్రమానికి సంబంధించి ఆయన కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానాలు పంపిన విషయం తెలిసిందే. ఇక టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆయన ఆదివారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. ఎన్టీర్ నాణేం విడుదల తరువాత చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్‌లో దొంగ నోట్ల వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నారు.

జింబాబ్వే అధ్యక్షుడిగా రెండోసారి ఎమ్మర్సన్ నంగాగ్వా ఎన్నిక

హరారే: ఎమ్మర్సన్ నంగాగ్వా వరుసగా రెండోసారి జింబాబ్వే అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శనివారం వెల్లడైన ఫలితాల్లో మంగాగ్వా విజయం సాధించారు. అధికార పార్టీ అవకతవకలకు పాల్పడిం దని ఆరోపణలు వెల్లువెత్తినా ప్రజలు రెండోసారి కూడా అధికార పార్టీ అభ్యర్థినే గెలిపించారు. నంగాగ్వా తన సమీప ప్రత్యర్థి నెల్సన్ చామిసాపై విజయాన్ని నమోదు చేశారు. కాగా, 1980లో బ్రిటన్ నుంచి జింబాబ్వే స్వాతంత్ర్యం పొందిన తర్వా త తొలిసారి నంగాగ్వా హయాంలోనే పార్టీ బలోపేతమైంది. అంతేగాక మంగాగ్వా తొలిసారి పూర్తికాలం పదవిలో ఉన్న వ్యక్తిగా గుర్తింపు పొందారు.

నిబంధనలకు పాతర

ఈసీ లెక్కలోని రాని బీజేపీ ఫేస్‌బుక్ ప్రచార వ్యయం


- గుజరాత్ ఎన్నికల సమయంలో నరేంద్ర-భూపేంద్ర పేరిట పేజీ

న్యూఢిల్లీ : ఎన్నికలలో పోటీ చేసే పార్టీలు ఎలక్షన్ కమిషన్ కన్నుగప్పి, నిబంధనలకు పాతర వేస్తూ ఫేస్‌బుక్ పేజీలలో ప్రచారం చేసుకోవచ్చు. పనిలోపనిగా ప్రత్యర్థులపై బురద చల్లవచ్చు. ప్రచారానికి తెర పడిన తర్వాత కూడా దర్జాగా ప్రకటనలు ఇస్తూ ఓటర్లను ప్రభావితం చేయవచ్చు. ఎలాగంటారా? 2000వ సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన గుజరాత్ శాసనసభ ఎన్నికల సందర్భంగా ఒకే ఐపీ అడ్రస్‌తో ఉన్న 23 వెబ్‌సైట్లు, వాటి అనుబంధ ఫేస్‌బుక్ పేజీలు ఫేస్‌బుక్‌లో చాపకింద నీరులా బీజేపీకి అనుకూలంగా ప్రచారం చేశాయి. ప్రత్యర్థి పార్టీలు, వాటి నాయకుల మీద విషం చిమ్మాయి. ఈ పేజీలు లక్షలాది రూపాయలు కుమ్మరించి ప్రకటనలు ఇచ్చాయి. స్వతంత్ర 'ఆల్ట్ న్యూస్' మీడియా సంస్థ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ బండారాన్ని సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టింది.

'నరేంద్ర భూపేంద్ర' పేరిట ఉన్న ఫేస్‌బుక్ పేజీపై ఆల్ట్ న్యూస్ కూపీ లాగింది. అయితే ఇప్పుడు ఆ పేజీని తొలగించారు. ప్రధాని నరేంద్ర మోడీ, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ పేరిట ఈ పేజీని రూపొందించారు. ఈ ఇరువురు నేతలకు అనుకూలంగా ఈ పేజీలో ప్రకటనలు గుప్పించారని మెటా యాడ్ లైబ్రరీ నివేదిక తెలిపింది. నరేంద్ర-భూపేంద్ర పేరిట ఉన్న ఈ పేజీ నేరుగా బీజేపీ అనుకూల వెబ్‌సైట్లతో అనుసంధానమై ఉంది. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమే అవుతుంది. ఎందుకంటే ఈ పేజీలో ఇచ్చిన ప్రకటనలపై చేసిన కోట్లది రూపాయల ఖర్చు ఎన్నికల ప్రచార వ్యయంలో చేరలేదు. అంటే ఎన్నికల కమిషన్ కన్నుగప్పి ఈ తతంగాన్ని నడిపించారన్న మాట.

ఆ ఖర్చు ఎవరి ఖాతాలో వేశారు?

మెటా అనేది ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల మాతృసంస్థ. అది తన యాడ్ లైబ్రరీ నివేదికలో అనేక



సంవత్సరాలుగా రాజకీయ ప్రచార ప్రకటనల సమాచారాన్ని నిక్షిప్తం చేస్తోంది. ఫేస్‌బుక్ నుండి తొలగించిన పేజీల సమాచారం కూడా ఇందులో ఉంటుంది. 2022 జూన్ 14 నుండి గుజరాత్ శాసనసభ ఎన్నికలు జరిగిన డిసెంబర్ వరకూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఈ పేజీ 145 ప్రకటనలు ఇచ్చింది. వీటి కోసం అక్షరాలా రూ.55,53,940 ఖర్చు చేసింది. అయితే ఈ వ్యయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తేలేదు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం గుజరాత్‌లో ఒక్కో శాసనసభ అభ్యర్థి రూ.40 లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేయకూడదు. భూపేంద్ర పటేల్ నవంబర్ 16న నామినేషన్ దాఖలు చేశారు. ఆ రోజు నుండి డిసెంబర్ 8వ తేదీ వరకూ రాజకీయ ప్రచార ప్రకటనల కోసం నరేంద్ర-భూపేంద్ర ఫేస్‌బుక్ పేజీ రూ.31,47,600 నుండి రూ.38,62,694 ఖర్చు చేసింది. అయితే తన ఎన్నికల వ్యయం మొత్తం రూ.18,74,049 లక్షలు మాత్రమేనని భూపేంద్ర ప్రకటించారు. పైగా ఎన్నికల ప్రచార ప్రకటనల కోసం తాను కేవలం రూ.4,206 మాత్రమే ఖర్చు చేశానని తెలిపారు. మరి ఫేస్‌బుక్ పేజీ పెట్టిన ఖర్చు ఎవరి ఖాతాలో వేశారు?

పోలింగ్ రోజు కూడా ప్రచారం

ఇక్కడ గమనించాల్సిన మరో విషయమేమంటే ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత పోలింగ్ రోజు వరకూ అభ్యర్థులు ఏ రూపంలో కూడా ప్రచారం చేయకూడదు. కానీ నరేంద్ర-భూపేంద్ర పేజీలో మాత్రం ఎన్నికల రోజు కూడా బీజేపీకి అనుకూలంగా ప్రకటనలు వచ్చాయి. భూపేంద్ర పోటీ చేసిన ఘట్లోడియా స్థానంలో డిసెంబర్ 5న పోలింగ్ జరిగింది. ఆ రోజున బీజేపీ ప్రభుత్వ విజయాలను ప్రస్తుతిస్తూ, భూపేంద్ర-నరేంద్ర ఫొటోలతో సహా ప్రకటనలు వచ్చాయి. ఈ పేజీని అన్ని బీజేపీ అనుకూల వెబ్‌సైట్లతో అనుసంధానం చేశారు. వీటన్నింటి ఐపీ అడ్రస్‌లు ఒకటే. అయితే తనకు బీజేపీతో సంబంధం ఉన్న విషయాన్ని మాత్రం నరేంద్ర-భూపేంద్ర పేజీలో ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ సంవత్సరం మేలో ఓ వెబ్‌సైట్ ఐపీ అడ్రస్‌ను మార్చారు.

పశ్చిమబెంగాల్ లో ఘోరప్రమాదం

- బాణసంచా ఫ్యాక్టరీలో ఎనిమది మంది మృతి

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్ లో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు సంభవించడంతో భవనం కుప్పకూలింది. దీంతో అందులో పనిచేస్తున్న కార్మికులు 8 మంది దుర్మరణం పాలయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీలో ఎంతమంది వర్కర్లు ఉన్నారనే విషయంపై స్పష్టత లేదని, మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని అధికారులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నార్త్ 24 పరగణాల జిల్లా బరాసత్ లోని బాణసంచా ఫ్యాక్టరీలో ఆదివారం ఉదయం పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఫ్యాక్టరీ భవనం కుప్పకూలింది. మంటలు ఎగిసిపడ్డాయి. చుట్టుపక్కల భవనాలు కూడా బీటలువారాయి. లోపల ఉన్న కార్మికులు 8 మంది చనిపోయారు. వారి మృతదేహాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ఐదుగురిని స్థానికులు బయటకు తీసుకొచ్చారు. ప్రమాదం విషయం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక కార్యక్రమాలు చేపట్టారు. మృతదేహాలను వెలికి తీసి పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. స్టేట్ యూనివర్సిటీకి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఈ బాణసంచా ఫ్యాక్టరీ ఉంది. ఎలాంటి అనుమతులు లేకుండా, జనావాసాల మధ్యే ఫ్యాక్టరీని నడిపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ముంబయి హెూటల్‌లో అగ్నిప్రమాదం

- ముగ్గురు సజీవదహం



ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబైలోని శాంటాక్రజ్ ఏరియాలోగల గెలాక్సీ హెూటల్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో హెూటల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అసలేం జరుగుతుందో అర్థమయ్యే లోపే మంటల్లో ముగ్గురు సజీవ దహనమయ్యారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. అగ్ని కీలలు ఎగిసిపడగానే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు.. ఫైరింజన్‌లతో మంటలను ఆర్పేశారు. ఆ తర్వాత హెూటల్‌లోని వివిధ గదుల్లో చిక్కుకున్న వారిని బయటికి తెచ్చారు. ఇప్పటివరకు ఐదుగురు క్షతగాత్రులు వెలికితీసి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సజీవ దహనమైన ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నది. ప్రమాదానికి కారణం ఏమై ఉంటుందనేది సస్పెన్స్‌గా మారింది. ఘట నకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఏనుగులకు 2 కారిడార్లు

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- వీటి పరిధిలోకి 60 గ్రామాల ప్రజానీకం
- కర్నాటక, తమిళనాడు మీదుగా చిత్తూరు జిల్లా వరకు ఒకటి
- పలమనేరు, కుప్పం నుండి తిరుపతి వరకు మరొకటి

అమరావతి : ఏనుగుల కోసం రాష్ట్రంలో రెండు కారిడార్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో ఒకటి అంతరాష్ట్ర కారిడార్ కాగా, మరొకటి రాష్ట్రంలోనే అంతర్‌జిల్లా కారిడార్. ఇవి రెండు కాకుండా ఆంధ్రప్రదేశ్-ఒడిషా సరిహద్దుల్లో కూడా ఏనుగుల కదలికలను అధికారికంగా గుర్తించారు. రాష్ట్రంలో వన్య మృగాల సంచారం ఇప్పటికే ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పులులు, చిరుతపులులు, ఏనుగులు ఎలుగుబంట్లు ఇటీవల కాలంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోకి జనావాసాల్లోకి వస్తున్న సంఘటనలు తెలిసిందే. తిరుమలలో ఇటీవలే ఒక చిన్నారిని చిరుత కబళించింది. కొన్ని ప్రాంతాల్లో పశువులు వీటి బారిన పడ్డాయి. మరికొన్ని చోట్ల పండ్లతోటలు, పంటపొలాలు ధ్వంసమైనాయి. వీటిని నివారించి, ప్రజల ప్రాణాల రక్షణకు తీసుకున్న చర్యలు దాదాపు శూన్యం. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కారిడార్లలో 60 రెవిన్యూ గ్రామాల్లో ప్రజానీకం నివసిస్తున్నారు. వీరిలో అధికభాగం వ్యవసాయం, పండ్లతోటలపైనే ఆధారపడి ఉన్నారు. కారిడార్‌ల ప్రకటనతో ఏనుగుల రక్షణకు ప్రాధాన్యత లభించనుంది. దీంతో వీరి జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. ఈ మార్గంలో జాతీయ రహదారులతో పాటు, రైలు మార్గాలు కూడా ఉన్నాయి. స్థానిక ప్రజలతో పాటు, ఈ మార్గాల్లో ప్రయాణం చేసే ప్రయాణీకుల భద్రతకు ఎటువంటి చర్యలు తీసుకుంటారన్న విషయం స్పష్టత లేదు. ఈ విషయాలేమి లేకుండా ఏనుగుల కారిడార్లను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఆంధ్రా, ఒడిషా సరిహద్దు ప్రాంతంలో మరికొంత కాలంపాటు నిఘా ఉంచాలనిం సూచించింది. భవిష్యత్‌లో ఇక్కడ కూడా మరో కారిడార్‌ను ప్రకటించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ తాజాగా ప్రచురించిన 'భారతదేశంలో ఎలిఫెంట్ కారిడార్స్-2023' నివేదికలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. 2010వ సంవత్సరం తరువాత ఈ తరహా నివేదికను కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఇదే మొదటిసారి. దేశం మొత్తం మీద 150 కారిడార్లను ఈ నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రానికి సంబంధించిన కారిడార్లకు నివేదికలో చోటులభించడంతో ఏనుగుల సంరక్షణ మరింత సులభమవుతుందన్న అభిప్రాయాన్ని అటవీశాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

మూడు రాష్ట్రాల మధ్య....

రాష్ట్రంలో మొదటి ఏనుగుల కారిడార్‌గా కేంద్రం గుర్తించిన ప్రాంతం మూడు రాష్ట్రాల మధ్య విస్తరించిఉంది. కర్నాటకలోని కోలార్ ఫారెస్ట్ డివిజన్ కామసముద్రం అటవీ ప్రాంతం నుండి ప్రారంభమయ్యే ఈ కారిడార్ తమిళనాడులోని హోసూరు వెప్పనపల్లి రిజర్వు ఫారెస్ట్ మీదుగా ఆంధ్రప్రదేశ్ వరకు వ్యాపించిఉంది. రాష్ట్రంలో కుప్పం రేంజి రిజర్వు ఫారెస్ట్‌లోని కౌండిన్య అభయారణ్యం మల్లనూరు గ్రామం వరు ఈ కారిడార్ ఉంది. మొత్తం 28 కిలోమీటర్ల పొడవు, 3.5 నుంచి ఐదు కిలోమీటర్ల వెడల్పులో ఈ కారిడార్ విస్తరించినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ కారిడార్‌లో 15 నుండి 20 ఏనుగులు తిరుగుతున్నట్లు గుర్తించారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి ఏనుగులు రావడానికి అవకాశం ఉన్న ఏకైక మార్గంగా ఈ కారిడార్‌ను పేర్కొన్నారు. ఈ కారిడార్‌లో అధికభాగం మగ ఏనుగులే తిరుగుతున్నాయని నివేదికలో పేర్కొన్నారు. ఈ కారిడార్‌ను పరిరక్షించుకోకపోతే రాష్ట్రంలో



ఉన్న ఏనుగులు చిన్న గుంపుగా ఒంటరిపాటుకు గురవుతాయని, ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని నివేదికలో హెచ్చరించారు.

40 రెవిన్యూ గ్రామాలు..రోడ్లు, రైలు మార్గాలు

ఈ కారిడార్‌ను అభివృద్ధి చేయడంలో ఉన్న ఇబ్బందులను కూడా నివేదికలో పేర్కొన్నారు. ట్రై జంక్షన్ కారిడార్‌గా గుర్తించిన ఈ ప్రాంతంలో 40 రెవిన్యూ గ్రామాలున్నాయి. కృష్ణగిరి-పలమనేరు నేషనల్ హైవే(ఎన్‌హెచ్ 42) కూడా ఈ మార్గం గుండానే వెడుతుంది. దాదాపు 25 కి.మీల బెంగళూరు-చెన్నై రెండు లైన్ల రైల్వే మార్గం కూడా ఈ కారిడార్ మీదగానే వెడుతుంది. జిల్లా స్థాయికి చెందిన కొన్ని ప్రధాన రోడ్లు కూడా ఈ కారిడార్‌లో ఉన్నాయి.

70 కిమీ రాయల కారిడార్

70 కి.మీ పొడవు, 11 కి.మీ వెడల్పులో విస్తరించి ఉన్న మరో కారిడార్‌ను 'రాయల ఎలిఫెంట్ రిజర్వు కారిడార్'గా కేంద్రం గుర్తించింది. చిత్తూరు జిల్లాలోని కౌండిన్య వైల్డ్‌లైఫ్ సాంచ్యురి నుండి తిరుపతి జిల్లాలోని శ్రీవెంకటేశ్వర నేషనల్ పార్క్ వరకుఇది విస్తరించి ఉంది. ఈ కారిడార్ పుంగనూర్, చిత్తూరు పశ్చిమ, బాకరాపేట్ అటవీ రేంజ్ పరిధిలో ఉంది. ఈ కారిడార్‌లో 50 నుండి 60 ఏనుగులు తిరుగుతున్నట్లు గుర్తించారు. వెంకటేశ్వర నేషనల్ పార్కు నుండి కౌండిన్య వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వరకు ఏనుగులు తిరగడానికి ఇదొక్క మార్గమే ఉందని, ఈ మార్గాన్ని చిరుతలు, ఎలుగుబంట్లు, దుప్పులు వంటి ఇతర వన్యప్రాణులు కూడా రాకపోకలకు ఉపయోగించుకుంటున్నాయని నివేదికలో పేర్కొన్నారు.

కీలక రహదారులు

ఈ కారిడార్ పరిధిలో బెంగళూరు-తిరుపతి, కడప-చిత్తూరు హైవేలు ఉన్నాయి, నూతనంగా ప్రతిపాదించిన బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ హై వే కూడా ఈ మార్గం గుండానే వెడుతుంది. దాదాపు 50 కి.మీ మేర హైటెన్షన్ విద్యుత్ లైన్ కూడా ఉన్నట్లు గుర్తించారు. ఇవిగాక పెద్ద ఎత్తున వ్యవసాయ, రెవెన్యూ భూములు ఉన్నాయని, 20 రెవిన్యూ గ్రామాల్లో జనజీవనం కూడా ఉందని పేర్కొన్నారు. ఈ కారిడార్‌ను రాష్ట్ర అటవీ శాఖ నోటిఫై చేయాల్సి ఉంది.

కారిడార్లు ఎందుకు?

ఎలిఫెంట్ కారిడార్లను గుర్తించడం వల్ల ఏనుగుల సంరక్షణకు చర్యలు తీసుకోవడం సులభమౌతుందని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. రెండు, అంతకన్నా ఎక్కువ ఉన్న ఏనుగుల నివాసాల మధ్య అనుసంధానం కోసం ఈ కారిడార్లు ఉపయోగపడుతాయని, అధికారికంగా ప్రకటించడం వల్ల మనుష్యులకు, ఏనుగులకు మధ్య ముఖాముఖి సంఘటనలను సాధ్యమైనంత మేర తగ్గించగలమని చెబుతున్నారు.

పులుల కోసం కూడా...

రాష్ట్రంలో పులల కోసం కూడా ఒక కారిడార్‌ను ప్రతిపాదిస్తున్నారు. పాత కర్నూలు, అనంతపురం, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఈ మార్గం ఉంది. ఇది ఎక్కువభాగం అటవీ ప్రాంతంలోనే ఉందని, పెన్నా నది ప్రవాహ ప్రాంతంలో కొన్ని జనవాసా లున్నప్పటికీ పులుల రాకపోకలకు పెద్దగా ఆటంకం కాకపోవచ్చని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మార్గంలో ఇప్పటికే రెండు పులులు సురక్షితంగా ప్రయాణం చేశాయని చెప్పారు. శ్రీశైలం అభయారణ్యం నుండి శేషాచల అడవుల వరకు ఆ పులులు వెళ్లివచ్చినట్లు గుర్తించినట్లు చెబుతున్నారు. అవి ప్రయాణం చేసిన మార్గాన్నే పులుల కారిడార్‌గా ప్రతిపాదించారు. దీనిని అధికారికంగా నోటిఫై చేయాల్సిఉంది.

బ్రిక్స్ తో తమకు ప్రమాదం అంటూ పశ్చిమ దేశాల ప్రచారం

నెల్లూరు నరసింహారావు

ప్రచ్ఛన్న యుద్ధం ముగిసి ముప్పై ఏండ్లు గడిచినా పశ్చిమ దేశాలు ఆ మానసిక స్థితి నుంచి బయటకు రాలేకపోతున్నాయి. అందుకే చైనా, రష్యాలు ప్రమాదకర దేశాలుగా వీటికి కనపడుతున్నాయి. మరోవిధంగా చెప్పాలంటే చైనా, రష్యాలు క్రియాశీలకంగావున్న బ్రిక్స్ విస్తరణను నాటో కూటమి దేశాలు ప్రమాదకరంగా భావిస్తున్నాయి.


2009లో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో బ్రిక్స్ ఏర్పడింది. ఆ తరువాత రెండు సంవత్సరాలకు దక్షిణాఫ్రికా చేరింది. ఈ కలయికతో పశ్చిమ దేశాల మీడియాకు మంచిపని దొరికినట్టయింది. ఈ దేశాల మీడియాలో 'నాటోకు సవాల్', ఒక 'నూతన ప్రపంచ క్రమం', 'పశ్చిమ దేశాల అస్తిత్వానికి పెను ప్రమాదం' వంటి పతాక శీర్షికలు దర్శనమిస్తున్నాయి. తాజాగా జొహాన్నెస్ బర్గ్ లో గత వారం జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం తరువాత ఇటువంటి శీర్షికలు మరిన్ని కనిపిస్తాయి.

ఇదో విచిత్ర పరిస్థితి. కానీ బ్రిక్స్ 'పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకమైన దేశాల'ను ఐక్యం చేయటం లేదనేది కాదనలేని సత్యం. బ్రిక్స్ పేద దేశాల గ్రూపు కూడా కాదు. వ్యవస్థాపక ఐదు దేశాలలో రష్యా ఎప్పటినుంచో అభివృద్ధి చెదిన దేశంగా పరిగణింపబడుతోంది. ఈ దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో దాదాపు మూడవ వంతు ఉన్నాయి. బ్రిక్స్ తో పశ్చిమ దేశాలకు ప్రమాదం అనే వాదనకు ఎటువంటి ఆధారమూ లేదు. అసలు బ్రిక్స్ ను నాటో కూటమితో పోల్చటమే సరియైనది కాదు. ఎందుకంటే బ్రిక్స్ గ్రూపుకు సమిష్టి సైనిక దళాలు లేవు. సమిష్టి సైనిక కార్యక్రమం కూడా లేదు. సంయుక్త సైనిక విన్యాసాలలో కూడా అన్ని దేశాలు పాల్గొనవు.

సభ్యదేశాల మధ్య సైనిక సహకారం బ్రిక్స్ పరిధిలోని అంశం కాదు. అలాగే సాయుధ సంఘర్షణలపట్ల దేశాల వైఖరి కూడా బ్రిక్స్ పరిధిలోని అంశం కాదనే వాస్తవాన్ని జొహాన్నెస్ బర్గ్ శిఖరాగ్ర సమావేశంలో జరిగిన చర్చలు తెలియజేశాయి. ఉదాహరణకు చైనా ప్రపంచ భద్రతకు సమిష్టి వైఖరి ఉండాలని 'ప్రపంచ భద్రతకు చొరవ' అనే విషయాన్ని ప్రతిపాదించింది. తాము ఏ కూటమిలోనూ భాగస్వాములం కాదని శిఖరాగ్ర సమావేశానికి ముందు దక్షిణ అమెరికా అధ్యక్షుడు, సిరిల్ రమాఫోసా ప్రకటించాడు. ఈ రెండు ప్రకటనలు నాటో కూటమి విస్తరణను, ప్రపంచ రాజకీయాలను ధ్రువీకరింపజేయటాన్ని(పోలరైజ్) వ్యతిరేకించేవని భావించే అవకాశం ఉంది. అలాగే ఉక్రెయిన్ లో జరుగుతున్న యుద్ధంలో రష్యాకు షరతులులేని మద్దతును నిరాకరించేదని కూడా అనుకునే వీలుంది. సైనిక స్వభావంలేని బ్రిక్స్ లక్షణం ఘర్షణలపట్ల ఆసక్తిలేని దేశాలను విపరీతంగా ఆకర్షిస్తోంది.

ప్రపంచ క్రమాన్ని(వరల్డ్ ఆర్డర్) నియంత్రించే విషయంలో కూడా బ్రిక్స్ గ్రూపుకు పెద్దగా ఆసక్తిలేదు. వర్తమాన ప్రపంచ క్రమాన్ని కూలదూసే ప్రతిపాదనేదీ బ్రిక్స్ ముందులేదు. ఐక్యరాజ్య సమితి, జీ-20 దేశాల పట్ల బ్రిక్స్ సానుకూలంగా వ్యవహరిస్తుంటుంది. బ్రిక్స్ సభ్య దేశాలు ఐక్యరాజ్య సమితి తీర్మానాలతోను, పేదరికంపైన పోరాటం చేసేందుకు ఉద్దేశింపబడిన జీ-20 ప్రణాళికలను, ప్రపంచ ఆర్థిక సమస్యల పరిష్కారం చేసేందుకు జీ-20 నాయకత్వాన్నిఆమోదిస్తుంటాయి. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా అన్నట్లు బ్రిక్స్ దేశాలు తమను తాము సమీకరించుకోవాలని అనుకుంటున్నాయి.

బ్రిక్స్ గ్రూపు ఆసక్తి, బలం దాని సభ్యదేశాల ఆర్థిక వ్యవస్థలో ఉంది. మిగిలిన రంగాలన్నింటికంటే ఈ



రంగంలో బ్రిక్స్ మెరుపువేగంతో ముందుకు పోతోంది. ఇందుకు ఉదాహరణగా రెండు రంగాలను చెప్పుకోవచ్చు. ఒకటి: ద న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు. రెండవది: ద కాంటిన్జెంట్ రిజర్వ్ అరేంజ్‌మెంట్. 2015లో స్థాపించినన న్యూ డెవెలప్మెంట్ బ్యాంకు ప్రపంచ బ్యాంకుకు పోటీగా ఇన్ఫ్రా పోజక్టులకు పెద్ద మొత్తంలో అప్పులిస్తుంది. అయితే ఈ బ్యాంకును అప్పుడే ప్రపంచ బ్యాంకుతో పోల్చలేము. అయితే ఈ బ్యాంకు షరతులు చాలా ఉదారంగా ఉండటంవల్ల అప్పుల కోసం డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. బ్రిక్స్ సభ్యదేశాలు లిక్విడిటీ సంక్షోభంలోపడినప్పుడు ఆదుకోవటానికి కామన్ కరెన్సీల రిజర్వ్ తో కూడిన కాంటిన్జెంట్ రిజర్వ్ అరేంజ్‌మెంట్(సీఆర్‌ఏ) ఏర్పడింది. వాణిజ్యం సాఫీగా సాగటానికి, తీవ్ర సంక్షోభం ఏర్పడినప్పుడు ఆర్థిక అవసరాలను తీర్చటానికి అవకాశం కలిగేలా సీఆర్‌ఏని రూపొందించారు. ప్రపంచ ఆర్థికాభివృద్ధికి అవరోధంగా పెట్టుబడులు అడుగంటినప్పుడు, కొన్ని సభ్యదేశాలపైన ఆంక్షలను విధించినప్పుడు ఇటువంటి రిజర్వ్ ఉపయోగకరంగా ఉంటుంది. 'కరెన్సీ ఇన్సూరెన్స్' కే కాకుండా యూరోవంటి బ్రిక్స్ కరెన్సీ ని సృష్టించటానికి కూడా సిఆర్‌ఏ సహాయపడుతుంది. ఇప్పటికే చైనా, రష్యా, ఇండియా సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ(సీబీడీసీ)ని ప్రవేశపెట్టాయి. బ్రాజిల్, సౌత్ ఆఫ్రికాలు కూడా అందుకు సిద్ధపడుతున్నాయి. అయితే ఇది అంత తేలికగా ఆచరణలోకి తీసుకునివచ్చే ప్రక్రియ కాదు. అన్నింటికంటే ముఖ్యంగా స్విఫ్ట్ లాగా స్వేచ్ఛగా చెల్లింపులు చేసే వ్యవస్థను రూపొందించుకునే తక్షణ లక్ష్యం బ్రిక్స్ ముందు ఉంది.

జొహాన్నెస్ బర్గ్ శిఖరాగ్ర సభలో అనేక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిలో బ్రిక్స్ ను విస్తరించటం ముఖ్యమైనది. అర్జంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియాల కోరికమేరకు బ్రిక్స్ లో చేరటానికి ఆహ్వానించటం జరిగింది. 2024 జనవరి 1వ తేదీనుంచి ఈ దేశాలు అధికారికంగా బ్రిక్స్ లో చేరతాయి. ఈ దేశాలు చేరిన తరువాత ప్రపంచ జనాభాలో బ్రిక్స్ దేశాల జనాభా 45శాతం ఉంటుంది. గోధుమలు, వరి ప్రపంచ ఉత్పత్తిలో సగం, 17శాతం బంగారం నిల్వలు బ్రిక్స్ దేశాలలో ఉంటాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రపంచ చమురు ఉత్పత్తిలో 80శాతం బ్రిక్స్ దేశాల నుంచే వస్తుంది. సౌదీ అరేబియా, రష్యా, ఇరాన్, యుఏఇ వంటి చమురును సరఫరాచేసే దేశాలు, చైనా, ఇండియావంటి చమురును పెద్ద ఎత్తున వినిమయం చేసే దేశాలు ఆయా దేశాల జాతీయ కరెన్సీలలో వాణిజ్యం జరుపుతుంటే డాలర్ ఆధిపత్యం పునాదులు కదులుతాయి. ప్రపంచంలోనే అత్యంతగా చమురును దిగుమతి చేసుకునే చైనా కరెన్సీ యువాన్ లో సెటిల్మెంట్లు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీనితో 'నిర్ డాలరీకరణ(డీడాలరైజేషన్)' జరగనప్పటికీ డాలర్ బలహీనపడుతుంది.ఇలా అంతర్జాతీయ రాజకీయాలలో బ్రిక్స్ ఒక ప్రజాస్వామిక ప్రత్యామ్నాయంగా ముందుకు వస్తోంది. దీని ప్రభావం గణనీయంగా ఉంటుందనే పశ్చిమ దేశాలు భయపడుతున్నాయి. నయావలసవాద విధానాలకు కాలం చెల్లిందనే విషయాన్ని పశ్చిమ దేశాలకు బ్రిక్స్ ద్వారా చరిత్ర మరోసారి గుర్తు చేస్తోంది.